
RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:303 హైదరాబాద్, గురువారం, 29 మే 2025 పేజీలు: 12 వెల: 1.00

## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

హైదరాబాద్, మే 28: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు



సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు.

పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్-1లో 89% పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు.

ఇంకా సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే.. ఈ రోజు అంటే బుధవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని గుర్తు చేశారు. వారి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నామన్నారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని ఆయన స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు%ౌ% మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావాన్ని వీడాలంటూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మనూన్యత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు తెచ్చారని గుర్తు చేశారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతేకాదు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు.. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొన్నారు.

వాళ్లింట్లో ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరగకుండానే ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కానీ మీకు మాత్రం ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. అలాంటి వారు మీకు ఎదురైతే ప్రశ్నించండంటూ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే మీరు మీ జీవితంలో రాణిస్తారన్నారు. తప్పుదారి పడితే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దంటూ విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడండి.. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకే కాదు.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు.

వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని వివరించారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా తాను కోరుకుంటున్నానని తెలిపారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## రాజ్యసభకు కమల్‌హాసన్..

మక్కల్ నీది మయ్యం () పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ (రాజ్యసభకు వెళ్లనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎంఎన్‌ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. ఈ విషయాన్ని డీఎంకే-ఎంఎన్ఎం ఖరారు చేశాయి.



ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఆరు, అస్సాంలో రెండు సీట్లు వీటిల్లో ఉన్నాయి. తమిళనాడుకు చెందిన అన్బుమణి రామదాస్, ఎం. షణ్ముగమ్, ఎన్. చంద్రశేగరన్, ఎం.మహమ్మద్ అబ్దుల్లా, పి.విల్సన్, వైగో ఎగువసభ పదవీకాలం జులై 25తో ముగిసింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దాంతో నాలుగు స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంటుందని తెలుస్తోంది.

ఇదిలా ఉంటే.. విపక్ష ఇండియా కూటమిలో ఎంఎన్ఎం భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. ఆయన 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, గ్రామాల సాధికారత కోసం దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### అన్నాడీఎంకే బలం అంతంతే..

భాజపా మద్దతు కీలకం

అన్నాడీఎంకేకు ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల బలంతో ఒక్క రాజ్యసభ ఎంపీ గెలుస్తుంది. ఒకవేళ మరో అభ్యర్థిని కూడా గెలిపించుకోవాలని భావిస్తే అది భాజపా, పీఎంకే ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. భాజపా ప్రస్తుతం అన్నాడీఎంకే పక్షానే ఉంది. తప్పకుండా ఇరుపార్టీలు సహకరించుకునే అవకాశం ఉంది.

## 14 పంటలకు MSP పెంపు..

### బద్వేల్-నెల్లూరు 4లేన్ రోడ్డు అభివృద్ధికి కేంద్రం ఆమోదం

దిల్లీ: కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ వరిపై రూ.69 పెంచడంతో కనీస మద్దతు ( ధర రూ.2369కి చేరింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. గత 10-11 ఏళ్లలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పీ భారీగా పెంచినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం ఎంఎస్‌పీ పెంపును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. ఆయా పంటలకు ఎంఎస్‌పీ కోసం రూ.2.7లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కోట్లుతో పాటు అన్నదాతల పెట్టుబడిపై 50శాతం మార్జిన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



మరోవైపు, ఏపీలోని బద్వేల్-నెల్లూరు నాలుగు వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,653 కోట్లతో 108.134 కి.మీల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనుంది. బద్వేల్‌లోని గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలోని గురివిందపూడి వరకు నిర్మాణం చేపట్టే ఈ కారిడార్‌తో కృష్ణపట్నం పోర్టుకు ప్రయాణ దూరం దాదాపు 33.9 కిలోమీటర్లు తగ్గనుంది. అలాగే, ఈ కారిడార్ నిర్మాణంతో భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్రం తెలిపింది.

## అనుకున్న సమయానికే రైతుభరోసా నిధులు జమ చేస్తాం: మంత్రి తుమ్మల


హైదరాబాద్: రైతులకు మంచి రోజులు వస్తున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చిన్న రాష్ట్రం, కొత్త రాష్ట్రమైన తెలంగాణ ఆర్థిక సమస్యల్లో చిక్కుకుందని చెప్పారు. వాటిని అధిగమించి సీఎం రేవంత్‌రెడ్డి ( రుణమాఫీ చేశారన్నారు. గతేడాది మొదటి పంట కాలంలోనే రైతుల ఖాతాల్లో రూ.33 వేల కోట్లు వేశారన్నారు. దేశంలోనే అత్యధిక ధాన్యం సేకరించిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. అనుకున్న సమయానికే రైతుభరోసా నిధులు వేస్తామని హామీ ఇచ్చారు. అతి త్వరలోనే నల్గొండ జిల్లాలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.



## జూన్ 8 న చేప ప్రసాదం పంపిణీ

హైదరాబాద్

జూన్ 8 నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో ఉదయం చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు తెలియచేశారు. మృగశిర కార్తీ జూన్ 8 ఆదివారం ఉదయం10 గం లకు ప్రవేశిస్తుందని...ఆ రోజునే చేప ప్రసాదం పంపిణి చేస్తామని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో వివరాలు తెలిపారు. కీర్తి శేషులు బత్తిని హరినాథ్ గౌడ్ తనయుడు బత్తిని అమర్నాథ్ గౌడ్, మరియు ఇతర కుటుంబ సభ్యులు శివ శంకర్ గౌడ్, గౌరీ శంకర గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, సంతోష గౌడ్, శివ గౌడ్ పాల్గొన్నారు. దేశ, విదేశాల నుండి లక్షలాది మంది వస్తుంటారని... అందుకోసం ఎవ్వరికీ ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పంపిణి సజావుగా సాగడానికి ఈ సంవత్సరం ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. జి హెచ్ ఎం. సి. వాటర్ వర్క్స్, ఆర్టీసీ, మునిసిపాలిటీ, పోలీస్, విద్యుత్తు శాఖ తో పాటు మత్స్యశాఖాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉన్నామన్నారు. దాదాపు రెండు శతాబ్దాలుగా తమ కుటుంబం ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ



వ్యాధుల నివారణకు మృగశిరా కార్తీ ప్రవేశించిన ఘడియల్లో ఓ పదార్థాన్ని చేప ద్వారా రోగి నోట్లో వేస్తామని, అది వ్యాధి తీవ్రతను బట్టి రోగి నాల్గు నుండి ఐదు సంవత్సరాలు తీసుకుంటే పూర్తిగా నయం అవుతోందని అన్నారు. నిస్వార్థంగా ఉచితంగా లక్షలాదిమంది శ్వాస సంబంధిత రోగులకు చాప మందు ఇస్తున్నామన్నారు. అత్యవసర వైద్య సదుపాయంతో పాటు క్యూ లైన్ లో రోగులు ఇబ్బందులు పడకుండా రెండు వందల మంది వాలంటీర్లు సేవలందిస్తారని స్పష్టం చేశారు.

## జూన్ 5న ఏం జరగబోతోంది.,.

హైదరాబాద్, మే 28,

కాళేశ్వరం కమిషన్ ఎదుటకు విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. జూన్ నెల 5వ తేదీన కమిషన్ ఎదుట హాజరు కావాలని కమిషన్ ఇచ్చిన నోటీసులు జారీచేసింది. అయితే ఈ విచారణకు కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్న దానికిసంబంధించి కేసీఆర్ క్లారిటీ ఇచ్చారు. పార్టీలోని సీనియర్ నేతలకు కేసీఆర్ సమాచారం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దయెత్తున అవినీతి జరిగిందని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను నియమించింది. ఈ కమిషన్ కేసీఆర్, ఈటల రాజేందర్, హరీశ్ రావులకు నోటీసులు జారీ చేసింది. జూన్ ఆరో తేదీన ఈటల రాజేందర్, 9వ తేదీన హరీశ్ రావు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. అయితే కేసీఆర్ హాజరవుతుండటంతో హరీశ్ రావు కూడా హాజరు కానున్నారు. కమిషన్ ఎదుట హాజరయి ప్రశ్నలకు నేరుగా కేసీఆర్ సమాధానం చెప్పాలని నిర్ణయించినట్లు తెలిసిందికాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది తెలంగాణ ప్రభుత్వం. జస్టిస్ ఖఅ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా పూర్తయ్యే దశకు చేరుకుంది. ఈ చివరి దశలో అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. జూన్ 5న కేసీఆర్, జూన్ 6న ఈటెల రాజేందర్, చివరగా జూన్ 9న హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.నోటీసు అందుకున్న అప్పటి నుంచి పార్టీలో కాళేశ్వరం కమిషన్ ముందుకు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది. ఇప్పటికీ కెసిఆర్ ఫామ్ హౌస్ లో చాలాసార్లు దీనిపై చర్చించారు. పార్టీతో పాటు న్యాయ నిపుణులతో చర్చలు జరిపి సలహాలు తీసుకున్నారు. గతంలో విద్యుత్ కొనుగోళ్లపై వేసిన కమిషన్ పై నోటీసు అందుకున్న కేసీఆర్ చాలా తీవ్రంగా ప్రతిస్పందించారు. కమిషన్‌కు లేఖ రాస్తూ కమిషన్ ఏర్పాటు, కమిషన్ గా ఉన్న జస్టిస్ నరసింహారెడ్డి అక్కడ కొనసాగడం తప్పంటూ తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు మాత్రం ఆ పంథాలో వెళ్లకూడదని భావిస్తున్నట్లు తెలిసింది.అయితే నిజానికి పోయిన ఏడాది అసెంబ్లీలో కాళేశ్వరంపై కావాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించుకోండి అంటూ సవాల్ విసిరిందే బీఆర్ఎస్. తీరా ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తర్వాత హాజరు కాకపోతే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని, కమిషన్‌ను గౌరవించకపోతే అది బీఆర్ఎస్ పై దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. హాజరైతే ప్రజల్లో సింపతీ పెరుగుతుందని, ప్రభుత్వం కావాలనే కక్ష గట్టి విచారణలకు తిప్పుతుందని సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారు. మొత్తానికి మొదటిసారిగా ఓ విచారణకు గులాబీ దళపతి హాజరవుతారని తెలుస్తోంది. మరోవైపు పార్టీలో గంభీర వాతావరణం కనిపిస్తుంది. జూన్ 5 బిగ్ డే అంటూ చర్చిస్తున్నారు కార్యకర్తలు.ఇక కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే 400 పేజీల నివేదికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కీలక పోస్టులను డీల్ చేసిన అధికారులు సోమేష్‌కుమార్, స్మిత సబర్వాల్, రజత్‌కుమార్ వంటి వారిని బహిరంగ విచారణకు పిలిచింది. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు, కాళేశ్వరంగా రూపాంతరం చెందడం మొదలు, ప్రాజెక్టు డిజైన్‌లు, అనుమతులు, నిధులకు సంబంధించిన కీలక సమాచారాన్ని రికార్డు చేసింది. ముఖ్య ప్రాజెక్టు వ్యయాన్ని లక్ష కోట్లకు పెంచడంపై ఆరా తీసింది. నిర్మాణం పూర్తి కాకుండానే బకాయిల చెల్లింపుపై కూడా కూపీలాగింది.ఈ సమాచారాన్ని క్రోడికరించిన పీసీ ఘోష్ కమిషన్.. గత ప్రభుత్వ హయాంలో కీలక నిర్ణయాలు తీసుకున్న పెద్దలను ప్రశ్నించాలని నిర్ణయించింది. ఆ క్రమంలోనే నోటీసులు జారీ అయ్యాయి. ఇక, మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రులు హరీష్‌రావు, ఈటల విచారణకు సంబంధించి ఇప్పటికే కొశ్చనరీ సిద్ధమైందా? టెక్నికల్ అంశాలతో పాటు నిధుల వ్యవహారంపై కూడా కమిషన్ ప్రధానంగా ఫోకస్ చేసిందా?. నోటీసులపై బీఆర్ ఎస్, ముఖ్యంగా కేసీఆర్ స్ట్రాటెజీ ఎలా వుండబోతుందన్నది చర్చగా మారింది.

భారత శక్తి
VOICE OF INDIAN

## కంపెనీలు కన్నడ ఎందుకు వీడుతున్నాయి...

బెంగళూరు బహుసాంస్కృతిక, బహుభాషా నగరంగా పేరొందినప్పటికీ, ఇటీవలి కాలంలో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది.బెంగళూరు, భారతదేశ టెక్ రాజధానిగా పేరొందిన నగరం. ఇటీవలి కాలంలో భాషా సంబంధిత వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. గత వేసవిలో నీటి సమస్య బెంగళూరును వేధించింది. ఈ వేసవిలో వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈక్వల్ లైఫ్ అనే సంస్థ తమ కార్యాలయాన్ని బెంగళూరు నుంచి పుణెకు తరలించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం బెంగళూరు యొక్కవాణిజ్య వాతావరణంపై, ముఖ్యంగా టెక్ రంగంపై, గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది.బెంగళూరు బహుసాంస్కృతిక, బహుభాషా నగరంగా పేరొందినప్పటికీ, ఇటీవలి కాలంలో కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు మహారాష్ట్రలో మరాఠీ ఉద్యమాల తరహాలో బెంగళూరులో కన్నడ ఉద్యమాలు తీవ్రమవుతున్నాయి. స్థానిక కన్నడిగులు తమ భాష, సంస్కృతిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఈ ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో ఇవి ఘర్షణలకు దారితీస్తున్నాయి. బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లు, ఇతర వ్యాపారాలు బెంగళూరులో విస్తృతంగా ఉన్నాయి, వీటిలో ఉద్యోగులు దేశవ్యాప్తంగా వివిధ భాషా నేపథ్యాల నుంచి వస్తుంటారు. కన్నడ భాషను తప్పనిసరిగా ఉపయోగించాలనే ఒత్తిడి, ముఖ్యంగా బహిరంగ సైన్‌బోర్డులు, కార్యాలయ సమాచారంలో, కొంతమంది ఉద్యోగులకు, సంస్థలకు అసౌకర్యంగా మారింది. ఈక్వల్ లైఫ్ సంస్థ అధినేత కౌశిక్ ముఖర్జీ ఈ భాషా గొడవలు తమ సిబ్బందిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని స్పష్టం చేశారు. ఈక్వల్ లైఫ్ సంస్థ బెంగళూరు నుంచి పుణెకు తమ కార్యాలయాన్ని తరలించాలని నిర్ణయించడం ఒక ముఖ్యమైన అడుగు. కౌశిక్ ముఖర్జీ తన ఎక్స్ పోస్ట్‌లో, 'వచ్చే ఆరు నెలల్లో మా కార్యాలయాన్ని పుణెకు షిఫ్ట్ చేస్తాం. మా సిబ్బందిని ఈ భాషా సంబంధిత గొడవల బాధితులుగా మారనివ్వం,' అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను పరిశీలిస్తే, సంస్థలు తమ ఉద్యోగుల మానసిక శాంతి, ఉత్పాదకత, వ్యాపార స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. పుణే, బెంగళూరుతో పోలిస్తే, టెక్ హబ్‌గా ఉద్భవిస్తూ, సాపేక్షంగా తక్కువ భాషా సంబంధిత వివాదాలతో వ్యాపార స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తోంది.పుణే, మహారాష్ట్రలోని మరో ముఖ్యమైన టెక్ కేంద్రం, ఇటీవలి సంవత్సరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. బెంగళూరుతో పోలిస్తే, పుణేలో భాషా సంబంధిత ఒత్తిడి తక్కువగా ఉంది, ఎందుకంటే ఈ నగరం బహుభాషా, బహుసాంస్కృతిక వాతావరణానికి పెట్టింది పేరు. అదనంగా, పుణేలోని హింజవాడి, బంజర్, ఖరడి వంటి ప్రాంతాలు టెక్ పార్కులు, స్టార్టప్‌లకు అనువైన మౌలిక సదుపాయాలను అందిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన జీవన వ్యయం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, మెరుగైన కనెక్టివిటీ పుణేను కంపెనీలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చాయి. ఈక్వల్ లైఫ్ ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని పుణేను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈక్వల్ లైఫ్ లాంటి సంస్థలు బెంగళూరును వీడడం దీర్ఘకాలంలో నగర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు. బెంగళూరు భారతదేశ ఐటీ రంగంలో సుమారు 40% వాటాను కలిగి ఉంది. అనేక బహుళజాతి సంస్థలు, స్టార్టప్‌లకు గమ్యస్థానంగా ఉంది. భాషా వివాదాలు ఇలాంటి సంస్థలు నగరాన్ని వీడేందుకు దారితీస్తే, ఇది ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ఇప్పటికే కొన్ని ఇతర సంస్థలు కూడా ఇదే బాటలో పుణే, హైదరాబాద్, లేదా చెన్నై వంటి నగరాలకు షిఫ్ట్ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామం బెంగళూరుకు ఉన్న 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా' హోదాకు సవాలుగా మారవచ్చు.బెంగళూరులో భాషా వివాదాలు కేవలం సామాజిక సమస్యలకు మాత్రమే పరిమితం కాదు.. ఇవి రాజకీయ కోణాన్ని కూడా కలిగి ఉన్నాయి. స్థానిక భాష, సంస్కృతిని కాపాడాలనే డిమాండ్లు స్థానిక రాజకీయ పార్టీలు, సంస్థల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. అయితే, ఈ డిమాండ్లు అతిగా మారినప్పుడు, అవి బహుసాంస్కృతిక నగరం స్వభావాన్ని దెబ్బతీస్తాయి. కర్ణాటక ప్రభుత్వం ఇటీవల కన్నడ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని చట్టాలు తీసుకువచ్చినప్పటికీ, వీటిని అమలు చేసే విధానంలో సమతుల్యత కీలకం. ఈ వివాదాలు కంపెనీల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని ఈక్వల్ లైఫ్ ఉదాహరణ స్పష్టం చేస్తోంది.

# తూర్పుగోదావరి జనసేనకు ఇచ్చేశారా...

రాజమండ్రి, మే 28, (

తూర్పుగోదావరి జిల్లా కాపు సామాజికవర్గం నేతలు టీడీపీలో ఉంటే వారికి భవిష్యత్ లేనట్లే పదవులు కష్టమేనా? అంటే అవుననే అనిపిస్తుంది. ఎందుకంటే తూర్పు గోదావరి జిల్లాలో కాపు సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలకు ఈసారి కేబినెట్ లో స్థానం దక్కలేదు. కాపులు అంటే జనసేన అని ముద్రపడిపోయింది. దీంతో గత కొన్ని దశాబ్దాలుగా టీడీపీ కోసం పనిచేస్తున్న కాపు నేతలు ఈసారి పదవులు లేకుండా పోవడానికి జనసేన కారణమని చెప్పక తప్పదు. ఎందుకంటే మంత్రివర్గం కూర్పులో కాపు సామాజికవర్గానికి చెందిన ముగ్గురికి పదవులు లభించాయి. అందులో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు, నెల్లూరుకు చెందిన నారాయణ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన అచ్చెన్నాయుడులకు మాత్రమే దక్కాయి. వాసంశెట్టి సుభాష్ కు లభించినా శెట్టి బలిజ కావడంతో కాపులు పరిగణనలోకి తీసుకోరు తూర్పు గోదావరి జిల్లా టీడీపీలో సీనియర్ నేతలు లేరంటే లేరని కాదు. చాలా మంది ఉన్నారు. నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, యనమల రామకృష్ణుడు, జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు వంటి వారు ఉన్నప్పటికీ వారికి మంత్రి పదవులు దక్కలేదు. జనసేనకు చెందిన పవన్ కల్యాణ్, కందుల దుర్గేష్ వంటి వారికి పదవులు లభించడంతో ఇక టీడీపీలో కాపు సామాజికవర్గానికి చెందిన నేతలకు మంత్రి పదవులు ఇవ్వలేకపోయారు. ఇక నామినేటెడ్ పదవుల విషయంలోనూ తూర్పు గోదావరి జిల్లాలో జనసేనలో ఉన్న కాపు నేతలకే ప్రాధాన్యత దక్కుతుండటంతో కొంత టీడీపీ నేతల్లో అసహనం వ్యక్తమవుతుంది. టీడీపీలో కూటమి ప్రభుత్వం ఉన్నంత కాలం తమకు పదవులు రావని నేతలు డిసైడ్ అయ్యారు. ఒకరకంగా చెప్పాలంటే తూర్పు గోదావరి జిల్లాను జనసేనకు రాసిచ్చినట్లే కనపడుతుందని ఒక టీడీపీ సీనియర్ నేత వ్యాఖ్యానించారంటే పరిస్థితికి అద్దం పడుతుంది. పవన్ కల్యాణ్ సూచించిన వారికే తూర్పు గోదావరి జిల్లాలో నామినేటెడ్ పదవుల నుంచి అన్ని రకాల పదవులు లభిస్తుండటంతో ఇక అటు వైపు చూడటం కూడా వృధా అని నేతలు భావించే పరిస్థితికి వచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా తూర్పు గోదావరి జిల్లాలో ప్రాబల్యం చేయగలనేత పవన్ కల్యాణ్ అని భావించి జనసేనకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లాలోని టీడీపీ నేతలు సైకిల్ ఎక్కి రాజకీయంగా ప్రయాణించడం కంటే గాజు గ్లాసు పట్టుకోవడం మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. ఒకప్పుడు కంచుకోటగా... తూర్పు గోదావరి జిల్లా అంటే ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. బలమైన ఓటు బ్యాంకు కూడా ఉంది. కేవలం కాపు సామాజికవర్గమే కాకుండా ఆ జిల్లాలో ఉన్న బీసీలతో పాటు మిగిలిన సామాజికవర్గం నుంచి కూడా ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీకి అండగా నిలిచింది. అలాంటి చోట గత ఏడాది కాలం నుంచి టీడీపీ నేతల్లోనూ క్యాడర్ లోనూ నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. కొందరు నేతలు బహిరంగంగానే బయటపడుతున్నప్పటికీ మరికొందరు మాత్రం లోలోపల మదనపడుతున్నారు. అధికారంలో ఉండేందుకు ఇంకా నాలుగేళ్ల సమయం ఉండటంతో వేచి చూద్దామని ధోరణిలో మరికొందరు నేతలున్నారు. అందుకే తమ రాజకీయ భవిష్యత్ ను గోదారిలో కలపవద్దంటూ పార్టీ నేతలు అధినాయకత్వానికి మొరపెట్టుకుంటున్నారు.

# మహానాడులో అంతా చినబాబుదే

కడప, మే 28,



కడప మహానాడులో నారా లోకేశ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. మహానాడు వేదికగా ఆరు శాసనాలను ప్రకటించారు. నారా లోకేశ్ ప్రసంగం కూడా కార్యకర్తలే తనకు అధినేతలు ఆయన చెప్పుకొచ్చారు. భవిష్యత్ లో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలకే పెద్దపీట వేస్తుందని కూడా మహానాడు వేదికగా లోకేశ్ హామీ ఇచ్చారు. కార్యకర్తలు నేతలపైన ఆధారపడవద్దని జనంలోకి వెళ్లాలని, అప్పుడే వెతుక్కుంటూ తెలుగుదేశం పార్టీ మీ వెంట వస్తుందని నారా లోకేశ్ అసలు సీక్రెట్ చెప్పుకొచ్చారు. కార్యకర్తల సంక్షేమానికి తమ పార్టీ ఎప్పుడూ పాటుపడుతూనే ఉంటుందని, అందుకే దేశంలో ఏ పార్టీకి లేనంతగా కోటి సభ్యత్వాలు ఒక్క తెలుగుదేశం పార్టీకి మాత్రమే ఉన్నాయని లోకేశ్ అన్నారు.. ఇక నారా లోకేశ్ ఈ మహానాడులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికవుతారన్న ప్రచారం ఊపందుకోవడంతో ఉన్నత స్థాయిలో ఉన్న నేతల నుంచి దిగువ స్థాయి నేతల వరకూ నారా లోకేశ్ దృష్టిలో పడటానికి ప్రయత్నించేందుకు ఎక్కువ పాటుపడుతున్నట్లు కనిపించింది. నారా లోకేశ్ ప్రసంగానికి మంచి రెస్పాన్స్ రావడం జిట్టి లోకేశ్ నాయకత్వాన్ని తాము సమర్థిస్తున్నామని చప్పట్లతో చెప్పకనే నేతలు, కార్యకర్తలు చంద్రబాబుకు చెప్పేశారు. ప్రధానంగా తనకు పుంగనూరులో అంజిరెడ్డి తాత, మంజుల అక్క, పల్నాడులో తోట చంద్రయ్య తనకు స్ఫూర్తి అంటూ చెప్పుకొచ్చిన లోకేశ్ వారిని ఆదర్శంగా తీసుకుని తాను ముందుకు వెళతానని కూడా చెప్పుకొచ్చి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు... నారా లోకేశ్ కు ఈ మహానాడు ఎంతో ప్రత్యేకం. ఇప్పటి వరకూ ఎన్ని మహానాడులు జరిగినప్పటికీ గత మహానాడులో పార్టీ అధికారంలో లేదు. అయినా లోకేశ్ అప్పుడు తన ప్రసంగంతో కొంత కార్యకర్తల్లో ఉత్సాహం నింపినా, కడప జిల్లాలో జరిగే మహానాడు మాత్రం తనలోని నాయకుడిని కార్యకర్తలకు చూపించిన తర్వాత మాత్రమే ఆయన లీడర్ గా ఎదిగానని చెప్పుకోవడానికి ఏమాత్రం సంకోచించలేదు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయిన మంగళగిరి నుంచి మాత్రమే పోటీ చేసి తిరిగి గెలవడంతో పాటు యువగళం పాదయాత్రతో కార్యకర్తలు, నేతలను ఏకం చేయడంలో లోకేశ్ సక్సెస్ అయిన తీరు కూడా పార్టీలో ఆయన ఎదుగుదలకు కారణమయిందని చెప్పాలి. అందుకే లోకేశ్ వెనక ఎవరు ఉన్నారన్నది పక్కన పెడితే ఆయన ఆలోచనలు, తీసుకునే నిర్ణయాలు, అందుబాటులో ఉండే సమయం వంటివి అదనపు బలాలుగా మారాయని చెప్పకతప్పదు.

పదవులు తెచ్చే వేదిక

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు బయటకు వస్తాయి. తెలుగుదేశం పార్టీ స్థాపించి దాదాపు నాలుగు వసంతాలు కావడంతో అక్కడ పుట్టి.. పెరిగిన రాజకీయ నేతలు తర్వాత మంచి స్థానంలోకి వెళ్లారు. కొందరు ముఖ్యమంత్రులు కాగా, మరికొందరు కీలకమైన మంత్రి పదవులను దక్కించుకున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి వచ్చి బయటకు వెళ్లిన వారు ఇతర పార్టీల్లో చేరి మంత్రులుగా చేసిన వారు అధికంగా కనిపించే వారు. కానీ ఇప్పుడు మాత్రం రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వాళ్లే మంత్రులు, ముఖ్యమంత్రులుగా అధికంగా ఉండటం కనిపిస్తుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న వాళ్లు వివిధ కారణాలతో పార్టీ మారి ముఖ్యమంత్రులుగానో, మంత్రులుగానో మారిపోయారు. తాజాగా మహానాడు కడపలో జరుగుతున్న సమయంలో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. ఎన్టీఆర్ హయాం నుంచి మహానాడు ప్రారంభమయింది. నాడు మహానాడులో పాల్గొని తర్వాత రాజకీయాల్లో ఉన్నత స్థాయికి వెళ్లిన వారు, అమాత్యపదవులు అందుకున్న వారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది పొలిటీషియన్స్ తెలుగుదేశం పార్టీలో రాజకీయ ఓనమాలు దిద్దిన తర్వాత ఎదిగి బుగ్గకార్లు ఎక్కిన వారు అనేక మంది ఉన్నారు. మహానాడులో ఇది చర్చనీయాంశంగా మారింది. అతెందుకు రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత తెలంగాణకు ముఖ్యమంత్రులు అయిన ఇద్దరూ టీడీపీకిచెందిన వారే. కేసీఆర్, రేవంత్ రెడ్డి అక్కడి నుంచి వచ్చిన వారే. నాడు జరిగిన మహానాడులో వారు చేసిన ఉపన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అందుకే నేటి తరం రాజకీయ నేతలకు మహానాడుతో విడదీయరాని బంధం ఉంది. నాడు మహానాడు వేదికపై ఉన్న రోజా, అవంతి శ్రీనివాస్, కొడాలి నాని, విడదల రజని వంటి వారు వైసీపీ హయాంలో మంత్రులయ్యారు. ఇక కేసీఆర్ పదేళ్లు పాటు అధికారంలో ఉన్నప్పుడు కేబినెట్ లో ఉన్న వారిలో ఎక్కువ మంది టీడీపీ నుంచి వచ్చిన వారే. గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, కడియం శ్రీహరి, తలసాని శ్రీనివాస యాదవ్ వంటి వారు మంత్రి పదవులు దక్కించుకున్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కేబినెట్ లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క వంటి వారు టీడీపీ నుంచి ఓనమాలు నేర్చుకుని వచ్చిన వారే. అందుకే టీడీపీ ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో రాజకీయంగా ఎదిగేందుకు వేదికగా మారిందని చెప్పాలి.

## జూరాల ప్రాజెక్టుకు వరద నీరు షురూ

జోగులాంబ గద్వాల

జూరాల ప్రాజెక్టుకు వరద మొదలైంది... ఎగు ఎగువన కర్ణాటక మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్ఫో కొనసాగుతుంది... 2.800 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుంది... జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.684 టీఎంసీల నీరు నిల్వ చేరింది... ఎగువ ప్రాంతాల్లో వరద ఇలాగే కొనసాగితే మరో 4,5 రోజుల్లో ప్రాజెక్టు నిండుకుండలా మారే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు...

## ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ నివాళి

హైదరాబాద్

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ నివాళి అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు

## మియాపూర్ లో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్

మియాపూర్ మైత్రి నగర్ పార్కు స్థలంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. మైత్రి నగర్ ఫేస్ -1 కాలనీ పార్కు ఎకరా స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు మట్టి కుప్పలు వేసారు. పార్కు స్థలాన్ని కాపాడాలని కాలనీ వాసులు హైడ్రా కు ఫిర్యాదు చేసారు. దాంతో హైడ్రా అధికారులు పార్కు స్థలంలో మట్టి కుప్పలు తొలగించారు. పార్కు మట్టు హైడ్రా అధికారులు నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు.

========================

## కిరాయికి వుంటున్న వారే నిందితులు

కుత్బుల్లాపూర్...

జీడిమెట్ల పియస్ పరిధిలో నిన్న మాపోయిస్టుల పేరుతో లేఖరాసి సంచలనం సృష్టించిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసారు. బాధితుడు కూన రాఘవేంద్ర గౌడ్ ఇంట్లోనే కిరాయికి ఉంటున్న వారిగా గుర్తించారు. జీడిమెట్ల పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు వున్నారు.

## యాదాద్రిలో చింతపండు చోరీ యత్నం

యాదాద్రి

తెలంగాణ ఆధ్యాత్మిక కేంద్రమైన యాదగిరిగుట్టపై చోరీ యత్నం కలకలం రేపింది! ఏకంగా ఆలయ ప్రసాద తయారీ కేంద్రం నుంచే చింతపండు బస్తాలను చోరీ చేయడానికి ప్రయత్నించారు! అందులోనూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే ఈ చేతివాటం ప్రదర్శించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొండపైన ఉన్న ప్రసాద తయారీ కేంద్రం నుంచి కన్వేయర్ బెల్టు ద్వారా చింతపండు బస్తాలను బయటకు తెచ్చి, కారులో తరలించడానికి ప్రయత్నిస్తుండగా... పెట్రోలింగ్ వచ్చిన పోలీసులు వారిని చూశారు. పోలీసులను చూడగానే సదరు ఉద్యోగులు కారు, చింతపండు బస్తాలను వదిలేసి పారిపోయారు. వెంటనే స్పందించిన పోలీసులు 10 చింతపండు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.ఘటన అనంతరం చోరీకి యత్నించిన ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పోలీసులు పట్టుకున్నారు. అయితే, ఈ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతివాటం వెనుక ఆలయ ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయానికి భద్రత కల్పిస్తున్న ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ) పోలీసుల నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమంటూ భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# టీడీపీ టచ్ లోకి మరో ఎంపీ

విజయవాడ, మే28,

వైసీపీ నుంచి ఒక్కొక్క నేత పార్టీని వీడి వెళ్లిపోతున్నారు. ముఖ్యమైన నేతలు ఇప్పటికే పార్టీని వదిలివెళ్లిపోవడంతో ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఆ ప్రభావం పడిందనే చెప్పాలి. అదే సమయంలో జగన్ వ్యవహార శైలిని నచ్చని మరికొందరు కూడా పార్టీని వీడి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. త్వరలోనే ఒక ముఖ్యనేత కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేత పార్టీకి త్వరలోనే గుడ్ బై చెప్పనున్నారని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. టీడీపీ నేతల ప్రలోభాల వల్ల కావచ్చు. లేదా జగన్ వ్యవహార శైలి ఇక మారదని భావించి పార్టీని వీడటమే మంచిదన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలిసింది. వైసీపీని ఇప్పటికే మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసులురెడ్డి, అవంతి శ్రీనివాస్ లతో పాటు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య కూడా పార్టీని వీడారు. దీంతో పాటు విజయసాయిరెడ్డి కూడా పార్టీకి రాజీనామా చేసి రాజకీయాలకు ప్రస్తుతం దూరంగా ఉంటున్నారు. ఇక ఇదే సమయంలో మోపిదేవి వెంకటరమణ నమ్మకమైన నేతగా ఉన్న ఆయన కూడా పార్టీకి గుడ్ బై చెప్పారు. రాజ్యసభ సభ్యులు నలుగురు రాజీనామా చేసి వెళ్లిపోవడంతో ఇక ఎవరూ రాజీనామా చేసే అవకాశం లేదని చెబుతున్నారు. కానీ వైసీపీ హయాంలో కీలకంగా వ్యవహరించిన వారిపై వరస కేసులు నమోదు అవుతుండటంతో పార్టీని వీడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. జగన్ ను మానసికంగా దెబ్బకొట్టాలంటే వైసీపీ నుంచి అవసరం లేకపోయినా పార్టీలో తీసుకునేందుకు టీడీపీ సిద్ధమయింది. ఇందులో భాగంగా మరొక రాజ్యసభ సభ్యుడికి గాలం వేసినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ పదవి పొందిన వారిలో ఒకరితో టీడీపీ నేతలు టచ్ లోకి వెళ్లారని చెబుతున్నారు. ప్రస్తుతం వైసీపీలో ఏడుగురు రాజ్యసభ సభ్యులున్నారు. వారిలో వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజన్ రెడ్డి, మేడా రఘునాథ్ రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీలు ఉన్నారు. వీరిలో వైవీసుబ్బారెడ్డి జగన్ కు బాబాయి కావడంతో ఆయన బయటకు వెళ్లే అవకాశంలేదు. ఆయనకు జగన్ కీలక బాధ్యతలను పార్టీలో అప్పగించే అవకాశాలున్నాయి. ఒక పిల్లి సుభాష్ చంద్రబోస్ జగన్ కు నమ్మకంగా ఉంటున్నారు. నిరంజన్ రెడ్డి, ఆళ్ల అయధ్య రామిరెడ్డి, మేడా రఘునాథరెడ్డి లు తాము పార్టీని వీడేది లేదని చెప్పారు. అయితే వైవీ తప్పించి మిగిలిన ఆరుగురిలో పరిమళ్ నత్వానీ పదవీ కాలం త్వరలోనే పూర్తవుతుంది. దీంతో మిగిలిన ఐదుగురిలో ఒకరిపై తెలుగుదేశం పార్టీ గురిపెట్టింది. వీరిలో ఒకరితో ఇప్పటికే టీడీపీ నేతలు టచ్ లోకి వెళ్లినట్లు సమాచారం అందుతుంది. రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో తిరిగి వారికే పదవి ఇస్తామని చెప్పడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి కీలక పదవి ఇస్తామని చెప్పడంతో ఆయన వైసీపీకి రాజీనామా చేయడానికి రెడీ అవుతున్నట్లు సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

# మహిళల భద్రత కోసం శక్తి యాప్

విజయవాడ, మే 28,

ఏపీలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తి వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారు. వాట్సాప్ భాగస్వామ్యంతో అత్యవసర సమయాల్లో మహిళలు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. వాట్సాప్ కాల్, సాధారణ ఫోన్ కాల్ చేసినా బాధితులను వేగంగా గుర్తించి శక్తి టీమ్స్ సాయం చేస్తాయి.ఏపీలో మహిళల భద్రత కోసం "శక్తి వాట్సప్ నంబర్"ను ఏపీ పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యవసర సమయాల్లో కాల్ చేసినా, మెసేజ్ చేసినా స్పందించేలా వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చాయి.మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి వాట్సాప్ నంబర్ 79934 85111 ను డీజీపీ హరీష్ గుప్తా మంగళవారం ప్రారంభించారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ భాగస్వామ్యంలో ఈ సేవల్ని ప్రారంభించారు.ఏపీ ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తీసుకొచ్చిన "శక్తి" యాప్‌కు ప్రజల నుంచి చక్కటి ఆదరణ లభించింది. ఈ క్రమంలో మహిళల భద్రత కోసంఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్" ఆధ్వర్యంలో శక్తి వాట్సప్ నంబర్ 79934 85111 అందుబాటులోకి తీసుకు వచ్చారు.మంగళగిరి రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శక్తి వాట్సప్ నంబర్ ను ప్రారంభించారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నంబరుకు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటాయని చెప్పారు. 24/7 శక్తి వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉంటుందని డీజీపీ వివరించారు. సాంకేతికత సహాయంతో మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు చెక్ పెట్టేందుకు ఈ నంబర్ ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలు విధిగా తమ మొబైల్ లో శక్తి వాట్సప్ నంబర్ ను సేవ్ చేసుకోవాలరి ఐజీ రాజకుమారి కోరారు

# శిశు విక్రయాల ముఠా అరెస్టు

సూర్యాపేట

సూర్యాపేట సీసీఎస్ పోలీసులు ఒక అక్రమ శిశు విక్రయాల ముఠా ను అదుపులోకి తీసుకున్నారు. ముఠాలో ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులున్నారు. ముఠా నుంచి 16 నెలల మగ శిశువు స్వాధీనం చేసుకున్నారు. శిశువును.. చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించారు. రాజస్థాన్, అలహాబాద్, గుజరాత్ రాష్ట్రాల నుంచి 22 మంది శిశువులను తెచ్చి విక్రయించినట్లు గుర్తించారు. ఒక్కో శిశువుకు.. 3 లక్షల నుంచి 7 లక్షల వరకు విక్రయించినట్లు సమాచారం. నిందితుల్లో.. హైదరాబాద్, సూర్యాపేట, విజయవాడ వాసులు వున్నారు. గతంలోను నిందితులపై శిశు విక్రయాల కేసులున్నట్లు సమాచారం.

# సినిమా థియేటర్లలలో అధికారులు తనిఖీలు

:కాకినాడ

ప్రభుత్వ సూచనలు మేరకు కాకి నాడ జిల్లాలోని పలు సినిమా థియేటర్లలో రెవెన్యూ, పోలీసు, తూనికలు కొలతలు,అగ్నిమాపక, ఆరోగ్య విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. థియేటర్లలో సీటింగ్ కెపాసిటీ, అగ్నిప్రమాదాలు సంభవిస్తే రక్షణ ఏర్పాట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. క్యాంటీన్లలో ఆహార పానీయాలు, తిను బండారాల నాణ్యత, ధరల వివరాలను అడిగి తెలుసుకున్నా రు. టికెట్లు ఎలా విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈసం దర్భంగా కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ పలు థియేటర్లలో పారిశుద్ధ్యం బాగోలేదని, ఎలక్ట్రిషియన్ అందుబాటులో లేరన్నారు. లైసెన్సు పరిశీలిస్తున్నామని,నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పలుచోట్ల కొన్నిలోపాలు గుర్తించామని .వాటిని ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు...

# కరీంనగర్ జిల్లాలో స్కూల్ బస్సుల ఫిట్ నెస్ టెస్టులు ముమ్మరం

## జూన్ 15లోగా పిట్ నెస్ లేకుంటే చర్యలు తప్పవని ఆర్టీప హెచ్చరిక

కరీంనగర్‌ప్రైవేటు పాఠశాలలు, కళాశాల బస్సులకు వ్యాన్ లకు ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ఆర్టీవో అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ రవాణా శాఖ కార్యాలయంలో స్కూల్ బస్సులకు పిట్ నెస్ టెస్టులు నిర్వహించారు. ఎంవీఐ రవికుమార్ స్కూల్ బస్సులను తనిఖీ చేసి ఫిట్ నెస్ తనిఖీ చేశారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన సీనియర్ డ్రైవర్ను పెట్టుకోవాలని సూచించారు. బస్సులు కండీషన్, టైర్లు, హెడ్ లైట్లు బాగుండాలని ఎమర్జెన్సీ ఎగ్జిట్, పిల్లలు దిగడానికి వీలుగా బస్సు ఫుట్బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్సు, అగ్ని మాపక రక్షణ పరికరాలు లేకపోతే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వరని తెలిపారు. జూన్ 15 లోగా అన్ని బస్సులు ఫిట్నెస్ చేయించుకోవాలని, పిట్ నెస్ లేకుంటే జరిమానా తోపాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# కడప గడపలో పట్టు కోసం ప్లాన్

కడప, మే 28

పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి సామాన్య టీడీపీ కార్యకర్త వరకూ అందరికీ ఆమోదయోగ్యంగా నిలిచింది కడపలో మహానాడు నిర్వహణ. ఇదే వేడుకలో చిన్నబాబు లోకేష్ ను ప్రమోట్ చేస్తారని వార్తలు వస్తుండగా..మహానాడు వేదికను ఫిక్స్ చేసిన లోకేష్ పార్టీలో అందరి అభిమానాలు అందుకుంటున్నారు.తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడుకు రంగం సిద్ధమైంది. కడప జిల్లాలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు మహానాడు నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కడప నగరం ఎటుచూసినా పసుపే కనిపిస్తోంది. 250 ఎకరాల సువిశాల ప్రాంగణంలో మహానాడు నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే ఈసారి కడపలో మహానాడు నిర్వహణకు ఒక ప్రత్యేకత ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారి కడపలో మహానాడును నిర్వహించడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అయితే ఈ ఆలోచన చేసింది మాత్రం ఒకే ఒకరు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుతో ఊపు మీద ఉన్న తెలుగుదేశం పార్టీకి చిరస్మరణీయమైన గుర్తుగా ప్రత్యర్థి అడ్డాలో మహానాడును నిర్వహిద్దామని యువనేత నారా లోకేష్ ప్రతిపాదన చేశారు. రాయలసీమ.. అందునా వైఎస్ కుటుంబ అడ్డా కావడంతో ఎన్నెన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ నారా లోకేష్ ప్రతిపాదనకు జై కొట్టింది టీడీపీ హై కమాండ్. లోకేష్ ప్రతిపాదనకు పార్టీ శ్రేణుల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. దాని ఫలితమే పసుపుమయమైన కడన నగరం. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి సామాన్య టీడీపీ కార్యకర్త వరకూ అందరికీ ఆమోదయోగ్యంగా నిలిచింది కడపలో మహానాడు నిర్వహణ. ఇదే వేడుకలో చిన్నబాబు లోకేష్ ను ప్రమోట్ చేస్తారని వార్తలు వస్తుండగా..మహానాడు వేదికను ఫిక్స్ చేసిన లోకేష్ పార్టీలో అందరి అభిమానాలు అందుకుంటున్నారు.నారా లోకేష్ ఒక నాయకుడే అని ఎద్దేవా చేసిన వారు ఉన్నారు. ఆయనకు అంత సీన్ లేదులే అని ఎగతాళి చేశారు. రాజకీయంగా పనికి రారంటూ ముద్ర వేశారు. వ్యక్తిత్వ హనానికి పాల్పడ్డారు .బాడీ షేమింగ్ పై మాట్లాడిన వారు ఉన్నారు. నారా లోకేష్ ను టార్గెట్ చేసుకోవడానికి వందలాది సోషల్ మీడియా సైన్యం.. అంతకు మించి నేతల గణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండేది. కానీ అన్నింటినీ అధిగమించారు. సవాళ్లను ఎదుర్కొన్నారు. తనను తాను నిరూపించుకున్నారు. సుదీర్ఘ కాలం పాదయాత్ర చేశారు. రాళ్లను పూలుగా మార్చుకొని నిలబడ్డారు. పోయిన చోటే వెతుక్కొని పోరాటం చేసి అనుకున్నది సాధించారు. అయితే 2014 నుంచి 2019 మధ్య లోకేష్ అలుపెరగకుండా శ్రమించారు. అన్నింటికీ మించి తెలుగుదేశం పార్టీని ఏకతాటిపైకి తేగలిగారు. పార్టీని కష్టకాలంలో తన పాదయాత్రతో నిలబెట్టారు. తండ్రి చంద్రబాబు అరెస్టుతో పార్టీని నిర్వీర్యం చేయాలన్న ప్రత్యర్థి అంచనాలను తారుమారు చేశారు. ఏకంగా ప్రత్యర్థి ఇలాకాలో టీడీపీ కూటమి విజయాన్ని శాసించారు. దానిని దశాబ్దాల కాలం సుస్థిరం చేసుకునేందుకే కడపలో మహానాడు నిర్వహించాలని ప్రతిపాదన చేశారు లోకేష్. దానికి పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు లభించడంతో రెట్టింపు ఉత్సాహంతో ఇప్పుడు కడపలో మహానాడు మూడు రోజుల పాటు జరగనుంది.రాయలసీమ అంటే వైఎస్సార్ కాంగ్రెస్.. వైఎస్సార్ కాంగ్రెస్ అంటే రాయలసీమ అన్నట్టు పరిస్థితి ఉండేది. అంతలా ఉండేది ప్రాంతీయ అభిమానం. 2014 ఎన్నికల్లో రాయలసీమలో వైఎస్సార్ కాంగ్రెస్ దే పైచేయి. టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ స్థానాలు సాధించింది. 2019లో అయితే వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. కుప్పం నుంచి చంద్రబాబు, హిందూపురం నుంచి నందమూరి బాలక్రిష్ణ, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ మాత్రమే గెలిచారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రాయలసీమపై ఫోకస్ పెంచారు లోకేష్. తన సుదీర్ఘ పాదయాత్రను కుప్పం నుంచి ప్రారంభించారు. దారిపొడవునా వైసీపీ ప్రభుత్వంతో పాటు శ్రేణుల నుంచి అభ్యంతరాలు, ప్రతిఘటనలు ఎదురైనా బలంగా నిలబడ్డారు. వివాద రహితంగా, గాంధేయవాదంతో తాను పాదయాత్రను పూర్తిచేశారు. ప్రజలతో మమేకమయ్యారు. పాదయాత్రకు ఎదురైన అడ్డంకులను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే రాయలసీమ స్వరూపమే మారిపోతుందని హామీ ఇచ్చారు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో రాయలసీమకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. పారిశ్రామికీకరణకు రాయలసీమ సరైన భవిత అని టీడీపీ కూటమి ప్రభుత్వం సంకేతాలు పంపుతుండడంతో రాయలసీమలో టీడీపీ మరింత బలపడేలా ఉంది.కడపలో మహానాడును నిర్వహించడం ద్వారా ప్రత్యర్థికి సరైన సవాల్ పంపాలని నారా లోకేష్ భావించారు. అదే సమయంలో పార్టీలో యువరక్తం ఎక్కించాలని భావిస్తున్నారు. అందుకు మహానాడు కూడా వేదిక కానుంది. పార్టీలో వరుసగా మూడుసార్లు పార్టీ పదవులు చేపట్టిన వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలని ప్రతిపాదన పెట్టిన లోకేష్ సంచలనానికి తెరలేపారు. అందులో భాగంగానే ఈసారి లోకేష్ కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారని అంతా భావిస్తున్నారు. అయితే మరో నాలుగు దశాబ్దాలకుగాను టీడీపీ ఉనికి చాటుకునేలా బలమైన నాయకత్వానికి దిశ నిర్దేశం చేసేలా మహానాడు తీర్మానాలు ఉండబోతున్నాయని తెలుస్తోంది. అందుకే కడప వేదికగా భవిష్యత్ నిర్దేశం చేస్తే బాగుంటుందనే నారా లోకేష్ ఇక్కడే మహానాడును ఫిక్స్ చేశారు. అయితే ఈ నిర్ణయం రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయపరుస్తోంది.

# మూడు మార్గాల్లో సీ ప్లేన్...

కర్నూలు, మే 28,

ఏపీలో పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా సీప్లేన్ సేవలను ప్రారంభించనుంది. దీని ద్వారా పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. మొదటి దశలో అమరావతి, తిరుపతి, గండికోట నుంచి సేవలు మొదలుకానున్నాయి. ఈసీ ప్లేన్ ప్రయాణంతో పర్యాటక రంగానికి ఊతమిచ్చినట్లు అవుతుంది. తక్కువ ఖర్చుతో మారుమూల ప్రాంతాలకు విమాన సౌకర్యం కలగనుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే ఛాన్స్ ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పర్యాటక అభివృద్ధిపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా విదేశీ పర్యటకులను ఆకట్టుకునే విధంగా ఏపీలో పర్యాటక పాలసీ తెచ్చేందుకు ప్రయత్నాలు చేసింది. అవి ఇప్పటికే ఒక కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తున్నాయి. అందులో భాగంగానే రాష్ట్రంలో త్వరలో సీ ప్లేన్ అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో పడింది ఏపీ ప్రభుత్వం.సాధారణంగా విమానాలుగాలిలో ఎగురుతాయి. అయితే ఈ సీ ప్లేన్ లు జలాశయంలో నీటిపై తేలియాడుతూ? ఆపై నింగిలోకి ఎగిరి విహరించేలా ప్లాన్ చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన సంస్థ దేశవ్యాప్తంగా 56 మార్గాల్లో సీ ప్లేన్ సేవలు అందించేందుకు టెండర్లు పిలిచింది. ఏపీలో 11 ప్రాంతాలను గుర్తించింది. వాటిలో ఎనిమిది ప్రాంతాల నుంచి సేవలు నడిపేందుకు టెక్నో ఫీజుబిలిటీ నివేదిక, డి పి ఆర్ తయారీకి టెండర్లు పిలిచారు. రాష్ట్రంలో మొదటి దశలో మూడు చోట్ల సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఈ తొలి విడతకు సంబంధించి ప్రకాశం బ్యారేజీ, తిరుపతిలోని కళ్యాణి డాం, గండికోట నుంచి సేవలు ప్రారంభించనున్నారు. అమరావతి తో పాటు గండికోట డిపిఆర్ బాధ్యతలను రైట్స్ సంస్థకు అప్పగించారు. తిరుపతి డిపిఆర్ బాధ్యతలను ఫీడ్బ్యాక్ హైవే సంస్థకు అప్పగించారు. ఆసక్తి ఉన్న సంస్థలతో అధికారులు చర్చలు కూడా జరుపుతున్నారు. అయితే మొత్తం 32 మార్గాలలో ఈ సీప్లేన్ రాకపోకలు సాగించేలా ప్రణాళిక రూపొందించారు. మొదటి దశలో చేపట్టే మూడు మార్గాలకు దగ్గర్లో ఎయిర్పోర్టు ఉండడం విశేషం. సిప్లేన్ సేవలు సాధారణ విమాన సర్వీసులతో కలిపి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. విమాన ఖర్చుల కంటే తక్కువగా టిక్కెట్లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఏపీలో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది నవంబర్ 9న విజయవాడలోని పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలం వరకు సిప్లేన్ ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలించిన సంగతి తెలిసిందే. ట్రయల్ రన్ లో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రయాణం చేశారు. అది విజయవంతం కావడంతోనే కొత్తగా మూడు మార్గాల్లో సీ ప్లేన్ సేవలు ప్రారంభించేందుకు నిర్ణయించారు.

# తిరుపతి లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

తిరుపతి

కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు" అన్న అభియుక్తికి నిలువెత్తు నిదర్శనం ఎన్టీఆర్ అని, ఆయన పేరులో వైబ్రేషన్ ఉందని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తెలిపారు. నటసార్వభౌముడు, విశ్వవిఖ్యాత, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను తిరుపతిలో ఘనంగా నిర్వహించారు

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

విశాఖపట్నం

ఆంధ్రప్రదేశ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలు అట్ట హాసంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వేడుకలను జిల్లా యంత్రాంగం అధికారికంగా నిర్వహించింది. దీనిలో భాగంగా ఆర్కే బీచ్ లో ఉన్న స్వర్గీయ ఎన్టీ ఆర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామా రావు సేవలను కొనియాడారు. ఆయన అత్యంత క్రమశిక్షణ కలిగి జీవితంలో ఉత్తమ స్థానాలకు చేరుకున్నారని, రాష్ట్ర ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొ న్నారు. ఉద్యోగ, కళా, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసి ఘన కీర్తిని సొంతం చేసుకున్నారన్నారు. అనేక పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో వైవిధ్యభరితమైన పాత్ర లెన్నో పోషించి మెప్పించారని, రాముడు, కృష్ణుడు వంటి పౌరాణిక పాత్రలతో తెలుగు వారి హృదయా లలో శాశ్వతంగా, ఆరాధ్య దైవంగా నిలచిపోయారని పేర్కొన్నారు.

# సెల్ టవరెక్కి టీడీపీ మహిళా కార్యకర్త నిరసన

కడప

మహానాడు జరుగుతుండగా కడపలో టిడిపి మహిళా కార్యకర్త మీనాక్షి సెల్ టవర్ ఎక్కింది. నిజమైన కార్యకర్తలను ఎమ్మెల్యే మాధవి రెడ్డి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసింది. ఎన్నో ఏళ్లుగా టీడీపీలో ఉన్నా.. తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించింది. దాంతో అక్కడ పోలీసులు భారీగా మోహరించారు.


# గర్భిణీలకు పౌష్టిక ఆహారం పంపిణీ.

రామగుండం

గోదావరిఖని బాపూజీ నగర్ లోని , గర్భిణి లకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ,సురభి శ్రీధర్ జన్మదినం సందర్భంగా మంగళవారం సాయంత్రం పౌష్టిక ఆహారం సంబంధించిన వస్తువులను అమ్మ పరివార్ స్వచ్ఛ సేవ సంస్థ ఆధ్వర్యంలో డా. సురభి శ్రీధర్ అందించారు. అనంతరం సురభి శ్రీధర్ మాట్లాడారు. గర్భిణీలు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీ తో ఉన్న ప్రతి మహిళ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమ్మ పరివర్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. నిస్సహాయ పిల్లలకు ఆశ్రయం ఇవ్వడం కాకుండా ప్రతిరోజు నిస్సహాయులకు, నిర్భాగ్యులకు అన్న దాన కార్యక్రమం చేపడుతున్న సంస్థ బాధ్యులందరికీ వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ పక్షాన ధన్యవాదములు తెలుపుతున్నామని సురభి శ్రీధర్ తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అమ్మ పరివార్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి సహస్ర అమ్మ పరివార్ సంస్థ నిర్వాహకులు మంద నాగరాజు, కరణ్, అంగన్వాడి టీచర్ రమా తదితరులు పాల్గొన్నారు.

# కాకాని క్లోజ్... ఇక కొడాలేనా

విజయవాడ, మే 28 (న్యూస్ పల్స్)




ఒకరి తర్వాత ఇంకొకరి వంతు వస్తోంది. వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళి ఇలా నోరు జారినోళ్లు..నోటికొచ్చినట్లు మాట్లాడినోళ్ల ఎపిసోడ్ ఒక్కొక్కటిగా అయిపోతోంది. ఇప్పుడు నెల్లూరు పెద్దారెడ్డిగా చెప్పుకునే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎపిసోడ్ కూడా స్టార్ట్ అయిందంటున్నారు టీడీపీ నేతలు. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై రెండు నెలల క్రితమే కేసు పెట్టారు పోలీసులు.నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్ నుంచి అక్రమంగా క్వార్ట్ ఖనిజాన్ని తరలించారనే ఆరోపణలతో కాకాని గోవర్ధన్ రెడ్డిపై కేసు ఫైల్ అయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రుస్తుం మైన్ నుంచి దాదాపు 250 కోట్ల రూపాయల విలువైన క్వార్ట్జ్‌ను అక్రమంగా తరలించారని అప్పట్లో వివాదం చెలరేగింది.ఈ గని లీజు కాలం ముగిశాక కూడా..వైసీపీ నేతలు ఆక్రమించుకుని ఇష్టానుసారంగా మైనింగ్ చేశారని..అంతేకాక రాళ్ళను పేల్చేందుకు పెద్దఎత్తున పేలుడు పదార్థాలను నిల్వ చేశారని పెద్ద ఇష్యూ అయింది. ఈ ఇష్యూపై కూటమి ప్రభుత్వం వచ్చాక కేసు పెట్టింది. అప్పటి కాకాణి తప్పించుకుని తిరుగుతున్నారంటున్నారు టీడీపీ నేతలు. ఎట్టకేలకు ఆయనను కేరళలో అరెస్ట్ చేసి..విజయవాడకు తరలించి కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించారు పోలీసులుఇక నెక్ట్స్ అరెస్ట్ అయ్యేది మాజీ మంత్రి కొడాలి నానినే అని బలంగా చర్చ జరుగుతోంది. కేసు విచారణకు సహకరించకపోవడంతో పాటు పారిపోతాడనే కారణంతో ఇప్పటికే కొడాలి నానిపై లుక్ అవుట్ వారెంట్ జారీ చేశారు. అయితే గత కొంత కాలం నుంచి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న కొడాలినాని ఆరోగ్యం ఇంకా సెట్ కాలేదని..మెరుగైన ట్రీట్‌మెంట్ కోసం ఆయన అమెరికాకు వెళ్లనున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో కృష్ణా జిల్లా పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.అయితే ఇప్పటికే కొడాలి నానిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. అలాగే వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్‌పై అసభ్యకరంగా మాట్లాడారని ఫైలయ్యాయి. వీటితో పాటు ఇసుక, మట్టి, భూకబ్జాలకు సంబంధించి ఆరోపణలు, టిడ్కో ఇళ్ల పంపిణీ, జగనన్న కాలనీలో మెరక పేరుతో రూ.45 కోట్ల అవినీతి, విద్యుత్ అక్రమాలపై విజిలెన్స్ ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపై విచారణ జరుగుతోంది. ఓ వైపు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలోనే కొడాలి నాని హైదరాబాద్‌లోని సంధ్య కన్వెన్షన్‌లో ఓ వివాహ వేడుకకు హాజరైనట్లు తెలుస్తోంది.ఇదే టైమ్‌లో లిక్కర్ స్కాం ఆరోపణలు కూడా వైసీపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్పలను కస్టడీకి తీసుకొని విచారించారు పోలీసులు. ఇప్పుడు ఈ ముగ్గురితో పాటు మరోసారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డినీ కస్టడీకి తీసుకుని ప్రశ్నించనున్నారు. వాళ్లిచ్చే వివరాల ఆధారంగా ఓ వైసీపీ సిట్టింగ్ ఎంపీ అరెస్ట్ ఉంటుందన్న టాక్ వినిపిస్తోంది.నానిపై కేసులు, లిక్కర్ స్కామ్ ఆరోపణలే కాదు.. మాజీ మంత్రులు విడదల రజిని, ఆర్కే రోజా కూడా కేసులు, ఆరోపణలు ఫేస్ చేస్తున్నారు. విడదల రజినిపై ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు అయింది. ఓ క్రషర్ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలతో..గుంటూరు అప్పటి ఎస్పీతో పాటు సీఐ, విడదల మరిది గోపి, ఆమె పీఏతో పాటు విడదల రజినిపై కూడా ఏసీబీ ఈఎఫ్ఐ కట్టింది.మాజీ మంత్రి ఆర్కే రోజా టార్గెట్‌గా ఆడుదాం ఆంధ్రా ప్రోగ్రామ్‌కు సంబంధించి ఏసీబీ విచారణకు ఆదేశించింది ప్రభుత్వం. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టార్గెట్‌గా అటవీ భూముల ఆక్రమణలపై దర్యాప్తు కంటిన్యూ అవుతోంది. ఇలా వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలకంగా పనిచేసి..కూటమి నేతల టార్గెట్‌గా విమర్శలు చేసిన లీడర్లను వరుస కేసులు వెంటాడుతున్నాయి. అరెస్టుల ఎపిసోడ్‌లో నెక్ట్స్ ఎవరి వంతు వస్తుందో చూడాలి మరి.

==============================

భారత శక్తి



# విజయవాడ నుంచ నేరుగా విదేశాలకు...

విజయవాడ, మే 28,

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. దీంతో మరో మూడు నెలల్లోనే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వ్లలభనేని బాలశౌరి తెలిపారు. అలాగే 2028వ సంవత్సరం నుంచి నేరుగా అమెరికాలోని న్యూయార్క్ పట్టణానికి విమానం ఎగిరేలా సేవలు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అలాగే విదేశాలకు చెందిన ఎమిరేట్స్ విమానాలను కూడా నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రముఖుల తాకిడి విపరీతంగా పెరుగుతోంది. దీంతో మరో మూడు నెలల్లోనే నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనాన్ని పూర్తి చేయాలని ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. అంతేకాకుండా 2028 నాటికి విమానాశ్రయం నుంచి నేరుగా అమెరికాలోని న్యూయార్క్ పట్టణానికి విమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. అలాగే ఇతర దేశాలకు చెందిన ఎమిరేట్స్ విమానాలను కూడా ఇక్కడి నుంచి నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించింది. ఇందులో ఎయిర్ పోర్టు అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, వైస్ ఛైర్మన్ ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఇంఛార్జీ కలెక్టర్ గీతాంజలి శర్మ, డైరెక్టర్ లక్ష్మీకాంత రెడ్డి, జీఎం రామాచారి, ఎస్పీ గాంగాధర రావు, అధికారులతో కలిసి పాల్గొని.. విమానాశ్రయ అభివృద్ధితో పాటు ప్రయాణికుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ప్రతి రాష్ట్రానికి అనుసంధానం అయ్యేలా విమాన సర్వీసులు నడిపేందుకు వివిధ విమానయాన సంస్థలతో సంప్రదించినట్లు చెప్పారు. ఇవి మాత్రమే కాకుండా విజయవాడ నుంచి శ్రీలంక, సింగపూర్, థాయ్ లాండ్, దుబాయ్ లకు ఎమిరేట్స్ విమానాలు అందుబాటులోకి తీసుకు రావాలని ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు 70 శాతం పూర్తి అయ్యాయని మంత్రి బాలశౌరి వివరించారు. అలాగే ప్రతి నెలా ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే విమానాశ్రయంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా టెర్మినల్స్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అందులో ప్రాచీన సంస్కృతి, కూచిపూడి భంగిమలు ఉంటాయన్నారుసీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి లోకేశ్ ల ఆదేశాలతోనే.. 12 డిజైన్లను మార్పు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కేశినేని చిన్నా చెప్పారు. వారణాసి, కొచ్చి, అహ్మదాబాద్ లకు కొత్త సర్వీసులు నడిపేందుకు సమాలోచనలు చేస్తున్నట్లు వివరించారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక వేగవంతం అయ్యాయని అన్నారు.

# హెచ్ సీఏ వేధింపులు నిజమే....విజిలెన్స్ రిపోర్ట్

హైదరాబాద్, మే 28 (

ఆ మధ్య హైదరాబాద్ వేదికగా ఐపీఎల్ మ్యాచ్లు జరిగినప్పుడు.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సన్ రైజర్స్ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురి చేసిందని వార్తలు వచ్చాయి. దీనిపై సన్ రైజర్స్ యాజమాన్యం చేసిన ఒక మెయిల్ కూడా కలకలం సృష్టించింది. ఈ వ్యవహారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లడంతో.. ఆయన వెంటనే విజిలెన్స్ బృందాన్ని రంగంలోకి దింపారు. తక్షణమే తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఎప్పుడైతే విజిలెన్స్ బృందం రంగంలోకి దిగిందో.. అప్పుడే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కాళ్ళ బేరానికి వచ్చింది. ఇబ్బందులు పెట్టబోమని.. వేధింపులకు పాల్పడమని సంకేతాలు ఇచ్చింది. దీంతో విజిలెన్స్ విభాగం సైలెంట్ అయిపోయింది. అయితే ఈ విషయాన్ని అంత తేలిగ్గా వదిలిపెట్టనని ముఖ్యమంత్రి అప్పుడే సంకేతాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే విజిలెన్స్ బృందాన్ని రహస్యంగా రంగంలోకి దింపారు. స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడంతో విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ సాగించడంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఇబ్బందులకు పాల్పడిందని.. వేధింపులకు గురి చేసిందని.. అదనపు టికెట్ల కోసం సన్ రైజర్స్ యాజమాన్యానికి చుక్కలు చూపించిందని తేలింది. ఈ వ్యవహారంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్రావు, కార్యదర్శి ఒత్తిడి చేశారని విజిలెన్స్ ఎంక్వయిరీలో తేలింది. ఇక దీనికి సంబంధించిన ప్రైమరీ రిపోర్టును ప్రభుత్వానికి అధికారులు సబ్మిట్ చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వానికి సూచించారు. ఈ సీజన్లో ఐపిఎల్ మొదలైన తర్వాత.. ఉప్పల్ వేదికగా జరిగే మ్యాచ్ల విషయంలో తమకు ఎక్స్ ట్రా టికెట్లు ఇవ్వాలని.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్రావు ఇబ్బందికి గురి చేస్తున్నాడని హైదరాబాద్ యాజమాన్యం ఒక లేఖ రాసింది.. ఇలానే తమన్న బెదిస్తే హైదరాబాద్ వదిలిపెట్టి వెళ్ళిపోతామని స్పష్టం చేసింది. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టిదాకా వెళ్లడంతో ఆయన విజిలెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపారు. ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడంతో విజిలెన్స్ అధికారులు లోతుగా దర్యాప్తు చేశారు. నిబంధనల ప్రకారం 10 శాతం టికెట్ల కంటే.. అదనంగా మరో పది శాతం టికెట్లు కావాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఒత్తిడికి గురి చేసిందని విజిలెన్స్ ఎంక్వయిరీలో తేలింది.. అయితే 10% టికెట్లు ఓపెన్ మార్కెట్లో కొనుగోలు చేయడానికి తమకు అవకాశం ఇవ్వాలని జగన్మోహన్రావు కోడితే హైదరాబాద్ యాజమాన్యం ఓకే చెప్పింది. అయితే వాటికి అదనంగా మరోపరిచారని టికెట్లు ఓపెన్ మార్కెట్లో ఇవ్వాలని జగన్మోహన్రావు హైదరాబాద్ యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చారు.. దీనికి సన్ రైజెస్ ఒప్పుకోలేదు.. ఇక కాంప్లిమెంటరీ బాక్స్ టికెట్ల విషయంలోనూ తనకు వచ్చే వాటా ఇవ్వలేదని జగన్మోహన్రావు కక్ష సాధింపు పాల్పడ్డారు. హైదరాబాద్ ? తలపడుతున్నప్పుడు విఐపి బాక్సులకు తాళం వేశారు. దీంతో హైదరాబాద్ యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేస్తూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కి లేఖ రాసింది. ఆ లేఖ బయటికి లీక్ కావడంతో ఒకసారి ఆ విషయం బయటకు వచ్చింది.. అయితే విజిలెన్స్ ఎంక్వయిరీ జరుగుతుండగానే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్ రైజర్స్ హైదరాబాద్ పరస్పరం చర్చించుకున్నాయి. సమస్యను పరిష్కరించుకున్నాయి. అయితే విజిలెన్స్ ఎంక్వయిరీ పూర్తి కావడంతో మరోసారి ఈ విషయం సంచలనంగా మారింది. జగన్మోహన్రావు గత ప్రభుత్వ పెద్దలకు అత్యంత దగ్గర వ్యక్తి. పైగా అప్పట్లోనే అతడు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నియమితుడయ్యాడు. అతని వ్యవహార శైలి పై మొదటి నుంచి కూడా రేవంత్ రెడ్డి ఆగ్రహం గానే ఉన్నారు. ఇప్పుడు విజిలెన్స్ నివేదిక నేపథ్యంలో జగన్మోహన్ రావు పై రేవంత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వార్తలు వినిపిస్తున్నాయి.

# అందాల భామల వెనుక కథలు

హైదరాబాద్, మే 28

నిజంగా కొన్ని చెప్పుకోవాలి. కొన్నింటి గురించి ప్రధానంగా చర్చించాలి.. అలాంటిదే ఇది కూడా. మన సమాజం అందాల పోటీలు అంటే 36 - 24 - 36 కొలతలే అనుకుంటుంది. ర్యాంపు వాకులు.. రాత్రిపూట పార్టీలు.. ఆ తర్వాత జరిగే అసాంఘిక కార్యకలాపాలే అని భావించుకుంటుంది. ముమ్మాటికి ఆ భావన తప్పు. అనుకునే విధానం మరింత తప్పు. ఒక సమస్యను బలంగా చాటి చెప్పాలి అంటే.. సమాజం దృష్టికి తీసుకురావాలి అంటే కచ్చితంగా ఒక బలమైన వేదిక అవసరం. అలాంటి వేదిక మిస్ వరల్డ్ పోటీలు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం మిస్ వరల్డ్ పోటీలకు వేదికగా మారింది. కొద్దిరోజుల నుంచి ప్రచారం కూడా భారీగానే చేస్తోంది. అయితే ఇందులో ఏర్పాట్లలో సరైన సమన్వయం లేకపోవడంతో ఇటీవల ఇంగ్లాండ్ కంటెస్టెంట్ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. వాటిని కాస్త పక్కన పెడితే.. అందాల పోటీలలో పాల్గొనే సుందరీ మణులు పడుతున్న ఇబ్బందులు.. వారు ఇక్కడదాకా రావడానికి కల్పించిన చాలా భిన్నమైనవి.. వారు తమ ఎదుర్కొన్న కష్టాలు.. పడిన బాధలు చెబుతుంటే హృదయం ద్రవించిపోతుంది. అందాల పోటీలకు వచ్చిన ఓ వనిత చెప్పిన తన కథ నిజంగా బాధేసింది. ఆటవిక ఆచారాల నుంచి తనను తాను కాపాడుకుంది. ఉన్నంత ధైర్యంతో.. మూడాచారాలపై ఎడతెగని పోరాటం చేస్తోంది. దీనిపై ఆమెకు అనేక బెదిరింపులు ఎదురయ్యాయి. చంపేస్తామనే హెచ్చరికలు కూడా వచ్చాయి. అయినప్పటికీ ఆమె వాటిని ధైర్యంగా ఎదుర్కొంది. తన సమస్యను ప్రపంచం ముందు గట్టిగా చెప్పాలని నిర్ణయించుకుంది. అందువల్లే అందాల పోటీలను ఒక వేదికలాగా భావించింది. ఆ వేదిక మీద దాని ఎదుర్కొంటున్న సమస్యను బలంగా చెప్పగలిగింది. అందువల్లే ఆమె ఇక్కడదాకా రాగలిగింది. తనలాంటి అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను బయటకి వివరించగలిగింది. నిండా 17 సంవత్సరాల వయసు కూడా లేని సందర్భంలో ఓ యువతి అత్యాచారానికి గురైంది. ఆ బాధ నుంచి బయటపడిన తను.. తన దేశంలో జరుగుతున్న ఈ దారుణాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తోంది. ఇక చిన్న వయసులోనే లైంగిక వేధింపుల బారిన పడింది. ఆమెకు కాస్త మెచ్యూరిటీ వచ్చిన తర్వాత.. మనదేశంలో ఇలాంటివన్నీ సర్వసాధారణమే అని తెలిసిపోయింది. అటువంటి వాటికి వ్యతిరేకంగా ఏకంగా ఒక సంస్థను ఏర్పాటు చేసింది. ప్రజలలో చైతన్యం తీసుకొస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. తెలంగాణ ప్రభుత్వం సరిగా ఏర్పాటు చేయలేకపోవచ్చు. ఇందులో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురు కావచ్చు. ప్రభుత్వపరంగా కొన్ని విషయాలలో అడ్డగోలుతనం ఉండొచ్చు. కానీ అంతిమంగా సొసైటీ బాగుకోసం ఈ అతివలు ఎంచుకున్న మార్గం మాత్రం అద్భుతం. దీనికి ఎలాంటి పేరు పెట్టినా పెద్ద ఇబ్బంది లేదు. కాకపోతే అందాల పోటీలు అంటే ఒక భావన ఏర్పడిన మన సమాజం.. ఇలాంటి వాటిని ఓన్ చేసుకోవడం కొంచెం కష్టమే.

# రాష్ట్ర సచివాలయంలో ఎన్టి రామారావు జయంతి వేడుకలు

## ఎన్టిఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన సిఎస్,కార్యదర్శులు

అమరావతి,28 మే

:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు జయంతి మే 28వ తేదీని ప్రతి ఏటా రాష్ట్ర వేడుకగా రాష్ట్రమంతటా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది. ఆమేరకు బుధవారం ఎన్టిఆర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఎన్టిఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.రావత్,సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, సియం ముఖ్య కార్యదర్శి యం.రవిచంద్ర,ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్ రావు తదితర అధికారులు ఎన్టిఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టి రామారావు ప్రఖ్యాత తెలుగు నటుడుగానే కాకుండా రాజకీయ జీవితంలో కూడా ఆదర్శవంతంగా నిలిచారని గుర్తు చేశారు. పేద ప్రజల సంక్షేమానికి అనేక వినూత్న కార్యక్రమాలకు నాంది పలికారని పేర్కొన్నారు.

కాగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టి రామారావు తెలుగువారి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలవడం తోపాటు తెలుగు సినీ రంగంలో చెరగని ముద్ర వేయడమేగాక రాజకీయ రంగం ద్వారా ప్రజలకు ఆయన చేసిన ఎనలేని సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేటా మే 28న ఆయన జయంతిని రాష్ట్ర వేడుకగా జరపాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన సామాజిక న్యాయం,వికేంద్రీకరణ మరియు ప్రజా-కేంద్రీకృత పరిపాలన,అన్నిటికంటే ముఖ్యంగా పేదలందరికీ పక్కాఇళ్ళ నిర్మాణం,రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి అనేక మార్గదర్శక సంక్షేమ పథకాలకు ఎన్టిఆర్ శ్రీకారం చుట్టారు. అంతేగాక తెలుగు జాతి గౌరవాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళడంలో ఎన్టి రామారావు ఎంతో కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తుగా ఆయన జ్ఞాపకార్థం ఎన్టిఆర్ కు తగిన గౌరవాన్ని ఇచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఎన్టి రామారావు జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టిఆర్ జయంతి వేడుకులను ఘనంగా నిర్వహించడం జరిగింది.

# నేడే అంతర్జాతీయ శాంతి పరిరక్షకుల దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల 77వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది, ఇది శాశ్వత శాంతికి సంఘర్షణ పరివర్తనతో నలిగిపోయే దేశాలకు సహాయపడే ఒక ప్రత్యేకమైన మరియు డైనమిక్ పరికరం. 1948 లో మొదటి యుఎన్ శాంతి పరిరక్షణ మిషన్ స్థాపించబడినప్పటి నుండి, హింస, ప్రమాదాలు మరియు వ్యాధుల చర్యల ఫలితంగా 3,000 వేలకు పైగా సైనిక, పోలీసులు మరియు పౌర సిబ్బంది శాంతి సేవలో ప్రాణాలు కోల్పోయారు. 1948 నుండి ప్రాణాలు కోల్పోయిన యుఎన్ శాంతిభద్రతలందరికీ గౌరవసూచకంగా యుఎన్ సెక్రటరీ పుష్పగుచ్ఛం ఇవ్వనున్నారు. మే 29 న, అన్ని యుఎన్ కార్యాలయాలు, సభ్య దేశాలు మరియు ప్రభుత్వేతర సంస్థలతో కలిసి, ఓడిపోయిన శాంతిభద్రతలను గౌరవించటానికి కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతి కొరకు జీవించండి. అంతర్జాతీయ




శాంతిభద్రతల చరిత్ర దినోత్సవం మొదటి యుఎన్ శాంతి పరిరక్షణ మిషన్ మే 29, 1948 న స్థాపించబడింది. జనరల్ అసెంబ్లీ మే 29 ను ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల అంతర్జాతీయ దినంగా పేర్కొంది. 1948 లో "ఐక్యరాజ్యసమితి ట్రూస్ పర్యవేక్షణ సంస్థ" లేదా యుఎన్ టీఎస్వోఅనే మొదటి యుఎన్ శాంతి పరిరక్షక మిషన్ పాలస్తీనాలో కార్యకలాపాలు ప్రారంభించిన తేదీ ఇది. అప్పటి నుండి, 1 యుఎన్ కంటే ఎక్కువ మంది మహిళలు మరియు పురుషులు 72 యుఎన్ శాంతి పరిరక్షక కార్యకలాపాలలో పనిచేశారు, మిలియన్ల మంది ప్రజల జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేశారు మరియు లెక్కలేనన్ని ప్రాణాలను రక్షించారు. ఈ రోజున, ప్రజలు యుఎన్ శాంతి పరిరక్షణ కార్యకలాపాలలో పనిచేస్తున్న అన్ని పురుషులు మరియు మహిళల వృత్తి నైపుణ్యం, అంకితభావం మరియు ధైర్యానికి నివాళి అర్పించారు మరియు శాంతి కోసం ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం గౌరవిస్తారు. ప్రతి సంవత్సరం మే 29 న, ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల అంతర్జాతీయ దినోత్సవం ప్రపంచ సంస్థ యొక్క పనికి యూనిఫాం మరియు పౌర సిబ్బంది చేసిన అమూల్యమైన కృషికి నివాళి అర్పించింది.

# ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే హౌజ్ అరెస్టు

కొమురం భీం ఆసిఫాబాద్

తుమ్మిడిహెట్టి ప్రాజెక్ట్ ను మేడిగడ్డకు తరలిస్తుంటే మాజీ ఎమ్మెల్యే కోనప్ప అసెంబ్లీ లో గాని బయటగాని నోరు మెదపలేదని సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు ఆరోపించారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేయకపోవడం వలన తూర్పు ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయని ... ఈ విషయంలో తుమ్మిడిహెట్టి వద్ద బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. దాంతో బుధవారం ఉదయం ఇరువురిని హౌజ్ అరెస్ట్ చేసారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సవాలుకు సిద్ధమైన కోనేరు కోనప్ప ని తుమ్మిడిహెట్టి ప్రాణహిత నది ప్రాంతానికి వెళ్తుండగా అడ్డుకున్నారు. అటు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు నివాసం వద్ద కూడా ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు.

# చైన్ స్నాచింగ్ కేసులలో నలుగురు నిందితులు ఆరెస్ట్

### 30 లక్షల రూపాయల విలువైన 476 గ్రాముల బంగారు ఆభరణాలు రెండు మోటార్ సైకిల్స్ స్వాధీనం

విజయవాడ

ఎన్.టి.ఆర్ జిల్లా లో జరుగుతున్న దొంగతనాలు మరియు చైన్ స్నాచింగ్ ల ను నివారించడంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్లు, సిబ్బందితో కలిసి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేసారు.

ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందాలకు వచ్చిన సమాచారం మేరకు సి.సి.ఎస్. ఇన్స్పెక్టర్ రామ్ కుమార్, అయన రి సిబ్బందితో కలిసి ఇబ్రహీంపట్నం తుమ్మలపాలెం బస్ స్టాప్ సమీపంలో వాహనాలు తనిఖీ చేసారు. ఆన్న సమయంలో అనుమానాస్పదంగా పారిపోతున్న నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. వారిని విచారించి 25 చైన్ స్నాచింగ్ కేసులలోని సుమారు 30 లక్షల విలువైన 476 గ్రాముల బంగారు ఆభరణాలను మరియు రెండు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకొని అరెస్టు చేసారు.

# బహిరంగ ప్రదేశంలోమద్యం సేవనం డ్రోన్ల సహాయంతో నిందితుల పట్టివేత

ఉంగుటూరుడ్రోన్ కెమెరాల సహాయంతో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారిని ఉంగుటూరు పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. డ్రోన్ కెమెరాల సహాయంతో జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు విశిష్ట కృషి చేస్తూ, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, ఆకతాయిలు వేధింపులకు పాల్పడిన, చట్ట వ్యతిరేక, జూద కార్యకలాపాలు నిర్వహించినా మిమ్మల్ని పసిగడతామని కృష్ణా జిల్లా పోలీసులు హెచ్చరించారు.

# అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు

తీసుకున్న అప్పు చెల్లించకపోవడంతో ప్రైవేట్ ఫైనాన్సు రికవరీ ఏజెంట్లు ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి తోటలో ఆత్మహత్యకు పాల్పడి ఘటన పెదవేగి మండలం కే కన్నాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కమిలి భాస్కరరావు 35 స్థానికంగా కూలీ పనులు చేస్తూ భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు అయితే గత కొంత కాలం క్రితం మహేంద్ర ఫైనాన్స్ అనే ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుండి గృహ నిర్మాణ అవసరాల నిమిత్తం అప్పు తీసుకొని తిరిగి చెల్లించలేదు దీంతో రికవరీ ఏజెంట్లు ఇంటికి అతనిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు

# ప్రభుత్వ ఆసుపత్రి లో జిల్లా కలెక్టర్ సతీమణికి కాన్పు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:

ప్రభుత్వ ఆసుపత్రి లో జిల్లా కలెక్టర్ సతీమణికి కాన్పు జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి లో జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. కలెక్టర్ సతీమణి చాలకాలం గా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి లోనే పరీక్షలు చేయించుకుంటున్నారు. కలెక్టర్ ప్రభుత్వ వైద్యం పై నమ్మకం పెంచారు.

# వెంకటరావుపేటలో రోడ్డెక్కిన రైతులు

రాజన్నసిరిసిల్ల

కోనరావుపేట మండలం వెంకటరావుపేటలో రైతులు రోడ్డెక్కారు. సన్న రకం వరిధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ మొలకొచ్చిన ధాన్యం, పురుగుల మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. నిమ్మపల్లి ఎక్స్ రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేసారు. నెలలు గడుస్తున్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. లెక్టర్ రావాలి... సన్న ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యం పండించాలని, 500 బోనస్ ఇస్తామని చెప్పి కొనుగోలు చేయడంలో జాప్యంపై మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు కదలమని భీష్మించుకుని కూర్చుకున్నారు. అధికారులు పట్టించుకోకపోతే పురుగుల మందు తాగి చస్తామని హెచ్చరించారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు రైతులను సముదాయించి ఆందోళన విరమింపజేసారు.

# వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్పు శ్రీకాంత్

బ్రహ్మంగారిమఠం భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞా నీ జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని బుధవారం ఉదయం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ విప్పు శ్రీకాంత్ గారు దర్శించుకున్నారు వారిని బ్రహ్మం గారి మఠం ఆలయ హిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అనంతరం స్వామివారి ప్రసాదాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆ తర్వాత ఆయనను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జీవిత చరిత్ర సంబంధించిన పుస్తకాలను స్వామివారి చిత్రపటాలను ఆయనకు బహుకరించారు ఆయనతోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారుస్వామివారి సన్నిధిలో ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్:: గారపాటి రామ సీత

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని ఎన్టీఆర్ జిల్లా ఏలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమతి గారపాటి రామ సీత గారు బుధవారం ఉదయం వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు ఆమెతో పాటు ఏలూరుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు అనంతరం బ్రహ్మంగారిమఠం నుంచి కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి తరలి వెళ్లారు

# కవితకు బలాలు ఏంటీ... బలహీనతలు ఏంటీ

హైదరాబాద్, మే 28,

కల్వకుంట్ల కవిత. తెలంగాణలో కేసీఆర్ కుమార్తెగా ప్రజలకు పరిచయం అయిన కవిత ఆ తర్వాత కాలంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. అటు ఉద్యమంలో, ఇటు రాజకీయాల్లో తనకుంటూ ఓ స్థానం ఏర్పాటు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారు ఉండరు. తెలంగాణలో ఇక చెప్పనక్కరలేదు. తెలంగాణ ఉద్యమంతో సంబంధం ఉన్న ప్రతీ ఒక్కరికీ కవితకు ఉద్యమ రాజకీయాలు, తెలంగాణ రాజకీయాలతో



ఉన్న సంబంధాలు తెలుసు. అయితే మైడియర్ డాడీ అంటూ బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ ఇప్పుడు సంచనలమైంది. బీఆర్ఎస్ పార్టీ చీలుతుందా అన్న చర్చ దగ్గరి నుంచి కవిత కొత్త పార్టీ పెట్టేస్తున్నారనే వార్తలు చక్కర్లు కొట్టే స్థాయికి చేరాయి. అయితే బీఆర్ఎస్ లో ఏదో జరుగుతుందన్నది మాత్రం ఆమె లేఖ ద్వారానే బహిర్గతమైంది. అయితే ఇప్పటి వరకు దీనిపై పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ నర్మగర్భంగా మాట్లాడటం మినహా అందరూ సైలంట్ గా ఉన్నారు. ఈ అంశాలపై చర్చించేందుకు కేసీఆర్ నుంచి కవితకు ఎలాంటి పిలుపు రాలేదు. అయితే కేసీఆర్ దూతలుగా రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ లీగల్ సెల్ ఇంఛార్జి గండ్ర మోహన్ రావు మూడు గంటల పాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో తన లేఖను బయటపెట్టిన వ్యక్తులెవరో తెల్చాలని, తన రాజకీయ భవిష్యత్తుపై హమీ ఏంటని, పార్టీలో తన స్థానం ఏంటని కవిత ప్రశ్నించినట్లు తెలిసింది. కేసీఆర్‌తో నేరుగా చర్చించాలని తాను అనుకుంటున్నట్లు వారితో కవిత చెప్పినట్లు సమాచారం. రానున్న రోజుల్లో దీనిపై బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఏం నిర్ణయం తీసుకుంటారు. ఒక వేళ ఈ విషయంలో ఆయన మౌనం దాల్చితే కవిత ఏ నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పడే చేప్పలేం. అయితే ఒక వేళ ఈ చర్చలు విఫలమై కవిత పార్టీ పెడితే ఎలా ఉంటుంది? అసలు పార్టీ పెట్టే శక్తి కవితకు ఉందా? తెలంగాణలో కొత్త పార్టీకి అవకాశం ఉందా ? కవిత కొత్త పార్టీ పెడితే ఏ పార్టీ నష్టపోతుంది ? అన్న అంశాలు చూద్దాం.

కవిత ప్లస్ పాయింట్స్ ఏంటంటే??

తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ కూతురుగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. అదే రీతిలో పార్టీలో కేసీఆర్ తర్వాత కేటీఆర్, హరీశ్ రావుకు ఎలాంటి ఫాలోయింగ్ ఉందో అలాంటి ఫాలోయింగ్ ను కవిత సంపాదించుకున్నారు. కొత్తగా తనను తాను తెలంగాణ ప్రజలకు పరిచయం చేసుకోనక్కరలేని మంచి అవకాశం కవితకు ఉంది. ఇది ఓ పార్టీ పెట్టడానికి మంచి బలాన్ని ఇచ్చే అంశంగా చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమంలో కవిత పాత్రకు మంచి గుర్తింపు ఉంది. తెలంగాణ జాగృతి వంటి సంస్థను స్థాపించి, ఆ సంస్థతో తెలంగాణ భాష, సంస్కృతి, పండుగల పట్ల ప్రజల్లో ఓ చైతన్యాన్ని తీసుకురావడంలో సఫలీకృతం అయ్యారు. ఈ సంస్థ ద్వారా తెలంగాణ ప్రజలో ఓ సంబంధాన్ని ఏర్పరుచుకోగలిగారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు ఈ సెంటిమెంట్ ఏదో రూపంలో ఉపయోగపడుతుంది. కవిత కొత్త పార్టీ పెడితే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తీరు, ఉద్యమ కేసుల్లో ఉండటం వంటి అంశాలు ప్రజలను దగ్గర చేసేందుకు ఉపయోగపడతాయి. పార్టీ ప్రారంభానికి ఇది ఓ ఉపయోగపడే అవకాశం ఉంది. కవిత ఇప్పటికే అధ్యక్షురాలిగా ఉన్న తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలోని గ్రామ స్థాయి వరకు తెలంగాణ జాగృతి సంస్థను కవిత విస్తరింప జేశారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ అంతటా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోను, విదేశాల్లోను జాగృతి శాఖలు ఉన్నాయి. కొత్త పార్టీ పెట్టేందుకు ఈ బేస్ కవితకు బాగా లాభిస్తుంది. కొత్తగా పార్టీ ఏర్పాటు చేసే లాంఛింగ్ సమస్యలు ఏవీ కవితకు వచ్చే అవకాశం లేదు. ఇలా తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటుకు లాంఛింగ్ పాడ్ లా ఉపయోగపడుతుంది.

తెలంగాణలో ప్రజాకర్షణ గల మహిళా రాజకీయ నాయకుల కొరత ఉంది. మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునే శక్తి ఉన్న మహిళా నేతలు తెలంగాణలో లేరనే చెప్పాలి. ఈ లోటును కవిత పూడ్చే అవకాశం ఉంది. మహిళలను ఆకట్టుకునే నాయకురాలిగా ఎదిగే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ జాగృతి సంస్థ, మహిళా రిజర్వేషన్లపై చేసిన కార్యక్రమాలు, కవితకు ఉన్న రాజకీయ అనుభవం కొత్త పార్టీ పెట్టేందుకు కలిసి రావచ్చు. ఉద్యమ నాయకురాలిగా, పార్లమెంట్ సభ్యురాలిగా, శాసనమండలి సభ్యురాలిగా ఉన్న అనుభవం పార్టీ నడపడంలో కొంత బలాన్ని ఇస్తుంది. అంతే కాకుండా కేసీఆర్ కూతరు కావడంతో తన తండ్రి పార్టీని నడిపిన తీరు, సంక్షోభ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు వాటి వల్ల వచ్చిన విజయాలు, ఓటములు దగ్గర నుంచి చూసిన అనుభవం కూడా కలిసి వస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల పట్ల విముఖత ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఓ కొత్త ప్రత్యామ్నాయాన్ని చూస్తుంటారు. అలాంటి సందర్భంలో కవిత పెట్టే పార్టీకి ఈ రాజకీయ పరిస్థితులు కొంత మేర కలిసి రావచ్చు. అలాంటి నేతలు కొత్త పార్టీలోకి వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి చేరికలు కొత్త పార్టీలో జోష్ నింపుతుందనడంలో సందేహం లేదు.

బలహీనతలు ఏంటీ...

తెలంగాణలో ఇప్పటికే కేసీఆర్ కుటుంబపై ఉన్న ప్రధాన ఆరోపణ కుటుంబ రాజకీయాలు అనే ముద్ర. బీఆర్ఎస్ నుంచి వీడి కొత్త పార్టీ పెట్టినా కవితకు ఆ ముద్ర తప్పదు. అటు విపక్షాలు, ప్రజల నుంచి వచ్చే రాజకీయ విమర్శలు కొత్త పార్టీ పెట్టే విషయంలో ప్రతికూలం కావచ్చు. లిక్కర్ స్కాంలో ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలతో కవిత జైలుకు వెళ్లి రావడం ప్రధాన ప్రతికూలాంశంగా మారవచ్చు. అయితే కేసు నుంచి కవిత బయటపడే వరకు విపక్షాలు కవితను రాజకీయంగా వెనక్కు నెట్టే అస్త్రంగా లిక్కర్ స్కాం కేసును ఉపయోగిస్తాయనడంలో సందేహం లేదు. కొత్త పార్టీ పెట్టే వ్యక్తి రాజకీయ జీవితం మచ్చ లేనిదిగా ఉంటేనే పార్టీ నడపటం కష్టమైన ప్రస్తుత రాజకీయాల్లో లిక్కర్ స్కాంలో ఆరోపణలతో పార్టీని పెట్టి దాన్ని నడపడం కవితకు కత్తిమీద సామే అని చెప్పాలి.

ప్రస్తుత పరిస్థితుల్లో కవిత కొత్త పార్టీ పెట్టేందుకు తెలంగాణలో రాజకీయ వాతావరణం అనుకూలంగా లేదనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీజేపీ క్రమ క్రమంగా తన బలాన్ని పెంచుకుంటూ ఉన్న తరుణం ఇది. బీఆర్ఎస్ పార్టీ కూడా భారీ బహిరంగ సభను వరంగల్ లో నిర్వహించి ప్రజాకర్షణ శక్తి ఏ మాత్రం తమ చీఫ్ కేసీఆర్‌కు తగ్గలేదని నిరూపించుకుంది. ఈ ఉత్సాహంతో ముందుకు సాగుతుంది ఇలాంటి రాజకీయ వాతావరణంలో కవిత కొత్త పార్టీ పెడితే ప్రజల నుంచి అనుకున్న రీతిలో మద్ధత్తు వస్తుందని ధీమాగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. కవిత కొత్త పార్టీ పెడితే బీఆర్ఎస్‌కు నష్టం కలిగించడమే ప్రధాన లక్ష్యం అవుతుంది. ఆ పార్టీ ఓటర్లలోనే ఎక్కువ చీలిక వస్తుందన్నది నిజం. ఆ పార్టీలోని అసంతృప్త నేతలు, కార్యకర్తలు, ఓటర్లు కొద్ది మంది కవిత వైపు తిరగవచ్చు. కాని ఇది బీఆర్ఎస్‌కు, అటు కవితకు లాభం చేకూర్చేది కాకుండా కాంగ్రెస్, బీజేపీలకు లాభించే అవకాశం ఉంది ఏ పార్టీ స్థాపించినా దానికో లక్ష్యం ఉంటుంది. అయితే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటికే కాంగ్రెస్ , బీజేపీ, బీఆర్ఎస్, వామపక్షాల వంటి పార్టీలు ఓ బలమైన కారణాలతో పురుడు పోసుకున్నవి . పక్క రాష్ట్రంలో తీసుకున్నాటీడీపీ , వైసీపీ ఆవిర్భావం వెనుక బలమైన ప్రజా లక్ష్యాలు ఉన్నాయి. అయితే కవిత పెట్టే కొత్త పార్టీ తనకు అన్యాయం జరిగిందని చెబితే ప్రజలు ఆమోదం తెలిపే స్థితిలో లేరు. ఓ బలమైన ప్రజల ఆకాంక్షలను లక్ష్యంగా పెట్టుకొని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాంటి సెంటిమెంట్ ఉంటే తప్ప కొత్త పార్టీ నిలదొక్కుకునే పరిస్థితి ఉండదు.కొత్త రాజకీయ పార్టీ స్థాపన అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. నిధులు భారీగా అవసరం. కేసీఆర్ కుమార్తెగానో లేదా జాగృతి అధ్యక్షురాలిగానో నిధుల సేకరణ అంత సుళువుగా సాధ్యమయ్యే పని కాదు. కొత్త నాయకులను, కార్యకర్తలను తన వైపు తిప్పుకోవడం కూడా అంత ఈజీగా జరిగే పని కాదు.

మొత్తానికి అసంతృప్తితో ఉన్న కవిత కొత్త పార్టీ పెడుతారా లేకుంటే టీ కప్పులో తుపాను లా బీఆర్ఎస్ లో ఈ సంక్షోభం ముగియనుందా? అన్నది వేచి చూడాల్సిందే. అయితే కొత్త పార్టీ స్థాపనకుపై అంశాలు ప్రభావితం చూపే అవకాశం మాత్రం ఉన్నాయి. కవిత కొత్త పార్టీ పెట్టడం అనేది మాత్రం సాహసోపేతమైన చర్యగా చూడాల్సిందే. బీఆర్ఎస్‌లో డైనమిక్‌గానే కవిత వ్యవహార శైలి ఉంటుందని గులాబీ నేతలు చెబుతుంటారు. కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆ లేఖ బహిర్గతం కాగానే సైలంట్‌గా ఉండకుండా తన లేఖను బయపెట్టింది కేసీఆర్ చుట్టు ఉన్న దయ్యాలే అని, కోవర్టులే అని మీడియా ముందుకు వచ్చి ధైర్యంగా మాట్లాడటం ఇవన్నీ కవిత ఓ కచ్చిత నిర్ణయానికి వచ్చి చేస్తున్న చర్యలుగానే చూడాల్సి వస్తుంది. పార్టీలో తన స్థానం ఏంటో తెలుసుకునేందుకు ఈ రీతిలో కవిత స్పందన ఉందన్నది బీఆర్ఎస్ కీలక నేతల మాట. ఇనాళ్లు పార్టీలో ఉండి పని చేసిన తన లాంటి నేతను పక్కన పెడితే చూస్తూ తాను ఊర్కునే రకం కాదన్న హెచ్చరిక గత రెండు మూడు రోజుల పరిణామాలు చెబుతున్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట. అయితే కేసీఆర్ లాంటి లెంజడరీ నాయకుడ్ని, కేటీఆర్, హరీశ్ రావు లాంటి రాజకీయ చతురత ఉన్న నేతలను కాదని కవిత తన రాజీకీయ భవిష్యత్తు కోసం పార్టీ పెట్టి వారికి ఎదురెళుతుందా ? అంత సాహసం చేస్తుందా ? అన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో ఉంది.

## అమ్మకానికి హౌసింగ్ బోర్డు ప్లాట్స్

హైదరాబాద్, మే 28,

తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం నిధుల సమీకరణకు కీలక నిర్ణయం తీసుకుంది. హౌసింగ్ బోర్డు ఆధీనంలోని వివాదరహిత ప్లాట్లను వేలం వేయనుంది. ఈ వేలం ద్వారా వచ్చే నిధులను ఇందిరమ్మ పథకానికి వినియోగిస్తారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ పథకం మొదటి దశ గృహ ప్రవేశాలు జరగనున్నాయి.తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 70 వేలకు పైచిలుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ప్రతి నియోజవకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనుండగా.. మె?త్తం 4 విడతల్లో ఈ నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు నిధుల సమీకరణ కోసం తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర హౌసింగ్ బోర్డు తమ ఆధీనంలోని వివాదరహిత ప్లాట్లను వేలం వేయడానికి సిద్ధమవుతోంది. అన్ని జిల్లాల్లో గుర్తించిన ఈ ప్లాట్ల వివరాలను అధికారులు సిద్ధం చేశారు. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి, ఈ వేలం ద్వారా భారీగా రెవెన్యూ సమకూర్చుకోవాలని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నిధులను నేరుగా ఇందిరమ్మ పథకానికి ఉపయోగించాలని భావిస్తోంది. హైదరాబాద్‌తో పాటు జోగులాంబ గద్వాల, జడ్చర్ల, ఇతర జిల్లా కేంద్రాల్లోని ప్లాట్లను వేలం వేయనున్నారు. అధికారులు గుర్తించిన ప్లాట్లలో కోర్టు వివాదాలు లేనివి, ఎలాంటి కేసులు లేనివి, కమర్షియల్ ఏరియాల్లో ఉన్నవి ఉన్నాయి. మొత్తం 1250 జాగాలు (ప్లాట్లు) ఉండగా, ఇవి సుమారు 3.22 లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి సమీపంలోని ఖైతలాపూర్‌లోనే 250కి పైగా ప్లాట్లు ఉన్నట్లు సమాచారం. ఈ ప్లాట్లకు మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో హౌసింగ్ బోర్డుకు వేల కోట్ల విలువైన వందల ఎకరాల భూములు, ప్లాట్లు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మహబూబ్ నగర్, మెదక్, నల్గొండ జిల్లాల్లో ఈ భూములు అధికంగా ఉన్నాయి.అన్యాక్రాంతం కాకుండా వీటిని పరిరక్షించడానికి హౌసింగ్ బోర్డు చర్యలు చేపట్టింది. ప్లాట్ల చుట్టూ గోడలు, ఫెన్సింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, అవి హౌసింగ్ బోర్డు భూములు అని తెలియజేస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు, వేలం ద్వారా సమీకరించిన నిధులతో ఇందిరమ్మ వంటి ప్రజా సంక్షేమ పథకాలకు ఊతం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలా ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి దశలో పూర్తయిన ఇళ్లకు వచ్చే నెల జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గృహ ప్రవేశాలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# రాజీనా... విభజనా...

హైదరాబాద్, మే 28,

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్)కు రాసిన ఆరు పేజీల లేఖ రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ లేఖలో కవిత, బీఆర్ఎస్ ఇటీవల ఎల్కతుర్తిలో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ సభలో కేసీఆర్ ప్రసంగం గురించి సానుకూల, ప్రతికూల అంశాలను పేర్కొన్నారు. బీజేపీని కేవలం రెండు నిమిషాలు మాత్రమే విమర్శించడం, వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ, వక్ఫ్ సవరణ చట్టం వంటి కీలక అంశాలను ప్రస్తావించకపోవడం వంటి అంశాలను విమర్శించారు. ఈ లేఖ బహిర్గతం కావడం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కవితను సున్నితంగా మందలించడంతో పార్టీ కేడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. ఇలాంటి తరుణంలో తనను విమర్శినివారితో కాంప్రమైజ్ కాని కేసీఆర్.. ఈసారి మాత్రం సంచలన నిర్ణయం తీసుకున్నారు.తన నిర్ణయాతను తప్పు పట్టేవారు, తన నిర్ణయాలను ధిక్కరించేవారు ఎంతటివారైనా కేసీఆర్ సహించరు. పొమ్మనలేక పొగబెడతారు. ఆలె నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్ వంటివారు ఇందుకు ఉదాహరణ. కానీ, కవిత విషయంలో మాత్రం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారు. కుటుంబ సభ్యురాలినే సస్పెండ్ చేస్తే.. పొమ్మనలేక పొగబెడితే క్యాడర్‌లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న ఆందోళన నెలకొంది. దీంతో తనకు ఆత్మలాంటి నేతలు రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావును రాయబారానికి కవిత వద్దకు పంపించారు. సోమవారం సాయంత్రం 6?7 గంటల సమయంలో కవిత ఇంటికి వెళ్లిన దామోదర్‌రావు తన వెంట న్యాయవాదిని కూడా తీసుకెళ్లారు. దామోదర్ రావు, కేసీఆర్‌తో సుదీర్ఘ అనుబంధం కలిగిన నేతగా, 'నమస్తే తెలంగాణ' పత్రిక స్థాపనలో కీలక పాత్ర పోషించారు. 2022లో కేసీఆర్ ఆశీస్సులతో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇలాంటి నేపథ్యంలో, ఆయన కవితను కలవడం రాజకీయంగా ముఖ్యమైన చర్చలకు దారితీసింది. కేసీఆర్ ఈ సందర్శనకు దామోదర్ రావును పంపించారా లేక ఇది వ్యక్తిగత సందర్శనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.కవిత లేఖ వెలుగులోకి వచ్చిన తర్వాత, బీఆర్ఎస్‌లో అంతర్గత కలహాలు బయటపడ్డాయి. ఈ లేఖ సమయంలో కేసీఆర్‌కు వారసుడిగా కేటీ.రామారావు (కేటీఆర్)ను ప్రకటించే సూచనలు ఉన్నాయి, ఇది కవితకు అసంతృప్తి కలిగించి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత లేఖలో కేసీఆర్ అప్రాప్యత, పార్టీ క్యాడర్‌తో సంబంధం తగ్గడం వంటి అంశాలను ప్రస్తావించడం ద్వారా, ఆమె తనకు పార్టీలో సరైన స్థానం లభించడం లేదనే సంకేతాలు ఇచ్చినట్లు కనిపిస్తోంది. కేటీఆర్ ఈ లేఖపై స్పందిస్తూ, పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా చర్చించడం కాకుండా, పార్టీ వేదికల్లోనే పరిష్కరించాలని పేర్కొన్నారుకవిత లేఖ బహిర్గతం కావడం వెనుక ఒక ఉద్దేశపూర్వక రాజకీయ కుట్ర ఉందని కొందరు భావిస్తున్నారు. ఈ లేఖను కవిత బృందం లీక్ చేసి ఉండవచ్చని, లేదా కేసీఆర్ కుటుంబంలోని కొందరు ఆమెను ఒంటరిచేయడానికి ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని ఊహాగానాలు సాగుతున్నాయి. కొన్ని సమాచారాల ప్రకారం, కవితకు షోకాజ్ నోటీసు జారీ చేయడం లేదా పార్టీ నుంచి సస్పెన్షన్‌కు దారితీసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, కవిత తన లేఖలో పేర్కొన్న అంశాలు సామాన్య కార్యకర్తల అభిప్రాయాలను ప్రతిబింబిస్తాయని, తనకు వ్యక్తిగత ఎజెండా లేదని స్పష్టం చేశారు.కవిత లేఖలో బీజేపీపై కేసీఆర్ మృదువైన వైఖరిని విమర్శించడం, బీఆర్ఎస్ ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వంటి అంశాలు, పార్టీ బీజేపీతో సంబంధాలు కలిగి ఉండవచ్చనే ఊహాగానాలకు బలం చేకూర్చాయి. కవిత, ఢిల్లీ మద్యం కేసులో తన అరెస్టును బీజేపీతో ముడిపెడుతూ, ఆ పార్టీపై గట్టిగా విమర్శించాలని కేసీఆర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఈ లేఖను ఉపయోగించుకుని బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలను హైలైట్ చేస్తున్నారు.దామోదర్ రావు సందర్శన, కవిత లేఖ వివాదం బీఆర్ఎస్‌లో రాజీకి దారితీస్తాయా లేక పార్టీలో విభజనకు కారణమవుతాయా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. కొందరు రాజకీయ విశ్లేషకులు, కవిత కాంగ్రెస్‌తో చేతులు కలపవచ్చని లేదా కొత్త పార్టీని స్థాపించవచ్చని ఊహిస్తున్నారు. అయితే, కవిత తన విధేయత కేసీఆర్‌కు ఉందని, పార్టీలో చిన్నపాటి లోపాలను సరిదిద్దితే బీఆర్ఎస్ దీర్ఘకాలం అధికారంలో ఉంటుందని పేర్కొన్నారు.

## కొంపల్లిలో కుక్కల హల్ చల్

కుత్బుల్లాపూర్

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కలు పట్టపగలే పాదచారులకు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్న ఒక్క రోజే 4గురికి కుక్క కాటుకు గురయ్యారు. కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు కనీస చర్యలు లేకుండా కాలం గడుపుతున్నారని స్థానికుల ఆరోపణ.ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు అంటూ స్థానికుల ఆగ్రహం. చిన్న పెద్ద తేడా లేకుండా పలువురిపై వీధి కుక్కలు ప్రతాపం చూపిస్తున్నాయి. నడి రోడ్డు పైన కుక్కలు గుంపులు గుంపులుగా చేరి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి అని దూలపల్లి వాసులు.ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## చింతపండు బస్తాల చోరీ

యాదాద్రి

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కొంతమంది ఉద్యోగుల చేతివాటం బయటపడింది. ప్రసాద్ విక్రయశాల గోదాం నుంచిచింతపండు బస్తాలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న వైనం బయటపడింది. ఆలయ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని స్థానికులు, భక్తులు అంటున్నారు. యాదగిరిగుట్ట కొండపైన గోదాం నుంచి 10 బస్తాల చింతపండు దొంగతనం చేస్తూ సురక్ష ఉద్యోగులు పట్టుపడ్డారు. పూర్తి స్థాయి ఈఓ లేకపోవడంతో అధికారులు ఇష్ట రీతిన వ్యవహరిస్తున్నారు.

## యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

విశాఖపట్నంజూన్ 21న విశాఖ వేది కగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను ప్రపం చ స్థాయి ప్రమాణాలకు అనుగుణం గా చేయాలని, చిన్నపాటి సమన్వ యం లోపం కూడా తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ ఏర్పాట్లు, క్షేత్రస్థాయి పరిస్థితుల పరిశీలన నిమిత్తం జిల్లాకు విచ్చే సిన ఆయన జిల్లా కలెక్టర్, జాయిం ట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి మీటింగు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశాని ర్దేశం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మ కంగా తీసుకున్నారని, దాన్ని దృష్టి లో పెట్టుకొని ప్రతి ఒక్కరూ బాధ్య తాయుతంగా వ్యవహరించాలని, పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకొని కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిం చాలని సూచించారు. ఇటీవల జరిగిన నీతీ ఆయోగ్ సమావేశంలో కూడా ముఖ్యమంత్రి యోగా దినో త్సవం గురించి, నిర్వహణ, ప్రపంచ రికార్డు సాధించేందుకు అనుసరించే విధానాల గురించి వివరించారని కృష్ణబాబు గుర్తు చేశారు. దీన్నిబట్టి యోగా దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, దానికి తగ్గట్టుగా సన్నద్ధం కావాలని అన్నారు.

## ఉచిత చేప పిల్లల పంపిణి టెండర్లపై మాత్స్య శాఖ మొద్దు నిద్ర - కంతి హరికుమార్

మెట్ పల్లి ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్లపై మత్స్యశాఖ మొద్దు నిద్ర వీడడం లేదని టీపీసీసీ ఫిషరీస్ కార్య నిర్వాహక సభ్యుడు కంతి హరికుమార్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మెట్ పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నైరుతి రుతుపవనాలు ముంచుకొస్తున్నా, ఉచిత చేప పిల్లల పంపిణీ పై మత్స్యశాఖ మేల్కొనడం లేదని ధ్వజమెత్తారు. ఆనవాయితీగా ప్రతి ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్యలో చెరువుల్లో చేప పిల్లలను వదలాల్సి ఉండగా, గత దశాబ్ద కాలంగా ఈ ప్రక్రియ నత్త నడకన సాగుతుందన్నారు. మత్స్యకారుల లబ్ధి కోసం నూరు శాతం సబ్సిడీతో 2016 లో ఉచిత చేప పిల్లల పంపిణీకి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టినా ఏ ఒక్క ఏడాది కూడా చెరువుల్లోకి చేప పిల్లలు సకాలంలో చేరిన దాఖలాలు లేవని అన్నారు. కాంట్రాక్టర్ల కొరత అధికారుల సమన్వయ లేమితో ఈ పథకం ఆబాసు పాలవుతుందని ద్వజమెత్తారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అయినా ముందస్తుగా టెండర్లు పూర్తి చేస్తారనుకుంటే ఆ దిశలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మే నెల గడుస్తున్నా టెండర్ల కసరత్తుకు మత్స్యశాఖ సిద్ధం కాకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ మొదటి వారంలో భారీగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ స్పష్టంగా ప్రకటించిందని, ఇప్పటికి ఆ దిశగా మత్స్యశాఖ చేప పిల్లల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి కసరత్తు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు.

# 50 లక్షలు డిమాండ్ చేసిన ఇద్దరు నకిలీ నక్సలైట్ల అరెస్టు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, మే 28:జీడిమెట్ల పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం





2025 మే 22న మధ్యాహ్నం 13:00 గంటలకు కూన రాఘవేందర్ గౌడ్ నుండి ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారుడి తండ్రి రవీందర్ గౌడ్, వారి ఇంటి ముందు ఉన్న తులసి మొక్క దెబ్బతిన్నదని, వారి కారుపై ఒక లేఖ మరియు ఎరుపు రంగు టవల్ ఉంచబడిందని తెలియజేశారు. ఫిర్యాదుదారు వెంటనే ఇంటికి తిరిగి వచ్చి వివరించిన విధంగా వస్తువులను కనుగొన్నారు. లేఖను చదివిన తరువాత, అందులో "నక్సలైట్లు" నుండి బెదిరింపు సందేశం ఉందని, శుక్రవారం ఉదయం 9 గంటల నాటికి ?50 లక్షలు డిమాండ్ చేస్తున్నారని, లేకుంటే ఫిర్యాదుదారుడిని చంపేస్తామని బెదిరింపు సందేశం ఉందని తేలింది. దెబ్బతిన్న తులసి మొక్కను సింబాలిక్ హెచ్చరికగా ప్రదర్శించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి నిందితులను పట్టుకోవడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక మరియు మానవ నిఘా ఆధారంగా బృందాలు పనిచేశాయి. ఒక ప్రత్యేక బృందం 500 కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించింది. నిశితంగా పరిశీలించడం ద్వారా, బృందాలు అనుమానితుల కదలికలను ట్రాక్ చేసి వారి ఆచూకీని నిర్ధారించగలిగాయి, ఇది కేసులో పురోగతికి దారితీసింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా, 28.05.2025న ఉదయం 9.30 గంటలకు, షాపూర్ నగర్ సమీపంలోని %ఎమీ% జంగిల్ ప్రాంతంలో నిందితులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. వేగంగా చర్య తీసుకుని, జీడిమెట్ల పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుని అనుమానితులను అడ్డుకుంది. ఆ ప్రాంతంలో వారి ఉనికి గురించి ప్రశ్నించగా, నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే, అప్రమత్తమైన అధికారులు వారిని అక్కడికక్కడే విజయవంతంగా పట్టుకున్నారు. విచారణలో, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో నమోదైన దోపిడీ ప్రయత్నంలో తమ ప్రమేయం ఉందని ఇద్దరు వ్యక్తులు అంగీకరించారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నిందితులు నక్సలైట్ల వలె నటించి డబ్బు వసూలు చేయడానికి కుట్ర పన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆస్తి నేరాల చరిత్ర కలిగిన %ూ%-1, గతంలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు కానీ మూడు నెలల క్రితం ఉద్యోగం నుండి తొలగించబడ్డారు. వారి ఆర్థిక ఇబ్బందుల కారణంగా మరియు నేరపూరిత ఉద్దేశ్యం కారణంగా, ఇద్దరు నిందితులు షాపూర్ నగర్‌లోని ఒక సంపన్న నివాసిని లక్ష్యంగా చేసుకుని సులభంగా డబ్బు సంపాదించడానికి ఒక ప్రణాళికను రూపొందించారు. నిందితులు మొదట ?50 లక్షలు డిమాండ్ చేస్తూ ఫిర్యాదుదారుడి నివాసంలో బెదిరింపు లేఖను ఉంచారు. అయితే, ఫిర్యాదుదారుడి నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో, %ూ%-1 మరియు %ూ%-2 ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరానికి వెళ్లారు, అక్కడ వారు తమ బెదిరింపులను పెంచే ఉద్దేశ్యంతో అధునాతన పేలుడు పరికరాన్ని (%×జుణ%) సమీకరించారని తెలిసింది. ఆ తర్వాత వారు హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు మరియు ఎటువంటి ప్రతిస్పందన లేకపోవడంతో 28.05.2025న ఫిర్యాదుదారుడి నివాసంలో బాంబును అమర్చి పేల్చారు, భయాన్ని సృష్టించి, సమ్మతిని బలవంతం చేయాలనే ఉద్దేశ్యంతో.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వివరాలు:

ఏ -1: ఎర్రంశెట్టి రాజు, వయస్సు 33 సంవత్సరాలు, నివాసం: షాపూర్ నగర్, గన్నవరం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

ఎ-2: కందురెల్లి రాజు, వయస్సు 24 సంవత్సరాలు, స్థానిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గన్నవరం.

మునుపటి నేర చరిత్ర:

౧ ఏ -1: ??ఎర్రంశెట్టి రాజుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఆస్తి నేరాలలో ప్రమేయం ఉన్నట్లు ముందస్తు రికార్డు ఉంది.

సీజర్:1. పేలుడు పదార్థాలు,2. ఒక బెదిరింపు లేఖ,

3. 4 మొబైల్ ఫోన్లు,4. ఆధార్ కార్డు

ఈ కేసును ఏసీపీ నరేష్ రెడ్డి, జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ జి. మల్లేష్, డిఐ ఎస్. కనకయ్య, ఎస్ఐ ప్రేమ్ సాగర్, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు నరేష్, రవి నాయక్‌లు దర్యాప్తులో ముఖ్యమైన పాత్ర పోషించారు. వారు కీలక సమాచారాన్ని వనరులు మరియు సాంకేతిక పద్ధతులను ఉపయోగించి సేకరించారు. వారి కృషి మరియు త్వరిత చర్య కారణంగా, నిందితులను సకాలంలో కనుగొని పట్టుకున్నారు, తీవ్రమైన నేరాన్ని నివారించడంలో మరియు ప్రజలను సురక్షితంగా ఉంచడంలో సహాయపడ్డారు. జీడిమెట్ల పోలీసులు ప్రజా భద్రతకు కట్టుబడి ఉన్నారు మరియు పాల్గొన్న అధికారులకు వారి మంచి పనికి తగిన బహుమతులు అందజేశారు.

# సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం.



రుద్రంగి, మే 28 (భారత శక్తి): రుద్రంగి మండల కేంద్రంలోని స్థానిక ఇంద్ర చౌక్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత పదేండ్ల తర్వాత ప్రజాపాలన మొదలైందని, ఏడ దిన్నర లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకున్నామని , మన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో వేములవాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు 200 కోట్ల రూపాయలతో మంజూరు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసుకొని పటాకులు కాల్చరు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, డిసిసి కార్యదర్శి గడ్డం శ్రీను, మండల అధ్యక్షుడు తుమ్ జలపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు ఎర్రం గంగా నర్సయ్య, గండి నారాయణ, తరే లింగం ,మనోహర్ ,పల్లి గంగాధర్, సన్నీ, మనోజ్, సిరికొండ రవీందర్ ,అట్లపెల్లి మల్లేశం, సంతోష్ రెడ్డి ,పిడుగు లచ్చిరెడ్డి ,యాదయ్య, దిలీప్, దయ్యల శ్రీను, ధర్పల్లి మహేష్, మంగ రమేష్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలి బోనకల్ ఎస్సై పోదిల వెంకన్న

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, మే 28: నాణ్యమైన విత్తనాలు మాత్రమే మండలంలోని రైతులకు విక్రయించాలని నకిలీలు అంటగడితే కేసులు నమోదు చేస్తామని బోనకల్లు ఎస్సై వెంకన్న అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ రహెమాన్ పర్యవేక్షణలో వ్యవసయశాఖ ఏవో వినయ్ కుమార్, ఏ ఈ ఓ హరికృష్ణ తో కలసి మండలంలోని విత్తనాలు %఑% ఎరువుల దుకాణాలలో, గోడౌన్లలో సంయుక్తంగా అకస్మిక తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అదేవిధంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలు, డెలివరి చలాన్‌లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, విత్తనాల విక్రయ రిజిస్టర్, లాట్ రిజిస్టర్, రైతు విక్రయ రిజిస్టర్, లైసెన్స్ సక్రమంగా వున్నాయ లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై పోదిల వెంకన్న మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయించవద్దని, రైతులకు నష్టం కలిగేలా వ్యవహారించవద్దని అన్నారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.




# జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి, మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, మే 28: గౌరవ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్, జిల్లాస్థాయి అధికారులు మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎపిఎమ్ఎస్, ఎపిఓఎస్ లతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, ఉపాధి హామీ నీటి సంరక్షణ పనుల అంశాలపై సమీక్షించడం జరిగింది. రాజీవ్ వికాసం లో 50,000 అదేవిధంగా ఒక లక్ష రుణాలు ఎంపిక రేపటి లోపు పూర్తిచేయాలని, నీటి సంరక్షణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వన మహోత్సవంకి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు పై యూత్ కాంగ్రెస్ నేతల హర్షం



వేములవాడ,మే 28 (భారత శక్తి) : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వేములవాడ కు మంజూరు చేసిన సందర్బంగా వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా బుధవారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్ (లడ్డు) ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను వేములవాడకు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, దీనికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, వేములవాడ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముందుకు వెళ్తున్నారని,రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ యువకులు, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగా మురళి, రూరల్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, అర్బన్ అధ్యక్షుడు చిట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బొమ్మ తిరుపతి, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసర్ల అరుణ్, భాస్కర్, సాగర్, నక్క సాయి, సందెల శశి కుమార్, రాజేందర్ మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 28: నిర్మల్ జిల్లా లో బక్రీద్ పండుగను శాంతియుతంగా, సమగ్రంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన బక్రీద్ పీస్ కమిటీ సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే జూన్ నెలలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ఈద్గా ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు టెంటులు, షామియానాలు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈద్గా ప్రదేశాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితిని పర్యవేక్షించి, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు




వార్తలు, పుకార్లు వ్యాపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చ్చరించారు. అన్ని మతపరమైన వేడుకలను అన్నదమ్ములమయిన భావంతో శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగ సందర్భంగా పోలీసు శాఖ తరపున జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోలీస్ బలగాలు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు పైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, పీస్ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గులాబీలో కవిత కలకలం

హైదరాబాద్, మే 28

ఒకే ఒక్క లెటర్..ఆ తర్వాత..మీడియా ముందు స్టేట్‌మెంట్స్. కవిత ఎపిసోడ్ అటు బీఆర్‌ఎస్‌లో ఇటు తెలంగాణ రాజకీయాల్లో టాక్ ఆఫ్‌ది పాలిటిక్స్‌గా మారింది. ఇదే టైమ్‌లో కవిత..బీఆర్‌ఎస్‌లో అసంతృప్తిగా ఉన్నారని..కేటీఆర్, హరీశ్, సంతోష్‌తో ఆమెకు గ్యాప్ ఉందన్న టాక్ బలంగా వినిపించింది. అంతేకాదు ఆమె కారు దిగి సొంత కుంపటి పెట్టుకుంటారన్న ఊహాగానాలు వినిపించాయి. ఇప్పటికీ ఆ వార్తలు చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. కానీ ఇంతలోనే కవిత చిన్న ట్విస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈకార్ రేసులో ఏసీబీ నోటీసులు ఇవ్వడంపై ట్వీట్ చేసి మరోసారి చర్చకు దారి తీశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా కేటీఆర్‌కు నోటీసులిచ్చిందన్నారు. కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు కవిత. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదంటూ ఫైనల్ టచ్ ఇచ్చారామె. కవిత బీఆర్‌ఎస్‌ను వీడుతారని ప్రచార జరుగుతున్న నేపథ్యంలో..ఆమె కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని ఖండించడం హాట్ టాపిక్ అవుతుంది. ఇంతకీ బీఆర్‌ఎస్‌లో ఏం జరుగుతుందన్న దానిపై ఆసక్తిరేపుతోంది. అయితే కవిత లెటర్ ఇష్యూపై కేసీఆర్, కేటీఆర్ ఫాంహౌస్‌లో రెండున్నగంటల పాటు చర్చించినట్లు వార్తలు వచ్చాయి. కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లాల్సిన కవిత అర్ధాంతరంగా ఆగిపోయారు. కేటీఆర్, కేసీఆర్ మీటింగ్ తర్వాత ఆమె తన కాళేశ్వరం పర్యటనను



క్యాన్సల్ చేసుకోవడం చర్చనీయాంశం అయింది. అయితే కేసీఆర్ సూచనతోనే ఆమె తన టూర్ రద్దు చేసుకున్నారా లేక మీడియా ముందుకు మరోసారి రావడం ఇష్టం లేక ఆమెనే ఆగిపోయారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు బీఆర్‌ఎస్ ఎంపీ దామోదర్‌రావు, న్యాయవాది గండ్ర మోహన్ రావు కవితతో భేటీ అయ్యారు. రెండు గంటలకు పైగా ఆమెతో చర్చించారు. అయితే వారిద్దరూ కవితతో ఉన్న సాన్నిహిత్యంతోనే ఆమెను కలిశారు తప్ప..కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం ఈ భేటీలో ఏమీ లేదని తెలుస్తోంది. అయితే కవితతో జరిపిన చర్చల సారాంశాన్ని, ఆమె మనోగతాన్ని మాత్రం ఆ తర్వాత గులాబీబాస్‌కు వారు చేరవేశారని అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం కవిత అంశంపై ఏ మాత్రం తగ్గడం లేదని..ముఖ్యంగా లేఖ ఎలా లీక్ అయిందన్నది గుర్తించే పనిలో ఉన్నారని చర్చ జరుగుతోంది.అ

# జూన్ 2 ఏం జరగబోతోంది...

హైదరాబాద్, మే28

సొంత పార్టీపై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దారెటు అనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. పార్టీతో దూరంగా ఉంటున్న కవిత.. సొంత పార్టీ దిశగా అడుగులు వేస్తున్నారనే ఊహాగానాలు తెలంగాణ రాజకీయవర్గాల్లో జోరందుకుంది. ఇక నిన్న కవితతో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు దామోదరరావుతో పాటు పార్టీ లీగల్ సెల్ ఇంచార్జ్ గండ్ర మోహనరావు సమావేశమయ్యారు. కవితను బుజ్జగించేందుకు ఆ ఇద్దరు నేతలు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలుస్తోంది. మరోవైపు కవిత వ్యవహారంపై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. తండ్రి, కూతురి మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ పెడుతున్నారని.. షర్మిల తరహాలో కవిత కూడా పాదయాత్ర చేస్తారని కామెంట్ చేశారు. ఇదిలా ఉంటే తన యాక్షన్ ప్లాన్ అమలు చేసే దిశగా కవిత అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ జాగృతికి సంబంధించి 11 ఏరియాలకు కోఆర్డినేటర్లను నియమించారు.

# ఆలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి:డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

## -ఆలయ అభివృద్ధి కోసం 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలు మంజూరు





ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), మే 28:శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు, ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగా నంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజలు ఆరాధ్య దైవంగా శ్రీ యోగా నంద లక్ష్మీ నరసింహ స్వామిని కొలుస్తున్నారని తెలిపారు. దేవాలయంలో ఉన్న ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని దేవాలయంలో నిత్య పూజ నిమిత్తం ఉంచి కళ్యాణ సమయంలో తీసుకొని వచ్చేవారని డిప్యూటీ సీఎం తెలిపారు.

శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వాదంతో తన ఎన్నికల ప్రచారం ప్రారంభమయిందని, ఆ స్వామి వారి ఆశీస్సులతో నేడు ఆలయ అభివృద్ధికి 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను ప్రభుత్వంచే మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. దేవాలయంకు కేటాయించిన అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఆలయ పునర్నిర్మాణం పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి కావాలని, స్వామి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ప్రార్థిస్తూ యాగం నిర్వహించామని అన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలుపగా అధికారులు కొంత ఆందోళన చెందినప్పటికీ, దేవుని కార్యక్రమానికి ఆటంకాలు ఆ స్వామి తొలగిస్తారని భావించామని, అదే విధంగా నేడు వర్షం లేదని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

భగవంతుని ఆశీర్వాదంతో ఋతుపవనాలు ముందస్తుగా వచ్చాయని తెలిపారు. ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని అన్నారు .మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా, రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్లు, ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళలకు వడ్డీ లేని రుణాలు, 22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 12 వేల 500 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాలు చేపట్టామని అన్నారు.రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా 12 వేల రూపాయలు పెంచి అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద కూలీలకు 12 వేల రూపాయలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత

## - నేరాల నియంత్రణకే 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం




భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 28:నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల ఆదేశాలతో అదనపు ఎస్పి ఉపేందర్ రెడ్డి పర్యవేక్షణలో బుధవారం రోజు దస్తూరాబాద్ మండలం అకొండపేట గ్రామంలో తెల్లవారుజామున ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అజయ్ ఆధ్వర్యంలో సర్కిల్ అధికారులు సిబ్బంది తో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి గ్రామం లో తనిఖీలు నిర్వహించి తగిన ధ్రువ పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలను మరియు 1 త్రిచక్ర మరియు ఒక కారు వాహనాలను సీజ్ చేయటం జరిగింది.ఈ సందర్భంగా అదనపు ఎస్పి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలతో నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ పోలీసు.. మీ పోలీస్... లో భాగంగా మీ గ్రామం లో ఎవరైనా నిషేధిత గంజాయిని విక్రయించిన లేదా రవాణా చేసిన 8712659599 కి సమాచారము ఇవ్వాలని,అట్టివారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని సూచించారు.ప్రజలు పాత వాహనాలు కొనేటప్పుడు వారి డాక్యుమెంట్స్ పరిశీలించి అమ్మేవారీ పేరుమీదే వాహనం ఉందా లేదా చూసుకోవాలి, మధ్యవర్తుల ద్వారా వాహనాలు కొంటే వెంటనే పాత ఓనర్ చేత కొన్నవారు వారిపేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.ం

ొంగ వాహనాలు అమ్ముతున్నారని తెలిసిన యెడల వెంటనే వారి వివరాలు మరియు వాహన వివరాలు దగ్గరలోని పోలీసులకు తెలపాలి.రైతులకు సూచనలు ఇస్తూ డీలర్ల వద్ద, గుర్తింపు పొందిన దుకాణాల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని,కొనుగోలు చేసే ముందు విత్తన ప్యాకెట్లపై సరైన లేబుల్, ఎక్స్పైరీ డేట్, తయారీ డేట్ ఉంటాయని అదేవిధంగా వ్యాపారి వద్ద నుండి బిల్లును తీసుకోవాల్సిందిగా సూచించారు. రైతులెవ్వరు కూడా లూస్ విత్తనాలను కొనకుండా ఉండాలని తెలిపారు. ఎలాంటి అనుమానం ఉన్న జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి వివరాలు వెంటనే పోలీసు వారికి ఇవ్వాలి, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును.గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి అన్నారు. కాలనీ లో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ. కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అజయ్, దస్తూరాబాద్ ఎస్ఐ సాయి కుమార్, కడెం ఎస్ఐ కృష్ణ సాగర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# బదిలీపై వెళ్లిన తాహసిల్దార్ కు ప్రెస్ క్లబ్ -1 ఆధ్వర్యంలో ఘన సన్మానం

## -విశేషమైన సేవలు అందించిన తాసిల్దార్ కు ప్రెస్ క్లబ్ సభ్యుల ప్రశంశలు

ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), మే 28:ఇటీవలే బదిలీపై వెళ్లిన తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ పూర్ణిమ



దంపతులకి మండల కాంగ్రెస్ కమిటీ,మండల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సాయిబాబా ఫంక్షన్ హాల్ మందిరంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు,ఈ సందర్భంగా బోనకల్ ప్రెస్ క్లబ్-1 అధ్యక్షుడు దేగల వేలాద్రి ఆధ్వర్యంలో తాసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్-పూర్ణిమ దంపతులను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు,ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి,అధ్యక్షులు శ్రీనివాస్ రాథోడ్లు మాట్లాడుతూ మండలంలో 1 సంవత్సరం,9నెలల కాలంలో పున్నం చందర్ విశేషమైన సేవలు అందించారని,సామాన్యుల అధికారిగా తాసిల్దార్ పేరు పొందారని అన్నారు,వారు బదిలీపై వెళ్లిన చోట కూడా మంచి సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

భవిష్యత్తులో పున్నం చందర్ మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్,ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారులు యంగళ అమర్,ఉపాధ్యక్షులు మందా సత్యానంద, ట్రెజరర్ షేక్ బాజే షరీఫ్,వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బడే, సభ్యులు షేక్ పెంటూ సాహెబ్, కొణతాలపల్లి నాగేశ్వరారావు ,సుగ్గల బ్రహ్మం,మాగి ముకేష్ తదితరులు ఉన్నారు.

# ఫలించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కృషి,పటాన్చెరు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం 200 కోట్ల రూపాయల నిధుల మంజూరు:ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు, భారత శక్తి ప్రతినిధిమే 28:మినీ ఇండియాగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం 200 కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను పటాన్చెరులో ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని తెలిపారు.

పాఠశాల ఏర్పాటు కోసం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 993 లో 25 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు కోసం 200 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేసిందని తెలిపారు.

ఆధునిక వసతులు అత్యాధునిక ప్రమాణాలతో ఏర్పాటయ్యే రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం హర్షణీయం

భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 28: విద్యా అభివృద్ధికి నిత్యం పాటుపడుతున్న ప్రజా ప్రభుత్వం, ఖానాపూర్ నియోజకవర్గానికి 200వందల కోట్ల రూపాయల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడంతో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐబీ చౌక్ వద్ద గల భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి గారి,జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క గారి ,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గారి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సబ్బండ వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ...యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పడం జరిగిందని అన్నారు.ఈ ప్రాంతంలోని విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం హర్షణీయమన్నారు.ఖానాపూర్ నియోజకవర్గ



ప్రజల తరుపున సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టిఏ సభ్యులు దుట రాజేశ్వర్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోత్ జైవంత్ రావ్, డైరెక్టర్ రాధ బాయ్ , ఉట్నూర్ మండల అధ్యక్షుడు కయ్యూమ్,నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు అరకిల్ల పరమేశ్వర రావ్, బ్లాక్ కాంగ్రెస్ ఇక్బాల్, మహిళా కాంగ్రెస్ నాయకులు భాగ్యలక్ష్మి, నిలబాయ్, కాంగ్రెస్ నాయకులు దేవనందం , ముబిన్,అర్షాద్ , ఇమ్రాన్,సందీప్ రెడ్డి, అహ్మద్,లింగన్న, శాలు, సలీం.తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విలేకరులు ఉన్నారు తస్మాత్ జాగ్రత్త

## -కాపీ పేస్ట్ చేసి వసూలుకు పాల్పడుతున్న నకిలీ విలేకరు బాబాలు.









## భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో షేక్ అహ్మద్, మే 28:నకిలీ విలేకరుల పై డి పి ఆర్ ఓ కు పిర్యాదు చేస్తున్న నిర్మల్ జర్నలిస్టులు

ಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯಯ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ లో రాజ్యమేలుతున్న నకిలీ జర్నలిజం!

అక్షరం ముక్కరాని వారికీ 'రిపోర్టర్' ట్యాగ్ %-% విలువలతో కూడిన జర్నలిజం జాడ ఎక్కడ?

ఇప్పటి జర్నలిజం రంగం వింత దశకు చేరింది. పదవ తరగతి కూడా పూర్తిచేయని, విలక్షణంగా అక్షరమాత్రం తెలియని కొందరు వ్యక్తులు 'రిపోర్టర్' అనిపించుకుంటూ, విలేకరితనాన్ని నాసిరకంగా మార్చేస్తున్నారు. అసలు సమస్యలపై రాయడం దేవుడెరుగు, ఒక మ్యాటర్ కరెక్ట్‌గా రాయలేని స్థితిలో ఉన్నవారు ఇప్పటికీ పులిస్టాప్లు కూడా పెట్టలేరు. అయినా వారు జర్నలిస్టులుగా వ్యవహరిస్తున్నారు.ఒక్క పేపర్లో ఏదో ఒక చిన్న న్యూస్ వచ్చిందని పట్టుకొని, స్థానిక అధికారుల దగ్గర లేదా వ్యాపారులపై వత్తిడి తేవడం, కొన్ని సందర్భాల్లో వసూళ్లకు పాల్పడటం వంటి దురాచారాలు వెలుగులోకి వస్తున్నాయి. నిజంగా కాలాన్ని సాక్షిగా తీసుకొని ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాల్సిన పాత్ర కలం, ఇప్పుడు కొందరి చేతుల్లో నష్టానికి గురవుతోంది.అంతేగాక, నకిలీ ఐడీ కార్డులు, ఫేక్ న్యూస్ పోర్టల్స్, వాట్సాప్ ఫార్వార్డులతోనే మీడియా ప్రతినిధులమని డొక్కాలు వేసే వారి సంఖ్య పెరిగిపోతోంది. వీరి వలన నిజమైన విలువలతో కూడిన జర్నలిజానికి పెద్ద దెబ్బ తగులుతోంది. ప్రజల్లో మీడియాపై నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది.

నకిలీలను అరికట్టే చర్యలు ఏవీ?

నిజమైన విలేకరులను కాపాడేందుకు, నకిలీ జర్నలిస్టులను అరికట్టేందుకు ప్రభుత్వం, మీడియా హౌసులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా సమాచార శాఖలు మీడియా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలి.ఐడీ కార్డుల వెనుక నకిలీ డిజైన్‌లను గుర్తించి, అనధికారిక వ్యక్తులు జర్నలిస్టులుగా వ్యవహరించకుండా కఠిన చట్టాలు తీసుకురావాలి. అలాగే, స్థానిక జర్నలిస్టు సంఘాలు కూడా తమ సభ్యులను గుర్తించడానికి సిస్టమాటిక్ వెరిఫికేషన్ మెకానిజాన్ని ఏర్పాటు చేయాలి.జర్నలిజం అనేది నమ్మకంతో కూడిన ప్రజాసేవ. అది వృత్తిగా స్వీకరించిన వారు బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నకిలీల దురాగతాలకు చెక్ పెట్టే సమయం ఆసన్నమైంది.ప్రభుత్వ ఆఫీస్ అధికారులు గాని,రాజకీయ నాయకులు గాని జర జాగ్రత్తగా ఆలోచించి పరిశీలించి మీకు తెలియని విలేకరులు ఎవరైన మిమ్మల్ని బెదిరించినా లేదా ఇంటర్వ్యూ అడిగినా ప్రభుత్వం జారీ చేసిన అక్రిడేషన్ కార్డులను కాని సంస్థ గుర్తింపు కార్డులు అడగండి .యూట్యూబ్ చానల్ పేరుతో బెదిరింపులు,అక్రమ వసూళ్లు కు పాల్పడుతుంటే దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వండి.సెల్ పోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్ట్ సెల్ పోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్ట్ కాదు వారు ఓన్లీ షోషల్ మీడియా లో పెట్టుకొనేందుకే ఉపయెగపడతారు.ఈ మధ్య కాలంలో జర్నలిస్టుల ముసుగులో పుట్టగొడుగుల్లా యూట్యూబ్ చానల్స్ పెట్టి జర్నలిస్టులా చలామణి అవుతున్నారు.వీరి ఆగడాలతో నిజమైన జర్నలిస్టుల కు కూడా సమాజంలో చెడ్డపేరు వస్తుంది కనుక నిజమైన జర్నలిస్టులందరూ ఏకంకండి .మనతోపాటు మీడియా సమావేశాలకు యూట్యూబ్ చానల్ పేరుతో చలామణి అవుతున్న నకిలీ విలేకరులు వస్తే ఆ సమావేశాలను బాయ్ కాట్ చేయండి.

## మాజీ ఎమ్మెల్యే బానోతు మదనలాల్ కి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర





ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), మే 28:వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదనలాల్ అనారోగ్యంతో మృతి చెందారు.ఖమ్మం కవిరాజ్ నగర్ వారి నివాసం నందు మదనలాల్ బౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.వీరితో మాజీ ఎమ్మెల్యే వెచ్చా నాగేశ్వరరావు,మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు,మాజీ జడ్పి చైర్మన్ లింగాల కమలరాజు,మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ,టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాఘచంద్రారెడ్డి,నగర అధ్యక్షుడు నాగరాజు,ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ,మండల అధ్యక్షుడు వీరునాయక్ కార్పొరేటర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవకు సిద్ధమైన ఖమ్మం మహిళా మార్ట్:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### -సీక్వెల్ రోడ్డులోని మహిళా మార్ట్ ప్రారంభ ఏర్పాటు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





ఖమ్మం ప్రతినిధి (భారత శక్తి న్యూస్ ), మే 28:మహిళా సంఘాలకు అర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఖమ్మం మహిళా మార్ట్ బుధవారం మంత్రులచే అధికారంగా ప్రారంభోత్సవంకు సంసిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ సీక్వెల్ రోడ్డులోని ఖమ్మం మహిళా మార్ట్ ను సందర్శించి మంత్రులచే ప్రారంభోత్సవ ఏర్పాటు పనులను పరిశీలించారు. మార్ట్ లో ఏర్పాటు చేయు ఆర్గానిక్ ఉత్పత్తులు, మహిళాలచే చేసిన తినుబండారాలు, బొమ్మలు, ఎక్విప్మెంట్ లపై, ప్రొడక్ట్స్, స్వయం తయారీ ఇతర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఖమ్మం బ్రాండ్ మార్క్ ను పరిశీలించారు. మార్ట్ ఆకర్షణీయంగా ఉండే విధంగా కంప్యూటరైజ్ బిల్లు, లోగోల నిర్వహణ పట్ల అధికారులను కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళా మార్ట్ నిర్వహణపై మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించామని అన్నారు. మహిళా మార్ట్ ను లాభాల బాటలో నడిపేలా మహిళా సంఘాలకు ప్రత్యేక కార్యచరణ రూపొంచామని చెప్పారు. మహిళా మార్ట్ లో ఏ.సి. ఏర్పాటు ద్వారా ప్రతి నెలా కరెంట్ బిల్లు అధికంగా వస్తుందని, మహిళా మార్ట్ ప్రారంభించిన తర్వాత నిర్వహణ బాధ్యత స్వశక్తి మహిళా సంఘాలపై మాత్రమే ఉంటుందని, వీటిని పరిశీలించి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళా మార్ట్ ముందు భాగంలో ఉన్న ఓపెన్ స్పేస్ లో రిటైల్ బిజినెస్ క్రింద ఏర్పాటు చేస్తున్న వాటిని, వర్షం వచ్చిన కూడా ఇబ్బంది లేకుండా నీడలో కూర్చొనే విధంగా సీటింగ్ అరేంజ్మెంట్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.మహిళా మార్ట్ నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని, సామాన్లు అందంగా పొందికగా అమర్చాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మహిళా మార్ట్ లో పెట్టే వస్తువుల స్టాక్ నిల్వలు పకడ్బందీగా భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పీఆర్ ఈఈ మహేష్ బాబు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## -అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

### -స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

### -హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

### -పోలీసులకు రివార్డులు అందించిన డీఎస్పీ రవిందర్ రెడ్డి







మణుగూరు,మే 28 (భారతశక్తి): పట్టణంలోని జ్యూయలరీ షాపులో బంగారు ఆభరణాలను దొంగిలించిన అంతర్రాష్ట్ర దొంగను మూడు రోజుల్లో మణుగూరు పోలీసులు ఛేదించినందుకు పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మణుగూరు సబ్ డివిజనల్ కార్యాలయంలో డిఎస్పీ రవీందర్ రెడ్డి విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ నెల 23.05.25 మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో మణుగూరు ప్రధాన రహదారిలో గల శ్రీవారి జ్యూయలరీ షాపులో ఒక్క మహిళ మాత్రమే ఉండడం గమనించిన ఒక వ్యక్తి మాస్క్ వేసుకొని షాపు లోపలికి వెల్లి అందులో పనిచేస్తున్న మహిళను మాటల్లో పెట్టి బంగారు ఆభరణాలు సుమారు132 గ్రాముల గల బాక్స్ ను దొంగిలించడం జరిగిందన్నారు.

షాపు యజమాని అయిన దేవతా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించమన్నారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఇంచార్జి ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్, సిసిఎస్ ఎస్సై రామారావులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం సీసీటీవీ ఫుటేజీ, లాడ్జిలు వెతికమన్నారు. ఈ క్రమంలో మంగళవారం 27.05.25న ఎస్సై మేడ ప్రసాద్ తన సిబ్బంది రామారావు, కొర్ర బాలు లతో హనుమాన్ టెంపుల్ దగ్గర్లో వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి పోలీసు వారిని చూసి భయపడి పారిపోవుటకు ప్రయత్నించగా అతనిని వెంబడించి, పట్టుకొని విచారించగా తన పేరు గొర్రెల సత్యనారాయణ గ్రామం ఆకివీడు, భీమవరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ కు చెందిన వాడని చెప్పి తాను మణుగూరు శ్రీవారి జ్యూయలరీ షాప్ లో చేసిన దొంగతనం ఒప్పుకొని అందులో నుండి తీసిన బంగారు నగలు చైన్లు -6 నల్లపూసల గొలుసు-1 బేబీ రింగ్స్ 5 సుమారు 132 గ్రాముల బరువుగలవి తీసి చూపించాడన్నారు. అంతేగాక తాను అంతకుముందు వరంగల్ లోని సాయి గణేష్ జ్యూయలరీ షాపులో దొంగతనం చేసిన చిన్న చిన్న బంగారు ఆభరణాలు చెవి కమ్మలు 20 జతలు సుమారు 30 గ్రాములు ఉన్నట్లు ఒప్పుకున్నాడన్నారు.

నిందితుడి దగ్గర నుండి మొత్తం 16.2 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.16 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. అతనిపై సుమారు 35 పైగా రెండు రాష్ట్రాలలో బంగారు షాపులలో దొంగతనం కేసులు నమోదు అయినట్లు తెలిపారు. మణుగూరు, వరంగల్ తో పాటు తిరుపతి, కర్నూల్లో కూడా దొంగతనాలు చేసినట్టు నేరాలు ఒప్పుకోవడం వలన బుధవారం నిందితున్ని మణుగూరు కోర్టులో హాజరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కేసు ఛేదించిన ఈ బయ్యారం సిఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్, సిసిఎస్ ఎస్సై రామారావు, మణుగూరు పోలీసు సిబ్బంది రామారావు, బాలు సీసీఎస్ సిబ్బంది వెంకట్ నారాయణ, విజయ్ లను మణుగూరు డిఎస్పి అభినందించి రివార్డులు అందించారు. ఇటీవల కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున ఎవరైనా ఊరు వెళ్తున్నప్పుడు పోలీసులకు తెలియజేయాలని డిఎస్పీ సూచించారు. అదేవిధంగా ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలు లేకుండా చూసుకోవాలన్నారు.

ప్రజలందరూ వారి ఏరియాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోని దొంగతనాలకు తవ్వివ్వకుండా చూసుకోవాలని ప్రజలకు, వ్యాపారస్తులకు డిఎస్పీ సూచించారు.

## రాత్రి పూట కడ్తాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



భారత శక్తి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 28:నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధాన్యపు సంచుల లోడింగ్, లారీల తరలింపు ప్రక్రియ సజావుగా జరుగుతుందో లేదో పరిశీలించారు.

రైతులతో మాట్లాడుతూ, ప్రత్యేక సంబంధించిన వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాదాపుగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, ముందస్తు వర్షాల వల్ల వరి ధాన్యం అమ్మకంలో రైతులకు ఇబ్బందులు కలుగుతుందన్నారు. వరి ధాన్యం కొలుగోలుపై రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని వారికి ధైర్యం చెప్పారు.

అధికారులంతా నిరంతరం వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

### రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్ తయారు చేయాలి

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఇసుక కొరత లేదు

### ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనాలి

### వర్షాల దృశ్య అప్రమత్తంగా ఉండాలి

### టెలికాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 28:జిల్లాలో వివిధ సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై అదనపు కలెక్టర్లు, గృహ నిర్మాణ, నీటిపారుదల, మున్సిపల్, మండల అభివృద్ధి అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని, ఈ పథకం అర్హత గల వారిని ఎంపిక చేయాలని అధికారులు ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2వ తేదీన రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసే నేపథ్యంలో జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా, నిజాయితీగా నిర్వహించాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల లిస్ట్ ఫైనల్ చేసి బ్యాంకర్లకు పంపిణీ చేసి, బ్యాంకర్ల నుంచి అధికారులు లిస్ట్ తీసుకోవాలన్నారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై మాట్లాడుతూ అర్హత గల పేదలందరికీ రెండో విడత ఇందిరమ్మ ఇల్లు అందించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఎలాంటి ఇసుక కొరత లేదని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుకనందిస్తున్నామని తెలిపారు.రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల జాబితా త్వరితగతిన అందించాలని అధికారుల ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణలు ఎంతవరకు వచ్చాయి ? రెండో విడతలు ఎంతమంది అర్హత సాధించారు. జిల్లావ్యాప్తంగా ఇంకెన్ని అవసరమవుతాయి? అని జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగానే ఋతుపవనాలు రావడం వల్ల వర్షాలతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనాలని, వర్షాల వల్ల త్రాగునీరు విద్యుత్ లాంటి సమస్యలు రాకుండా ముందే చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్లో రెవిన్యూ,గృహ నిర్మాణ, నీటిపారుదల, మున్సిపల్, మండల అభివృద్ధి అధికారులు, పాల్గొన్నారు.

## ఐ ఎన్ టి యు సి సంఘాన్ని కాంగ్రెస్ నాయకులు విమర్శించడం పై కార్మిక సంఘం ఆగ్రహం.



మందమర్రి టౌన్, మే 28(భారత శక్తి): మందమర్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మే 26 ప్రెస్ మీట్ లో ఐఎన్టియుసి సంఘాన్ని విమర్శించడంపై బుధవారం ఐ ఎన్ టి యు సి నాయకులు ధ్వజమెత్తారు. మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు సమ్మయ్య దేవి భూమయ్య నరేందర్ లు మాట్లాడుతూ ఐ ఎన్ టి యు సి కార్మిక సంఘం కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘమని కాంగ్రెస్ పార్టీ వేరు ఐఎన్టీయూసీ సంఘం వేరు కాదని అన్నారు. కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎంపీ లతో ప్రాబల్యం పెంచుకోవడానికి ఐఎన్టీయూ సంఘాన్ని సంఘ నాయకుడు జనక్ ప్రసాద్ ను విమర్శించడం తగదని అహర్నిశలు కార్మిక సంక్షేమం కోసం హక్కుల కోసం పోరాడుతున్న ఐ ఎన్ టి వి సి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో సత్సంబంధాలు కలిగి ఉండటానికి ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంత లాభం కోసం రాజకీయ లబ్దికోసం ప్రెస్ మీట్ లు పెట్టి ఐఎన్టీయూసీ కార్మిక సంఘాన్ని సంఘ నాయకులను విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ ఐఎన్టీయూసీ కార్మిక సంఘం ఒకటేనని గుర్తించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి సంఘ నాయకులు కాంపల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, రామ్ శెట్టి నరేందర్, పానుగంటి వెంకటస్వామి, డి శంకరరావు, సంఘపుచ్చయ్య, జగన్నాథ చారి, జక్కుల ఓదెలు, దార బిక్షపతి, శనిగారపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కేశనపల్లి ఉచిత వైద్య శిబిరానికి బారి స్పందన

మంథని

ముత్తారం మండలంలోని కేశనపల్లి గ్రామంలో రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కరీంనగర్ లోని సన్ రైస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు,ముత్తారం మండల మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ క్యాంపులో కేశనపల్లి గ్రామస్తులు 500కు పైగా పాల్గొని ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగా భారీ స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బక్కతట్ల వినీత్,గ్రామ శాఖ అధ్యక్షులు పెగడ కుమార్,గ్రామ యూత్ అధ్యక్షులు నవీన్,సన్ రైస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రక్షిత,క్యాంప్ మేనేజర్ రాజేందర్,కోఆర్డినేటర్ సతీష్,మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తిరుపతి మరియు సన్రైజ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# 85 శాతం మంది ఉద్యోగులు అతిగా పని చేస్తున్నట్లు భావిస్తున్నారు: సత్యనాదెళ్ల

: ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్‌లో నెలకొన్న సమస్యపై మాట్లాడారు ఆ సంస్థ సీఈఓ సీఈఓ సత్య నాదెళ్ల మైక్రోసాఫ్ట్ ఉత్పాదకత సమస్యలతో పెనుగులాడుతోందని వ్యాఖ్యానించారు. లింక్డిన్ సహ వ్యవస్థాపకుడు రీడ్ హాఫ్మన్ (తో ముచ్చటించిన ఆయన మేనేజర్లు, ఉద్యోగులు అందించిన నివేదికపై మాట్లాడారు.



కొవిడ్ మహమ్మారి విజృంభణ తర్వాత పని ప్రదేశాల్లో ఉన్న విధివిధానాలు, రిమోట్ వర్క్ సవాళ్లతో ఉత్పాదక సమస్యలు వెంటాడుతున్నాయని సత్య నాదెళ్ల వెల్లడించారు. " 85 శాతం మంది ఉద్యోగులు సరిగా పనిచేయడం లేదని మేనేజర్లు భావిస్తున్నారు. ఆ సమయంలో 85శాతం మంది ఉద్యోగులు తాము ఎక్కువగా కష్టపడినట్లు చెబుతున్నారు. ఇలాంటి డేటా మా వద్దకు వచ్చింది. దీంతో ఒకే విషయాన్ని ఇరు కోణాల్లో ఎలా చూడాలనే విషయంపై చర్చిస్తున్నాం. వీరి నుంచి వచ్చిన డేటాను ఉపయోగించి ఈ సమస్యపై దృష్టిసారిస్తాం" అని నాదెళ్ల అన్నారు.

మైక్రోసాఫ్ట్.. మరో 40 ఎకరాలు

ఈ సమస్యను పరిష్కరించడానికి ఓ మార్గం ఉందన్నారు. లక్ష్యాలను ఎలా నిర్వర్తించాలన్న విషయాన్ని లీడర్లు అర్థం చేసుకోవాలన్నారు. "నాయకులుగా ఉంటూ లక్ష్యాన్ని చేరుకొనేందుకు పాటించాల్సిన విధివిధానాల గురించి మనం అర్థం చేసుకోవాలి. దానికి సంబంధించిన వివరాలను తెలియజేయాలి. వాటిని అమలుచేసి చూడాలి. ఒకవేళ అమలుచేస్తున్న విధానాలు వ్యర్థం అనుకుంటే కొత్త నియమాలు తీసుకురావాలి" అని ఆయన అన్నారు. ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఇండస్ట్రీ లీడర్లకు సూచించారు. ప్రస్తుత ప్రపంచానికి ఉన్నతమైన నాయకులు, శక్తిమంతమైన లీడర్ల అవసరం ఉందని తాను భావిస్తున్నట్లు నాదెళ్ల తెలిపారు. ఎలాంటి పరిస్థితిలోనైనా స్పష్టతతో ముందుకెళ్లి సమస్యలను పరిష్కరించగల నాయకులు కావాలన్నారు.

# నాన్ స్టాప్ ప్రయాణానికే మొగ్గు

దేశం నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికుల ధోరణిలో కొవిడ్ తర్వాత ఎన్నో మార్పులు వచ్చాయి. గతంలో ఒకటి, రెండు స్టాపులు ఆగి వెళ్లేందుకు ఇబ్బంది పడేవారు కాదు. సాధారణంగా దుబాయ్, అబుదాబి, ఫ్రాంక్‌ఫర్ట్ వంటి హబ్ ఎయిర్‌పోర్ట్స్‌లో ఆగి, తమ గమ్యానికి చేరేవారు. ఇప్పుడు నేరుగా (నాన్ స్టాప్)గమ్య స్థానానికి చేర్చే విమానాలను ఎక్కేందుకు ఇష్టపడుతున్నారు. అంతర్జాతీయ విమానయాన సేవలను అందిస్తున్న టాటాలకు చెందిన ఎయిరిండియా, ఇండిగోతో పాటు ఇతర అంతర్జాతీయ విమాన సంస్థల విషయంలోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. యూకేకు చెందిన విమాన కన్సల్టెన్సీ సంస్థ ఓఏజీ ఈ విషయాన్ని వెల్లడించింది. 2019 ముందు పరిస్థితులతో 2023ను పోల్చి చూసి, ఈ నివేదిక రూపొందించింది.



నేరుగా గమ్య స్థానానికి చేరుకున్న వారు 3.7 కోట్లు

2019 కంటే 20 లక్షలు అధికం.

మధ్యలో ఆగి వెళ్లే ప్రయాణికుల సంఖ్య 2.7 కోట్లుగా ఉంది.

2019తో పోలిస్తే 25 లక్షలు తగ్గింది.

10 లక్షల మంది ప్రయాణికులు దిల్లీలో ఆగి న్యూయార్క్, కాఠ్‌మాండు లాంటి ప్రాంతాలకు వెళ్లారు.

వియత్నాం, ఇండోనేషియా లాంటి దేశాలకు నేరుగా విమానాలు పెరిగాయి..

మధ్యప్రాచ్య దేశాల్లోని హబ్‌లకు ప్రయాణికుల సంఖ్య 2019తో పోలిస్తే 2023 నాటికి 10 లక్షల వరకు తగ్గింది. ఇతర ఇంటర్నేషనల్ హబ్‌లలో 28 లక్షల వరకు దిగి వచ్చింది.

నాలుగేళ్ల కాలంలో భారతీయ విమానయాన సంస్థలు 52 కొత్త అంతర్జాతీయ మార్గాల్లో విమాన సేవలను ప్రారంభించాయి.

# మైక్రోసాఫ్ట్.. మరో 40 ఎకరాలు

హైదరాబాద్: అమెరికా సాంకేతిక దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్, హైదరాబాద్‌లో డేటా సెంటర్లను పెద్దఎత్తున ఏర్పాటు చేయడం కోసం ఇంకా స్థల సేకరణ యత్నాలను కొనసాగిస్తోంది. ఇప్పటికే షాద్‌నగర్ సమీపంలోని కొత్తూరు, చందన్‌వెల్లి, ఎలికట్ట గ్రామాల వద్ద సంస్థ, స్థల సేకరణ చేసిన విషయం విదితమే. ఎలికట్టలో 22 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, డేటా సెంటర్ నిర్మాణాన్ని మొదలు పెట్టింది. చందన్‌వెల్లి, కొత్తూరు గ్రామాల పరిధిలో నూతన డేటా కేంద్రాలు ఏర్పాటు చేయడం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని స్థలాన్ని సేకరించింది. ఈ కేంద్రాలను దశల వారీగా పూర్తి చేయాలనే ఆలోచన మైక్రోసాఫ్ట్‌కు ఉంది. దీనికి సంబంధించిన పెట్టుబడుల ప్రణాళికను ఇంతకు ముందే ప్రకటించింది. ఈ డేటా కేంద్రాల నిర్మాణంపై వచ్చే 15 ఏళ్లలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ వెల్లడించిన విషయం విదితమే.



1-2 నెలల్లో పూర్తి

ఇంతటితో ఆగకుండా భవిష్యత్తు అవసరాల కోసం ఇంకా స్థలాన్ని సేకరించే యత్నాలను మైక్రోసాఫ్ట్ చేపట్టింది. కొత్తూరు- షాద్‌నగర్ ప్రాంతంలో మరో 40 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసేందుకు మైక్రోసాఫ్ట్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. దీనిపై సంప్రదింపులు సాగుతున్నాయని, వచ్చే నెల- రెండు నెలల వ్యవధిలో ఈ కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. దీన్ని బట్టి హైదరాబాద్‌లో డేటా సెంటర్ల విభాగంలో భారీగా విస్తరించాలనే ఆలోచన మైక్రోసాఫ్ట్‌కు ఉన్నట్లు స్పష్టమవుతోంది. స్థానికంగా ఐటీ పరిశ్రమకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

అధిక పెట్టుబడులు ఇక్కడకే

మనదేశంలో డేటా కేంద్రాల విభాగంలో వచ్చే దశాబ్దకాలం పాటు పెద్దఎత్తున విస్తరణ అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వ్యాపార సంస్థల నుంచి, వ్యక్తిగత అవసరాల వరకు డేటాను అత్యధికంగా వినియోగిస్తుండడమే ఇందుకు కారణం. ఈ డిమాండ్ వల్లే అధిక సామర్థ్యం గల డేటా కేంద్రాలను నిర్మించాల్సి వస్తోంది. అందుకే దేశీయ సంస్థలతో పాటు విదేశీ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటివి ఈ రంగంపై దృష్టి సారించాయి. మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ మనదేశంలోని వివిధ నగరాల్లో డేటా సెంటర్లపై భారీ పెట్టుబడులు పెడుతోంది. ఇందులో సింహభాగం హైదరాబాద్‌కు కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు 70 కోట్లు చేతులు మారాయ్

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ షేరు అరంగేట్రంలో దుమ్మురేపింది. ఇష్యూ ధర రూ.70తో పోలిస్తే బీఎస్ఈలో షేరు 114.28% లాభంతో రూ.150 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. అనంతరం 135.70% దూసుకెళ్లి, రూ.164.99 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకి, అక్కడే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,37,406.09 కోట్లుగా నమోదైంది. బీఎస్ఈలో 608.99 లక్షలు (విలువ రూ.953 కోట్లు), ఎన్ఎస్ఈలో 6,367.27 లక్షల షేర్లు (విలువ రూ.9,983 కోట్లు) చేతులు మారాయి. రెండు ఎక్స్ఛేంజీల్లో కలిపి రూ.10,936 కోట్ల విలువైన లావాదేవీలు ఈ షేరుపై జరిగాయి.




మదుపరికి రూ.15,000లపై రూ.20,000 లాభం

ఒక లాట్ (214 షేర్ల)పై రూ.14,980 పెట్టుబడి పెట్టిన మదుపరికి, నమోదైన తొలిరోజే రూ.20,330 లాభం వచ్చింది. మార్కెట్ విలువ పరంగా దేశంలో అత్యంత విలువైన గృహరుణ సంస్థగా బజాజ్ హౌసింగ్ (రూ.1.37 లక్షల కోట్లు) అవతరించింది. తదుపరి స్థానాల్లో హడ్కో (రూ.49,476.96 కోట్లు), ఎల్ఐసీ హౌసింగ్ (రూ.37,434.54 కోట్లు), పీఎన్‌బీ హౌసింగ్ (రూ.27,581.41 కోట్లు), ఆధార్ హౌసింగ్ (రూ.20,045.16 కోట్లు) ఉన్నాయి.

# బోనస్ షేర్లు.. త్వరగా అందుబాటులోకి

బోనస్ షేర్ల విషయంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సోమవారం తాజా ఆదేశాలు జారీ చేసింది. రికార్డు తేదీ తర్వాత రెండు రోజుల (టిం2)కు వాటిని ట్రేడింగ్‌కు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 1 నుంచి జారీ అయ్యే అన్ని బోనస్ షేర్లకు ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం రికార్డు తేదీ నుంచి రెండు వారాల తర్వాతే బోనస్ షేర్ల ట్రేడింగ్‌కు అనుమతి ఉంది.



**బోనస్ ఇష్యూకు అర్హత ఉన్న వాటాదార్లను నిర్ణయించేందుకు కంపెనీ నిర్ణయించే కటాఫ్ తేదీని రికార్డు తేదీ అంటారు. ఆ రోజు వరకు షేర్లు ఉన్నవారికే బోనస్ షేర్లు లభిస్తాయి. ఆ తేదీని టి అనుకుంటే... టిం2 రోజుల్లో ట్రేడింగ్‌కు అనుమతి ఉంటుందని సెబీ పేర్కొంది.**

రికార్డు తేదీ అంటే

బోనస్ ఇష్యూకు అర్హత ఉన్న వాటాదార్లను నిర్ణయించేందుకు కంపెనీ నిర్ణయించే కటాఫ్ తేదీని రికార్డు తేదీ అంటారు. ఆ రోజు వరకు షేర్లు ఉన్నవారికే బోనస్ షేర్లు లభిస్తాయి. ఆ తేదీని టి అనుకుంటే... టిం2 రోజుల్లో ట్రేడింగ్‌కు అనుమతి ఉంటుందని సెబీ పేర్కొంది.

అమలు చేయకుంటే

గడువు లోగా బోనస్ ప్రక్రియను అమలు చేయని పక్షంలో నిబంధనల ప్రకారం.. కంపెనీలు జరిమానా కట్టాల్సి వస్తుంది.

ఇదీ ఆ ప్రక్రియ..

దరఖాస్తు: బోనస్ ఇష్యూకు అనుమతినిస్తూ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్న 5 పనిదినాల్లోగా, సూత్రప్రాయ అంగీకారం కోరుతూ స్టాక్ ఎక్స్ఛేంజీకి కంపెనీ దరఖాస్తు చేసుకోవాలి.

కేటాయింపుల తేదీ: ప్రతిపాదిత బోనస్ ఇష్యూకు రికార్డు తేదీని నిర్ణయిస్తూ స్టాక్ ఎక్స్ఛేంజీలకు చెప్పిన మరుసటి పనిదినం(టిం1) రోజే కేటాయింపులకు తేదీని నిర్ణయించాలి.

షేర్ల సంఖ్య: రికార్డు తేదీ సమాచారం అందాక, స్టాక్ ఎక్స్ఛేంజీలు సదరు తేదీని అంగీకరిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలి. అందులో బోనస్ ఇష్యూ పరిశీలనకున్న షేర్ల సంఖ్యను పేర్కొనాలి. కేటాయింపుల తేదీ(టిం1)ని సైతం అందులో తెలపాలి.

డిపాజిటరీల్లో షేర్ల జమ: ఎక్స్ఛేంజ్ నోటిఫికేషన్ జారీ చేశాక, కంపెనీలు బోనస్ షేర్లను డిపాజిటరీ వ్యవస్థలో రికార్డు తేదీ మరుసటి పనిదినాన జమ చేస్తున్నట్లు సంబంధిత డిపాజిటరీలకు దరఖాస్తు చేసుకోవాలి.

తేదీల ప్రకటన: బోనస్ షేర్ల జమకు ముందే, సంబంధిత తేదీలను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అప్‌డేట్ చేయాలి. డిస్టింక్టివ్ నంబర్(డీఎన్) శ్రేణిని డిపాజిటరీ డీఎన్ డేటా బేస్‌లో కంపెనీలు అప్‌లోడ్ చేయాలి.

చివరగా: కేటాయింపుల జరిగిన తదుపరి రోజున(టిం2) ట్రేడింగ్‌కు వీలుగా బోనస్ షేర్లను కేటాయించాలి.

# అప్రమత్తంగా సూచీలు.. లాభాలతో ప్రారంభమై, స్వల్ప నష్టాల్లోకి..

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు (సవరించే అవకాశం ఉందన్న అంచనాలతో మార్కెట్లు అప్రమత్తత పాటిస్తున్నాయి. 9:15 గంటల సమయంలో స్వల్ప లాభంతో మొదలైన సూచీలు ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 53.82 పాయింట్లు కుంగి 82,934 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 8 పాయింట్లు తగ్గి 25,375 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.84 వద్ద ప్రారంభమైంది.



సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, టీసీఎస్, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎంఅండ్ఎం, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. హెచ్‌యూఎల్, నెస్లే, ఏషియన్ పెయింట్స్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, టైటన్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, కొటక్‌బ్యాంక్, ఐటీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిలయన్స్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.10 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,606.60 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా-పసిఫిక్ సూచీలు మిశ్రమంగా ఉన్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.1,653 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. అదే సమయంలో దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.754 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.

# కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తా: రిషభ్ పంత్

భారతజట్టు త్వరలోనే ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో తాను కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తానని పంత్ అంటున్నాడు. చిన్న విరామం తర్వాత తిరిగి ఇంగ్లండ్‌తో అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం సన్నద్ధమవుతా అని వివరిస్తున్నాడు. ఇంగ్లండ్ టూర్ నేపథ్యంలో ఇటీవలే భారత జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున పెద్దగా రాణించని పంత్ మంగళవారం ఆర్సీబీతో (జరిగిన మ్యాచ్‌లో సెంచరీ బాదాడు. 61 బంతుల్లో 118 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో ఇంగ్లండ్ పర్యటనకు ముందు తిరిగి లయ అందుకోవడం టీమ్‌ఇండియాకు శుభపరిణామం అని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ఐపీఎల్ సీజన్ త్వరలో ముగియబోతోంది. తర్వాత టీమ్‌ఇండియా, ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో నేను కొద్ది రోజులు క్రికెట్ ఆలోచనల నుంచి దూరంగా ఉంటా.



తర్వాత ఇంగ్లండ్‌తో టెస్ట్‌లకు సన్నద్ధమవుతా. ప్రతి మ్యాచ్‌లోనూ బాగానే ఆడాలని అనుకుంటాను. కానీ అన్నిసార్లూ అలా జరగదు. ఆర్సీబీతో మ్యాచ్‌లో నాకు మంచి ప్రారంభం లభించింది. దాన్ని నేను భారీ స్కోర్‌గా మలచాలి అనుకున్నాను. అలాగే నేను ఇప్పటికీ ఉత్తమ ఆటగాళ్ల నుంచి నిరంతరం నేర్చుకుంటూనే ఉంటా' అని రిషభ్ పంత్ తన మనసులోని మాటల్ని బయటపెట్టాడు.

# గుల్వీర్ పసిడి పరుగు

గుల్వీర్ గమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తొలిరోజే భారత్ పసిడి బోణీ కొట్టింది. 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్ స్వర్ణం గెలుచుకున్నాడు. అతడు 28 నిమిషాల 38.63 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. మెబుకి సుజుకి (జపాన్, 28 నిమిషాల 43.84 సె) రజతం, ఆల్బర్ట్ రోప్ (బహ్రెయిన్, 28 నిమిషాల 46.82సె) కాంస్యం సొంతం చేసుకున్నారు. భారత అథ్లెట్ సవాన్ బర్వాల్ (28 నిమిషాల 50.53 సె) కొద్దిలో పతకాన్ని కోల్పోయాడు. యూపీలోని అలీగఢ్‌లో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన గుల్వీర్.. ఈ ఏడాది ఆరంభంలోనే 10 వేల మీటర్లలో జాతీయ రికార్డు (27 నిమిషాల 00.22 సె) నెలకొల్పాడు. 5 వేల మీటర్లలోనూ జాతీయ రికార్డు (12 నిమిషాల 59.77 సెకన్లు) అతడి ఖాతాలోనే ఉంది. 20 కి.మీ రేస్‌వాక్‌లో సెబాస్టియన్ కాంస్యం గెలుచుకున్నాడు. అతడు గంట 21 నిమిషాల 13.5 సెకన్లలో రేసు పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచాడు. వాంగ్ (చైనా, గంట 20 నిమిషాల 36 సెకన్లు) రజతం, యోషికవా (జపాన్, గంట 20 నిమిషాల 44.9 సెకన్లు) కాంస్యం గెలుచుకున్నారు. ఇదే ఈవెంట్లో అమిత్ (గంట 22 నిమిషాల 14.3 సెకన్లు) అయిదో స్థానంలో నిలిచాడు. డెకథ్లాన్‌లో తేజస్విన్ శంకర్ (4205)




అగ్రస్థానంలో నిలిచాడు. తొలిరోజు అతడు 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్, 400 మీటర్ల పరుగులో పోటీపడ్డాడు. 110 మీటర్ల హర్డిల్స్, డిస్కస్‌త్రో, పోల్‌వాల్ట్, జావెలిన్‌త్రో, 1500 మీటర్లలో బరిలో దిగాల్సి ఉంది. పురుషుల 400 మీటర్లలో విశాల్ ఫైనల్ చేరాడు. సెమీస్‌లో 46.05 సెకన్లలో లక్ష్యాన్ని అందుకుని హీట్-2లో మూడో స్థానంలో నిలిచాడు. పురుషుల 1500 మీటర్లలో యూనస్ షా (3 నిమిషాల 46.96 సె) పతకపోరులో అడుగుపెట్టాడు. మహిళల 400 మీటర్లలో రుపల్ చౌదరి (53.00 సె), విత్య (53.32 సె) పతక రౌండ్ చేరారు. జావెలిన్‌లో అన్నురాణి నిరాశపరిచింది. ఆమె 58.30 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి నాలుగో స్థానంలో నిలిచింది. బుధవారం మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి బరిలో దిగనుంది.

# రిషభ్ పంత్ సామర్థ్యం మీద మాకు సందేహం లేదు: జహీర్ ఖాన్



ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రిషభ్‌పంత్ ( పెద్దగా పరుగులు చేయలేదు. అయినప్పటికీ అతడి శక్తి, సామర్థ్యాల మీద తమకు ఏమాత్రం సందేహం లేదని, పంత్‌పై పూర్తి విశ్వాసం ఉందని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మెంటార్ జహీర్ ఖాన్ అన్నాడు. ఐపీఎల్ మెగావేలంలో రికార్డు స్థాయిలో రూ.27 కోట్ల ధర పలికిన రిషభ్ ఈ టోర్నీలో అంతగా రాణించలేదు. 13 ఇన్నింగ్స్‌ల్లో 269 పరుగులు మాత్రమే చేయగలిగాడు. మంగళవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో మాత్రం అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 61 బంతుల్లోనే 118 పరుగులతో అజేయంగా నిలిచాడు. పంత్ విజృంభించి ఆడినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఆర్సీబీనే విజయం సాధించింది.

'రిషభ్ పంత్ ఒక మంచి నాయకుడు. అది మాకు సానుకూలాంశం. ఈ సీజన్‌లో బ్యాటింగ్ ఫామ్ విషయానికొస్తే.. అతడికి ఇదో లర్నింగ్ ఎక్స్‌పీరియన్స్. కానీ పంత్ శక్తి, సామర్థ్యాల మీద ఎవ్వరికీ ఏ అనుమానమూ లేదు. అతడు ఈ సీజన్‌లో చివరి మ్యాచ్‌లో తన సెంచరీతో అందరికీ ఓ సందేశం ఇచ్చాడు' అని జహీర్ ఖాన్ ( మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. అలాగే ఈ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ( ప్రదర్శన గురించి కూడా మాట్లాడాడు. 'ఐపీఎల్ సీజన్ ప్రారంభం నుంచీ, ప్లేఆఫ్స్ చేరుకోవాలనే ఆశయంతోనే ఆడాలి. మేం కూడా ఆ ప్రయత్నమే చేశాం. కానీ ఈ సీజన్‌లో మేం గాయాల కారణంగా పలువురు ప్రధాన బౌలర్ల సేవలను కోల్పోయాం. అయినప్పటికీ ముందుకు సాగడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాం. బౌలింగ్‌లో పలు కాంబినేషన్లను ప్రయత్నించాం. కానీ దురదృష్టవశాత్తు మేం ఈ యత్నంలో విజయం సాధించలేదు. అయితే బ్యాటింగ్ విభాగంలో మాత్రం బలంగానే ఉన్నాం. ఐదెన్ మార్‌క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ వంటి విదేశీ బ్యాటర్లతో జట్టు సమతూకంగానే ఉంది' అని జహీర్ ఖాన్ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు.

# అజరెంకా ఫటాఫట్

అజరెంక పారిస్: ఫ్రెంచ్ ఓపెన్లో విక్టోరియా అజరెంకా అదరగొట్టింది. దూకుడైన ఆటతో ఈ బెలారస్ స్టార్ తేలిగ్గా రెండో రౌండ్లో ప్రవేశించింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 6-0, 6-0తో విక్‌మేయర్ (జర్మనీ)ని చిత్తు చేసింది. కేవలం 48 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో అజరెంకా జోరు ముందు విక్‌మేయర్ ఏమాత్రం నిలవలేకపోయింది. ప్రత్యర్థి ఒక్క గేమ్ కూడా గెలిచే అవకాశం ఇవ్వని అజరెంకా.. ఆరుసార్లు విక్‌మేయర్ సర్వీస్ బ్రేక్ చేసి ఘన విజయాన్ని అందుకుంది. ఈ క్రమంలో 3 ఏస్‌లతో పాటు 15 విన్నర్లు కొట్టింది. ఓపెన్ శకంలో గ్రాండ్‌స్లామ్ మెయిన్‌డ్రా మ్యాచ్‌ను 6-0, 6-0తో నెగ్గిన పెద్ద వయస్కురాలిగా 35 ఏళ్ల అజరెంకా ఘనత సాధించింది. రెండోసీడ్ కొకోగాఫ్ (అమెరికా) ముందంజ వేసింది. ఆమె 6-2, 6-2తో గాడ్కి (ఆస్ట్రేలియా)పై నెగ్గింది. ఈ మ్యాచ్‌లో ఆమె ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. ఆరోసీడ్ ఆంద్రీవా (రష్యా) 6-4, 6-3తో బుసా (స్పెయిన్)పై, కెనిన్ (అమెరికా) 6-3, 6-1తో గ్రిచెవా (ఫ్రాన్స్)పై, వొంద్రుసోవా (చెక్) 6-4, 6-4తో సెలెక్‌మెటెవా (రష్యా)పై, జెస్సికా పెగులా (అమెరికా) 6-2, 6-4తో టాడ్‌ని (రొమేనియా)పై నెగ్గారు. సకారి (గ్రీస్), జాబెర్ (ట్యూనీసియా) ఓడిపోయారు. సకారి 3-6, 6-7 (4-7)తో జాక్‌మోట్ (ఫ్రాన్స్)



చేతిలో.. జాబెర్ 6-7 (4-7), 0-6తో ఫ్రెచ్ (పోలెండ్) చేతిలో పరాజయం పాలయ్యారు

జకోవిచ్ శుభారంభం: రికార్డు స్థాయిలో 25వ టైటిల్‌పై గురిపెట్టిన సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఈ ఆరో సీడ్ 6-3, 6-3, 6-3తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై విజయం సాధించాడు. అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన నొవాక్.. పెద్దగా కష్టపడకుండానే నెగ్గాడు. ఈ క్రమంలో 7 ఏస్‌లు, 32 విన్నర్లు కొట్టాడు. రష్యా స్టార్ ఆంద్రీ మెద్వెదెవ్ తొలి రౌండ్లోనే ఓడిపోయాడు. అతడు 5-7, 3-6, 6-4, 6-1, 5-7తో నోరి (బ్రిటన్) చేతిలో కంగుతిన్నాడు. తొలి రెండు సెట్లు ఓడినా.. మెద్వెదెవ్ పోరాడాడు. తర్వాతి రెండు సెట్లు నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. అయిదో సెట్లో కీలక సమయంలో తడబడి మ్యాచ్ చేజార్చుకున్నాడు. టాప్‌సీడ్ సినర్ (ఇటలీ), మూడోసీడ్ జ్వెరెవ్ (జర్మనీ), తొమ్మిదో సీడ్ డిమెనర్ (ఆస్ట్రేలియా) శుభారంభం చేశారు. సినర్ 6-4, 6-3, 7-5తో రిండర్‌నెచ్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. జ్వెరెవ్ 6-3, 6-4, 6-4తో థియెన్ (అమెరికా)పై నెగ్గగా.. డిమెనర్ 6-3, 6-4, 7-6 (8-6)తో లాస్లో జెర్ (సెర్బియా)పై గెలిచాడు. క్వినెన్ (అమెరికా)తో మ్యాచ్‌లో 6-2, 6-3, 2-6తో ఉన్నప్పుడు 16వ సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా) గాయంతో పోటీ నుంచి తప్పుకున్నాడు.

# దినేశ్ కార్తీక్ మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి: జితేశ్ శర్మ

ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ), లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ( తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ జట్టు 20 ఓవర్లకు మూడు వికెట్లు నష్టపోయి 227 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన బెంగళూరు 18.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 230 రన్స్ చేసింది. లఖ్‌నవూ మీద ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 33 బంతుల్లోనే 85 పరుగులు చేసి ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించిన జితేశ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్'గా నిలిచాడు. తాను బ్యాటింగ్‌కు వెళ్లడానికి ముందు తమ మెంటార్ దినేశ్ కార్తీక్ చెప్పిన మాటలే స్ఫూర్తిని నింపాయని జితేశ్ అన్నాడు.

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్సీబీ 123 పరుగుల వద్ద 4 వికెట్లు కోల్పోయింది. ఛేజ్ మాస్టర్‌గా పేరున్న విరాట్ కోహ్లీ 12వ ఓవర్లో తన వికెట్




కోల్పోయాడు. అప్పుడు క్రీజులోకి జితేశ్ వచ్చాడు. అక్కడి నుంచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 257.58 స్ట్రైక్‌రేట్‌తో 85 పరుగులు చేశాడు. మయాంక్ అగర్వాల్‌తో కలిసి 107 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం జితేశ్ ఆనందం వ్యక్తం చేశాడు.

'నా సంతోషాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. ఇలా ఆడానన్న విషయాన్ని ఇంకా నమ్మలేకపోతున్నా. విరాట్ కోహ్లీ అవుట్ అయిన తర్వాత బ్యాటింగ్‌కు వెళ్లాను. మా మెంటార్ దినేశ్ కార్తీక్.. 'బాగా ఆడి.. జట్టును గెలిపించు' అని సూచించాడు. ఆ మాటలే నాలో స్ఫూర్తిని నింపాయి.

# సింధు, ప్రణయ్ శుభారంభం

సింగపూర్: భారత స్టార్ షట్లర్లు వి.వి.సింధు, హెచ్.ఎస్.ప్రణయ్‌లు సింగపూర్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 21-14, 21-9తో వెన్ జాంగ్ (కెనడా)పై గెలిచి ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. మాళవిక బాన్సోద్ 21-14, 18-21, 11-21తో సుపనిద (థాయ్‌లాండ్) చేతిలో, రక్షిత శ్రీ 14-21, 8-21తో కిమ్ యున్ (కొరియా) చేతిలో, అన్మోల్ ఖర్బ్ 11-21, 22-24తో చెన్ యుఫెయ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రణయ్ 19-21, 21-16, 21-14తో రస్‌మున్ గెమ్కీ (డెన్మార్క్)పై నెగ్గి ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రియాన్షు రజావత్ 21-14, 10-21, 14-21తో కొడయ్ నరవొక (జపాన్) చేతిలో, కిరణ్ జార్జ్ 19-21, 17-21తో వెంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో 18-21, 13-21తో చెంగ్ షింగ్- జాంగ్ షి (చైనా) చేతిలో, అశిత్




సూర్య- అమృత 11-21, 17-21తో యూచి షిమోగమి- సయాక హొబారా (జపాన్) చేతిలోబీ మహిళల డబుల్స్‌లో కవిప్రియ- సిమ్రన్ 4-21, 9-21తో బేక్ హా- లీ హీ (కొరియా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించారు.

# ఎప్పుడూ మనసు చెప్పేదే వింటాను: దీపికా పదుకొణె



ఎప్పుడూ తన మనసు చెప్పేదే వింటానన్నారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె ఏ కార్యక్రమంలోనైనా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచే ఆమె.. తాజాగా ఓ ఫ్యాషన్ షోలో హొయలొలికించారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "జీవితంలో బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే నిజాయతీ ముఖ్యం. నేను దానికే ప్రాధాన్యతనిస్తాను. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నా మనసు చెప్పేది వింటాను. ఆ తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాను" అని దీపికా చెప్పారు.

రెండు రోజులుగా దీపికా పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తన సినిమాను లీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ ఒక స్టార్ డైరెక్టర్ చేసిన కామెంట్స్ ఆమెను ఉద్దేశించే అంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాయతీ గురించి దీపికా చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ఆ వివాదాన్ని ఉద్దేశించే అనుకుంటున్నారు.

దీపికా చివరిసారిగా 'సింగం అగైన్'లో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.

# 'భైరవం'కు పోరాటాలే ఆకర్షణ



'భైరవం' రీమేక్ చిత్రమైనప్పటికీ మాతృకను చూసిన వాళ్లకు కూడా దీన్ని చూస్తే ఒరిజినల్ సినిమా చూసిన అనుభూతే కలుగుతుంది'' అన్నారు నటుడు నారా రోహిత్ . ఆయన.. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్ ( ప్రధాన పాత్రధారులుగా విజయ్ కనకమేడల తెరకెక్కించిన చిత్రమే 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు నారా రోహిత్. ఆ విశేషాలివి..

## చిన్న విరామమే అనుకున్నా.. కానీ!

''నేను సినిమాలకు దూరంగా ఉండటానికి ప్రత్యేక కారణాలేం లేవు. నిజానికి నేను ఓ చిన్న బ్రేక్ తీసుకోవాలనుకున్నా.. కానీ అది కాస్త పెద్ద బ్రేక్ అయింది (నవ్వుతూ). ఇకపై మాత్రం గ్యాప్ లేకుండా రెగ్యులర్‌గా సినిమాలొస్తాయి. ఈ 'భైరవం' విషయానికొస్తే.. ఈ కథ గురించి నిర్మాత బెల్లంకొండ సురేశ్ నాకు ఫోన్ చేసి చెప్పారు. నాకు ఆయన జడ్జిమెంట్‌పై నమ్మకముంది. శశి కుమార్ పాత్ర గురించి చెప్పాక.. నేనూ 'గరుడన్' సినిమా చూశా. ఇదొక విశ్వజనీనమైన కథ అనిపించింది. తమిళంలో దీన్ని ఒక రస్టిక్ విలేజ్ డ్రామాగా రూపొందించారు. దీన్ని దర్శకుడు విజయ్ కనకమేడల బృందం తెలుగు నేటివిటీకి తగ్గట్లుగా చక్కగా మార్పులు చేసింది. నేను గతంలో యాక్షన్ సినిమాలు చేశాను గానీ ఇంత కమర్షియల్ మాస్ సినిమా ఎప్పుడూ చేయలేదు. ఇది నటుడిగా నాకు కొత్త అనుభూతిని అందించింది. ఇప్పుడు ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా".

## ఆ యాక్షన్ సీక్వెన్స్ గొప్ప అనుభూతినిస్తుంది

''ఇది ఒరిజినల్‌గా దర్శకుడు వెట్రిమారన్ కథ. దీంట్లో ప్రాధాన్యత లేని పాత్రంటూ ఏదీ లేదు. ఈ కథలో ప్రతి పాత్రా కీలకమే. ఈ సినిమాలో చాలా యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. అవి ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. చాలా రోజుల తర్వాత ఇంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడాన్ని ఎంతో ఆస్వాదించా. నేను.. బెల్లంకొండ శ్రీనివాస్ ( మంచు మనోజ్ కలిసి చేసిన ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్ చాలా అద్భుతంగా వచ్చింది. అది ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తుంది. దర్శకుడు విజయ్‌కు కథ పట్ల.. తన టేకింగ్ పట్ల చాలా స్పష్టత ఉంది. ఒక సీన్ తీస్తున్నప్పుడే దాని ఎడిటింగ్ ప్యాటర్న్ మొత్తం తన మైండ్‌లో ఉంటుంది".

## ప్రతి పాత్రలోనూ ఓ లోతు ఉంటుంది!

''నాకు.. బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్‌లతో ఎప్పట్నుంచో పరిచయం ఉంది. వ్యక్తిగతంగా మా మధ్య మంచి అనుబంధం ఉంది. అది ఈ చిత్రంతో మరింత బలపడింది. ఈ సినిమాలో మా ముగ్గురు పాత్రలకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. ప్రతి పాత్రలోనూ ఓ ఎమోషనల్ డెప్త్ ఉంటుంది. ఈ చిత్రంలో జయసుధ బామ్మ పాత్ర వేశారు. ఆమెతో కలిసి పని చేయడం ఆనందాన్నిచ్చింది. నిజానికి ఇలా ముగ్గురు హీరోలతో ఓ సినిమా చేయడం అంత తేలికేం కాదు. కానీ, మా నిర్మాత రాధామోహన్ ఎక్కడా రాజీ పడకుండా దీన్ని నిర్మించారు. ఆయన లాంటి నిర్మాతలు పరిశ్రమకు ముఖ్యం".

## హారర్ తప్ప!

''భైరవం' తర్వాత నా నుంచి 'సుందరకాండ' సినిమా వస్తుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. జులైలో విడుదల చేసే అవకాశముంది. ఆ వెంటనే ఆగస్టులో మరో కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించనున్నా. నాకు హారర్ తప్ప అన్ని సినిమాలు ఇష్టమే. డబ్బులు ఇచ్చి భయపడటం ఎందుకనిపిస్తుంది (నవ్వుతూ). 'అప్పట్లో ఒకడుండేవాడు' సినిమాకి సీక్వెల్ చేయాలన్న ఆలోచన ఉంది. గతంలో దీనిపై వర్క్ కూడా చేశాం కానీ, మెటీరియలైజ్ అవ్వలేదు. భవిష్యత్తులో కుదురుతుందేమో చూడాలి. మంచి కథలొస్తే.. నిర్మాతగానూ సినిమాలు చేస్తా".

# థియేటర్ల బంద్.. ఎవరో మిస్ గైడ్ చేశారు: రాజేంద్రప్రసాద్



థియేటర్‌ల బంద్ చిన్న విషయం కాదన్నారు సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ( తన తాజా చిత్రం 'షష్టిపూర్తి' ప్రీరిలీజ్ వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'లేడీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్, ఆకాంక్ష సింగ్ కీలకపాత్రల్లో నటించారు. పవన్ ప్రభ దర్శకుడు. మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు.

"థియేటర్‌లు మూసేయడం అనేది ఒకరు చెబితే చేసేది కాదు. అది సమష్టిగా తీసుకోవాల్సిన నిర్ణయం. దీన్ని ఎవరో మిస్ గైడ్ చేశారు. చివరకు ఏమైంది.. అది నిలబడలేదు కదా. పవన్ కల్యాణ్ ఫీల్ అయ్యాడంటే అది సరైనదే అవుతుంది. ఇలాంటివి సృష్టించిన వారిని కనిపెడితే ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుంది. థియేటర్లను బంద్ చేస్తాం అనే మాట చిన్నది కాదు.. ఇలాంటివి ఇంకెప్పుడూ జరగకూడదని కోరుకుంటున్నాను. పవన్ ఈ విషయంలో బాధ్యత తీసుకొని దీని వెనక ఎవరున్నారో కనిపెట్టాలని కోరడం హర్షించదగ్గ విషయం" అని అన్నారు.

తన కెరీర్ గురించి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ జేబు నింపుకోవడానికి సినిమాలు చేయలేదు. ఒకవేళ నేను సంపాదించిన డబ్బును కొందరు హీరోలు పెట్టుబడులు పెట్టినట్లు పెట్టి ఉంటే ఈ పాటికి మద్రాను, హైదరాబాద్‌లలో వేల కోట్ల రూపాయల ఆస్తులుండేవి. సంపాదన గురించి పట్టించుకోకుండా సినిమాలు చేశాను. మంచి పాత్ర అవునా.. కాదా అనేది మాత్రమే చూస్తాను. పవన్ కల్యాణ్ నాకు తమ్ముడితో సమానం. ఆయన సినిమాలో నటించడం ఎందుకో కుదర్లేదు. త్వరలోనే ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

# ఎన్టీఆర్-హృతిక్ పాటకు అంతా సిద్ధం



తెలుగు, హిందీ చిత్రపరిశ్రమలకు చెందిన ఇద్దరు అగ్రతారలు ముఖాముఖి యుద్ధం చేస్తే.. అది ఎలా ఉంటుందో 'వార్ 2'తో ) చూపించడానికి సిద్ధమవుతున్నారు ఎన్టీఆర్, హృతిక్ రోషన్. వీరిద్దరు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ ( కథానాయిక. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ సినీప్రియుల్ని అదరగొట్టింది. ఇప్పుడీ ఈ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం బాలీవుడ్‌లో సందడి చేస్తోంది. ఎన్టీఆర్ (%చీ=%), హృతిక్ నేపథ్యంలో 'నాటు నాటు' తరహాలో ఓ పాట ఉండనున్న సంగతి తెలిసిందే. తాజాగా దీని చిత్రీకరణను జూన్ చివరి వారంలో మొదలు పెట్టడానికి దర్శకుడు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "రెండు నెలలుగా బృందం ఈ డ్యాన్స్ కోసం ఏర్పాట్లు చేస్తోంది. కానీ హృతిక్ గాయం కారణంగా షూట్‌ను రద్దు చేసుకోవలసి వచ్చింది. ఇప్పుడు ఆయన కోలుకోవడంతో ఇద్దరు తారలు జూన్‌లో ఈ పాట షూట్‌ను ప్రారంభిస్తారు. దీని కోసం యశ్ రాజ్ స్టూడియోలో భారీ సెట్‌ను సిద్ధం చేశార"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఆగస్టు 14న విడుదల కానుందీ చిత్రం.

# సూర్య తెలుగు సినిమా చిత్రీకరణ సన్నాహాలు..



కథానాయకుడు సూర్య ) తన కొత్త తెలుగు సినిమా చిత్రీకరణను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మమితా బైజు ( కథానాయిక. రవీనా టాండన్, రాధిక శరత్ (కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ సినిమా.. ఇప్పుడు రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమైంది. హైదరాబాద్‌లో మొదలు కానున్న ఈ చిత్ర తొలి షెడ్యూల్ కోసం.. జూన్ రెండో వారంలో సూర్య సెట్లోకి అడుగు పెట్టనున్నట్లు సమాచారం. దీనికోసం చిత్ర బృందం కొన్ని ప్రత్యేక సెట్లు సిద్ధం చేయిస్తున్నట్లు తెలిసింది. ఇది వెంకీ శైలిలో సాగే ఓ చక్కటి ఆసక్తికర కథతో రూపొందనుంది. తెలుగు, తమిళ భాషల్లో నిర్మితం కానున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న సూర్య – ఆర్జే బాలాజీల సినిమా జూన్ 2నాటికి చిత్రీకరణ పూర్తి చేసుకోనున్నట్లు తెలుస్తోంది.




# ఫహాద్‌తో కలిసి పనిచేయాలనుకుంటున్నా

మరికొద్ది రోజుల్లో 'ఆల్ఫా'తో తనలోని యాక్షన్ కోణాన్ని తెరపై ఆవిష్కరించడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ అందాల తార అలియా భట్ ఇప్పుడామె మలయాళ విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్‌తో నటించాలనుకుంటున్నట్లు తన మనసులోని మాటను బయటపెట్టింది.

ఇటీవలే కేన్స్‌లో ( మెరిసిన ఈ భామ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ ఫహాద్ పట్ల తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేసింది. "ఫహాద్ నిజంగా నేను ఆరాధించే నటుల్లో ఒకరు. ఆయన చాలా అద్భుతమైన నటుడు. ఆయన నటించిన చిత్రాల్లో 'ఆవేశం' నాకు చాలా ఇష్టం. కచ్చితంగా అవకాశం వస్తే అతనితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా" అని చెప్పుకొచ్చింది. "ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా సినిమాల్ని ఆస్వాదిస్తున్నారు ప్రేక్షకులు. అందుకే చిత్రపరిశ్రమలన్నీ ఒకే యూనిట్ అని మహమ్మారి రోజుల్లో తెలుసుకున్నా" అని అంది అలియా. ప్రస్తుతం 'లవ్ అండ్ వార్' సినిమా చిత్రీకరణలో ఉందామె.

# అభ్యంగన ఉత్తేజం

వ్యాధులకు చికిత్స చేయటమే కాదు, అసలు జబ్బుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికీ మన ప్రాచీన ఆయుర్వేదం అత్యధిక ప్రాధాన్యమిస్తుంది. ఇందుకోసం ఆయా కాలాలు, రోజుల్లో పాటించాల్సిన నియమాలను రుతుచర్య, దినచర్య రూపంలో ప్రముఖంగా ప్రస్తావించింది. వీటిల్లో ఒకటి అభ్యంగనం. అంటే నూనె వంటి స్నిగ్ధ ద్రవ్యాన్ని ఒంటికి రాసుకోవటం. ఇది శరీరానికి ఉత్తేజితం కలిగించటం, రోజువారీగా పడే ఒత్తిళ్ల నుంచి కాపాడటంతో పాటు పలు వ్యాధులకు చికిత్సగానూ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా వాతదోషాన్ని పరిహరించటం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి దీని ప్రాముఖ్యత, ప్రయోజనాలు, విధానాల గురించి విపులంగా తెలుసుకుందాం.



ఆరోగ్యం ఎవరో ఇచ్చే బహుమతి కాదు. మనకు మనమే ప్రతిరోజూ, ప్రతి గంటా, ప్రతి క్షణమూ సంపాదించుకోవాలి. ఇందుకు అభ్యంగనం ఎంతగానో తోడ్పడుతుంది. కొందరు దీన్ని పంచకర్మ చికిత్స అనీ అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. పంచకర్మ చికిత్సకు ముందు చేసే పద్ధతుల్లో ఇది ఒకటి. నూనె, నెయ్యి వంటి స్నిగ్ధ గుణం గల ద్రవ్యంతో శరీరం మీద ఏమాత్రం ఒత్తిడి పడకుండా అభ్యంగనం చేస్తారు. శిశువులకు ఒకప్పుడు రోజూ నువ్వుల నూనె లేదా ఆముదం రాసేవారు. ఇప్పుడు బేబీ ఆయిల్స్ రాస్తున్నారు. ఒకరకంగా ఇదీ అభ్యంగనమే.

ఎలా చేయాలి?

ఉదయం నిద్ర లేచాక కాల కృత్యాలు తీర్చుకొని, అభ్యంగనానికి ఉపక్రమించాలి. సాధారణంగా ఇంట్లో ఎవరికివారు కూర్చునో, నిల్చునో ఒంటికి నూనె రాసుకోవచ్చు. చికిత్స పరంగానైతే దీన్ని ఏడు భంగిమల్లో చేస్తారు. ముందు బోర్లా, వెల్లకిలా.. ఎడమ, కుడి పక్కలకు తిప్పి.. కూర్చోబెట్టి, కాళ్లు మడచి పాదాలకు నూనె రాసిన తర్వాత తిరిగి వెల్లకిలా లేదా బోర్లా పడుకోబెట్టి ముగిస్తారు. సున్నితంగా, మృదువుగా శరీరానికి హాయి భావన కలిగేలా నూనె రాయటం ప్రధానం. ఏమాత్రం ఒత్తిడి పడనీయద్దు. చేతికి, చర్మానికి మధ్య నూనె పలుచటి పొరలా ఉండాలి. వెంట్రుకలు వాలి ఉన్న వైపునకే నూనె రాయాలి. వ్యతిరేక దిశలో రాయొద్దు.

శరీరంలో పై నుంచి కింది భాగాలకు.. అంటే ముందు మాడు, ముఖం, చెవులు, మెడ, భుజాలు, చేతులు, వీపు, ఛాతీ, పొట్ట, తొడలు, పిక్కలు, మడమలు, పాదాలు.. ఇలా వరుసగా నూనె రాసుకోవాలి. కాసేపయ్యాక మెత్తటి సున్నిపిండి, శనగపిండి, మూలికల పొడి వంటి వాటిల్లో ఏదో ఒకదాంతో రుద్దుకొని.. తర్వాత స్నానం చేయాలి. ఇలాంటి పొడులు నూనెను పీల్చుకొని, శరీరాన్ని త్వరగా శుభ్రం చేస్తాయి. అప్పుడు నీటితో కడుక్కుంటే హాయిగా ఉంటుంది.

అభ్యంగనం ప్రతిరోజూ చేయాలన్నది శాస్త్ర నియమం. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఇది అందరికీ కుదరకపోవచ్చు. కానీ వీలున్నప్పుడల్లా.. కనీసం సెలవులు, పండుగ రోజుల్లోనైనా చేయటం మంచిది. రోజూ అభ్యంగనం చేసేవారు 15, 30 నిమిషాలు ఆగి స్నానం చేయొచ్చు. ఎప్పుడో ఒకసారి చేసుకునేవారైతే 40 నిమిషాలు ఆగితే మేలు.

రోజూ వ్యాయామం చేసేవారు.. కండలు, ఫిట్‌నెస్ పెంచుకోవటానికి మరింత ఎక్కువగా వ్యాయామాలు చేసేవారు, తరచూ మద్యం తాగేవారు, శృంగారాసక్తి అధికంగా గలవారు ప్రతి రోజూ అభ్యంగనం చేసుకోవటం మంచిది. దీంతో రోజువారీ పనుల్లో భాగంగా శరీర కణాలు త్వరగా దెబ్బతినకుండా చూసుకోవచ్చు.

రకరకాలుగా..

సర్వాంగ అభ్యంగనం: ఇది శరీరమంతటా చేసేది. దీంతో శరీరం బలంగా, ఆరోగ్యంగా తయారవుతుంది. దురదలు, తిమ్మిర్లు దరిజేరవు.

శిరో అభ్యంగనం: తలకు మాత్రమే చేసేది. విశ్రాంతి కలగజేస్తుంది. తలనొప్పి, ముక్కుగదుల సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

ఏకాంగ అభ్యంగనం: ఏదో ఒక అవయవానికి చేసేది. నొప్పి, కండరాల బలహీనత తగ్గిస్తుంది.

పాద అభ్యంగనం: పాదాలకు మాత్రమే చేసేది. నిద్ర బాగా పడుతుంది. కళ్లకు మేలు చేస్తుంది. అలసట, కండరాల బలహీనత తగ్గుతుంది. శ్రమను మరిపిస్తుంది. పాదాలు పగలకుండా చూస్తుంది.

పరిమితులు లేకపోలేదు

అజీర్ణం, కడుపులో మంట, తేన్పులు, కామెర్లు, జ్వరం, కఫం (జలుబు, దగ్గు) ఎక్కువగా ఉన్నప్పుడు అభ్యంగనం చేసుకోకూడదు. పంచకర్మలు చేసిన వెంటనే కూడా దీన్ని చేయరాదు. శరీరంలో ఎక్కడైనా వాపుతో కూడిన జబ్బులు, దెబ్బలు, ఎముకలు విరగటం, కీలు జారినా చేయరాదు.

ఏంటీ ప్రయోజనం?

అభ్యంగనం శారీరకంగానే కాకుండా మానసిక స్థాయిలోనూ పనిచేస్తుంది. మృదువుగా శరీరాన్ని నూనెతో రుద్దటం వల్ల వేడి జనిస్తుంది. రక్త ప్రసరణ పుంజుకుంటుంది. ఇది లింఫు వ్యవస్థ సక్రమంగా పనిచేయటానికీ తోడ్పడుతుంది. ఫలితంగా కణజాలాల నుంచి విషతుల్యాలు తేలికగా బయటకు వస్తాయి. అలాగే రక్తంలోకి పోషకాలు ఇంకాస్త ఎక్కువగానూ చేరతాయి. ఇక స్పర్శ మూలంగా నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. శరీర వృద్ధి కారకాలు మరింత ఎక్కువగా ప్రసరణ అవుతాయి. అన్ని వ్యాధులకూ వాత, పిత్త, కఫ దోషాలే కారణమని ఆయుర్వేదం చెబుతుంది. ముఖ్యంగా వాత దోషం త్వరగా వృద్ధాప్యం ముంచుకొచ్చేలా చేస్తుంది. చర్మం ఎండిపోవటం, ముడతలు పడటం, ఎముకలు పెళుసు బారటం, వెంట్రుకలు రాలటం, కాళ్ల పగుళ్లు, కళ్ల మంటలు, కళ్లు పొడిబారటం వంటివన్నీ దీంతో వచ్చేవే. అభ్యంగనం వాత దోషాన్ని పరిహరించటం ద్వారా ఇలాంటి సమస్యలను కొంతవరకు ముందే నిలువరిస్తుంది. శరీరం మీద రోజువారీ పడే ఒత్తిళ్లను తట్టుకునే శక్తిని కలగజేస్తుంది. చర్మాన్ని మృదువుగా, నిగనిగలాడేలా చేస్తూ వృద్ధాప్య ఛాయలను తగ్గిస్తుంది. మానసిక ప్రశాంతతకు, కంటి నిండా నిద్ర పట్టటానికీ తోడ్పడుతుంది. దాహం, ఆకలి, విరేచనం, మూత్ర విసర్జన వంటి 13 అధారణీయ వేగాలను ఆయుర్వేదం పేర్కొంటుంది. మనం పనుల ఒత్తిడిలో పడిపోయి వీటిని ఆపుతుంటాం. ఎప్పుడో అప్పుడంటే ఏమో గానీ తరచూ ఇలా చేస్తుంటే కిడ్నీలో రాళ్లు, మొలల వంటి సమస్యలకు దారితీస్తుంది. అభ్యంగనం వీటిని తగ్గిస్తుందని చరకుడు చెబుతారు. ఇది గుల్మం, మూర్ఛలకూ బాగా ఉపయోగపడుతుంది. హేమంత, శిశిర రుతువుల్లో చలిగాలులు, చలిని తట్టుకోవటానికీ అభ్యంగనం తోడ్పడుతుంది. మృదువుగా తయారవటం వల్ల చర్మం చలిని బాగా ఎదుర్కొంటుంది.

# కాలుష్యంతో సంతానలేమి

వాహనాల రొద, వీటి నుంచి వెలువడే పొగలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయనటంలో సందేహమేమీ లేదు. ఇవి అంతటితోనే ఆగటం లేదు. మన ఆరోగ్యం మీదా ప్రతికూల ప్రభావాలు చూపుతాయి. కాలుష్యం మూలంగా క్యాన్సర్లు, గుండెజబ్బులు తలెత్తుతున్నట్టు ఇప్పటికే కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. తాజాగా సంతానలేమి కూడా ఈ సమస్యల జాబితాలోకి వచ్చి చేరింది. సంతాన సామర్థ్యంపై వాహన కాలుష్యం వేర్వేరుగా ప్రభావం చూపుతుండటం గమనార్హం.

ప్రపంచవ్యాప్తంగా సుమారు ప్రతి ఆరుగురిలో ఒకరు సంతానలేమితో



బాధపడుతున్నారని అంచనా. దీనికి రణగొణ ధ్వనులు, కాలుష్యం కూడా కారణమవుతుండటం ఆందోళనకరం. ప్రస్తుతం సగానికన్నా ఎక్కువ జనాభా పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తున్న నేపథ్యంలో దీని మీద శాస్త్రవేత్తలూ ఎక్కువగానే ఆసక్తి చూపుతున్నారు. తాజాగా డెన్మార్క్‌లో నిర్వహించిన అధ్యయనమే ఇందుకు ఉదాహరణ. దీర్ఘకాలంగా వాయు కాలుష్యం, ట్రాఫిక్ శబ్దాలకు గురవటానికీ సంతానలేమి సమస్య పెరగటానికీ సంబంధం ఉంటున్నట్టు ఇందులో బయటపడింది. కలుషిత గాలిలోని రసాయనాలు రక్తం ద్వారా పునరుత్పత్తి వ్యవస్థలోకీ చొచ్చుకెళ్లొచ్చు. ఇవి హార్మోన్లను అస్తవ్యస్తం చేయొచ్చు. నేరుగా అండాలు, శుక్రకణాలనూ దెబ్బతీయొచ్చు. ఇలా సంతానం కలగటంలో చిక్కులకు దారితీయొచ్చు. అయితే ఆరోగ్యం మీద వాహన శబ్దాల ప్రభావం గురించి అంత స్పష్టంగా తెలియదు. ఇవి ఒత్తిడి హార్మోన్లను ప్రభావితం చేయటం ద్వారా సంతాన సామర్థ్యాన్ని దెబ్బతీసే అవకాశముందని కొన్ని పరిశోధనలు చెబుతున్న మాట మాత్రం వాస్తవం.

అధ్యయనం ఎలా?

డెన్మార్క్ అధ్యయనంలో దేశవ్యాప్త డేటా కేంద్రాల నుంచి ప్రతి ఒక్కరి సమాచారాన్నీ సేకరించారు. దీంతో ఆయా వ్యక్తుల ఆరోగ్యం, నివాస ప్రాంతం, ఉద్యోగం, చదువులు, కుటుంబం మధ్య సంబంధాల మీద అధ్యయనం చేయటం తేలికైంది. వీరిలోంచి సంతానం కోసం ప్రయత్నిస్తున్న వారిని, సంతానలేమి సమస్య నిర్ధరణ అయిన పురుషులు, స్త్రీలను గుర్తించారు. అలాగే వారు నివసిస్తున్న ప్రాంతాల్లో రోడ్డు ట్రాఫిక్ శబ్దాల తీవ్రత, వాయు కాలుష్యం మోతాదులనూ లెక్కించారు.

ఏం తేలింది?


సంతానలేమి విషయంలో మగవారిలో, ఆడవారిలో కాలుష్యం భిన్నంగా ప్రభావం చూపుతున్నట్టు బయటపడింది. మగవారిలో గాలిలో నుసి (పీఎం2.5), ఆడవారిలో వాహనాల రొద ఎక్కువగా కారణమవు తున్నాయి. ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్ణయించిన దాని కన్నా పీఎం2.5 మోతాదులు 1.6 రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల మగవారిలో సంతానలేమి ముప్పు 24% పెరుగుతున్నట్టు తేలింది. అదే 35 ఏళ్లు పైబడ్డ మహిళలకైతే సగటు వాహనాల రొద (55-60 డెసిబెల్స్) కన్నా 10.2 డెసిబెల్స్ పెరిగితే సంతానలేమి ముప్పు 14% ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. కలుషిత పర్యావరణం తక్షణ, దీర్ఘకాల ప్రభావాలకు ఎలా దారితీస్తుందో ఈ అధ్యయనం నొక్కి చెప్పింది.

ఎలా అర్థం చేసుకోవాలి?

యవ్వనం ఆరంభమైన తర్వాత మగవారిలో నిరంతరం శుక్రకణాలు ఉత్పత్తి అవుతూ వస్తుంటాయి. విషతుల్య వాయు కాలుష్య కారకాల వంటి పర్యావరణ ప్రభావాలతో మగవారిలో శుక్ర కణాల సంఖ్య, నాణ్యత దెబ్బతింటాయి. దీంతో సంతాన సామర్థ్యం అస్తవ్యస్తమవుతుంది. ఈ సామర్థ్యం ఆడవారిలో కన్నా మగవారిలో మరింత వేగంగా మారిపోవటం గమనార్హం. ఆడవారైతే పుట్టుకతోనే అన్ని అండాలతో పుడతారు. రజస్వల అయిన దగ్గరి నుంచి నెల నెలా అండాల సంఖ్య తగ్గుతూ వస్తుందే తప్ప కొత్త అండాలు ఉత్పత్తి కావు. మంచి విషయం ఏంటంటే- కాలుష్యం వంటి పర్యావరణ ప్రభావాల నుంచి తమను తాము కాపాడుకోవటానికి అండాల్లో కొంత నియంత్రణ వ్యవస్థ ఉంటుంది. అలాగని అసలే దెబ్బతినవని కాదు. కాకపోతే కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అండాల మీద శబ్ద కాలుష్యం ప్రభావం పడటానికి ఐదేళ్ల కన్నా ఎక్కువ సమయం పడుతున్నట్టు తాజా అధ్యయనంలో బయటపడింది. మొత్తమ్మీద వాయు కాలుష్యం, వాహనాల శబ్దాలు పునరుత్పత్తి వ్యవస్థ మీద గణనీయమైన ప్రభావాన్నే చూపుతున్నాయని అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం.

# పాల పళ్లూ ముఖ్యమే

బాల్యంలో వచ్చే పాల పళ్లు ఊడిపోయేవే అయినా వీటి పరిశుభ్రతా ముఖ్యమే. ఇవి నోట్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి నమలటానికి ఉపయోగపడటమే కాకుండా దవడ ఎముక వృద్ధి చెందటానికి మార్గం చూపిస్తాయి. శాశ్వత దంతాలకు అవసరమైన చోటును కల్పిస్తాయి కూడా. నిజానికి తొలి దంతం రావటానికి ముందు నుంచే శిశువుల నోటిని శుభ్రం చేయాలి. పరిశుభ్రమైన, మెత్తటి బట్టతో చిగుళ్లను తుడవాలి. పళ్లు వచ్చిన తర్వాత రోజుకు రెండు సార్లు బట్టతో లేదా మెత్తటి బ్రష్‌తో శుభ్రం చేయాలి. లేకపోతే గార పడతాయి. క్షీణించే అవకాశమూ ఉంది. పిల్లలను పడుకోబెట్టినప్పుడు నోట్లో పాలసీసా లేకుండా చూడటం ముఖ్యం. గేదె, ఆవు పాలైనా.. పాలపొడితో చేసేవైనా, పండ్ల రసాలైనా.. అన్నింటిలోనూ చక్కెర ఉంటుంది. ఇలాంటి ద్రవాలు పళ్ల మీద ఎక్కువసేపు ఉన్నట్టయితే పుచ్చిపోవచ్చు. ఒకవేళ పడుకునేటప్పుడు లేదా పాలు పట్టే సమయాల మధ్యలో సీసా నోట్లో పెట్టాలనుకుంటే అందులో కేవలం నీరు నింపి ఇవ్వటం మంచిది. పిప్పిపళ్లను ఆరంభంలోనే గుర్తించటమూ కీలకమే. కాబట్టి ఏడాది వయసులో ఒకసారి దంత నిపుణులకు చూపించాలి. పళ్లు సరిగా వస్తున్నాయా? పుచ్చిపోయే లక్షణాలున్నాయా? అనేవీ చూస్తారు. పిల్లల దంత సంరక్షణకు పాటించాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు.



# ఇన్సులిన్ నిరోధకతతో జాగ్రత్త


%శరీరంలోని అన్ని కణాలకూ గ్లూకోజు అవసరం. ఇందులో ఇన్సులిన్ పాత్ర కీలకం. ఇది ఇది తాళం చెవి మాదిరిగా పనిచేసి, కణాల్లోకి గ్లూకోజు వెళ్లటానికి తోడ్పడుతుంది. కానీ కొందరిలో కణాలు ఇన్సులిన్‌కు స్పందించవు (ఇన్సులిన్ రెసిస్టెన్స్). దీని మూలంగా 31 రకాల సమస్యలు తలెత్తుతున్నట్టు తాజాగా బయటపడింది. మహిళల్లో అకాల మరణానికీ కారణమవుతున్నట్టు తేలింది. ఇన్సులిన్ నిరోధకతకు కారణమేంటన్నది కచ్చితంగా తెలియదు. కానీ అధిక బరువు, శారీరక శ్రమ చేయకపోవటం వంటివి ప్రధానంగా దోహదం చేస్తున్నాయని భావిస్తున్నారు. దీన్ని మరింతగా అర్థం చేసుకోవటానికి చైనా పరిశోధకులు ప్రయత్నం చేశారు. యూకే బయోబ్యాంకు నుంచి 5లక్షలకు పైగా మంది జన్యు, వైద్య, జీవనశైలి సమాచారాన్ని తీసుకొని, విశ్లేషించారు. రక్తంలో గ్లూకోజు, కొవ్వుల ఆధారంగా ఇన్సులిన్ నిరోధకతను సూచించే టీవైజీ ఇండెక్స్‌ను లెక్కించారు. అధ్యయనం ఆరంభంలో టీవైజీ ఇండెక్స్ స్కోరు, ఇన్సులిన్ నిరోధకత ఎక్కువగా గలవారిలో పురుషులు, వృద్ధులు, పొగ తాగేవారు, శ్రమ అంతగా చేయనివారు, ఊబకాయులు ఉండటం గమనార్హం. వీరిని సగటున 13 ఏళ్ల పాటు పరిశీలించారు. ఇన్సులిన్ నిరోధకతతో నిద్ర సమస్యలు, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు, పాంక్రియాస్ వాపు వంటి రకరకాల జబ్బులకు సంబంధం ఉంటున్నట్టు తేల్చారు. టీవైజీ ఇండెక్స్ స్కోరు ఎంత ఎక్కువగా ఉంటే జబ్బుల ముప్పు అంత పెరుగుతోంది కూడా. మహిళల్లోనైతే ఇన్సులిన్ నిరోధకతలో పెరిగే ప్రతి ఒక్క యూనిట్‌కు మరణించే ముప్పు 11% చొప్పున ఎక్కువగా ఉంటున్నట్టు బయటపడింది.

## గొంతులో మాత్ర ఇరుక్కుందా?

మాత్రలు వేసుకున్నప్పుడు కొన్నిసార్లు గొంతులో తట్టినట్టుగానూ, కిందికి జారలేదేమోననీ అనిపిస్తుంటుంది. గొట్టాలు, చిన్న, తేలికైన మాత్రల కన్నా గుండ్రటి, బరువైన మాత్రలు తేలికగా కిందికి వెళ్తాయి. అందువల్ల కొన్ని మాత్రలు గొంతులో తట్టినట్టుగా అనిపించొచ్చు. ముఖ్యంగా యాంటీబయాటిక్ గొట్టం మాత్రలు ఇబ్బంది కలిగిస్తాయి. అయినా భయపడాల్సిందేమీ లేదు. తగినంత నీరు తాగితే ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవచ్చు. కాబట్టి మాత్ర వేసుకునేటప్పుడు కనీసం అరగ్లాసు నీరైనా తాగాలి. అలాగే 10 నిమిషాల సేపు తిన్నగా కూర్చోవాలి. కానీ మాత్ర శ్వాసమార్గంలో అడ్డుపడి, ఊపిరి తీసుకోవటం కష్టమైతే మాత్రం నిర్లక్ష్యం చేయొద్దు. సత్వరం డాక్టర్‌ను కలవాలి.

# పెళ్లి చేసుకోవచ్చా?

మీకు హెచ్‌ఎస్‌వీ నిర్ధరణ అయినప్పుడు ఎలాంటి లక్షణాలున్నాయో, ఇప్పుడు మళ్లీ పరీక్షలు చేయించుకున్నారో లేదో తెలపలేదు. సాధారణంగా హెచ్‌ఎస్‌వీ-1 నోటికి, హెచ్‌ఎస్‌వీ-2 జననాంగాలకు సోకుతాయి. అరుదుగా కొందరికి హెచ్‌ఎస్‌వీ-1 జననాంగాల్లోనూ రావొచ్చు. ఇన్‌ఫెక్షన్ తలెత్తినప్పుడు గుంపుగుంపులుగా నీటి పొక్కులు లేస్తాయి. ఇవి తీవ్రమైన మంటలు, పోట్లతో కూడుకొని ఉంటాయి. రోగనిరోధక శక్తి బలంగా ఉంటే పెద్దగా ఇబ్బంది పెట్టవు. తీవ్రతా తగ్గుతుంది. సాధారణంగా ఇన్‌ఫెక్షన్ దానంతటదే పోతుంది. కాబట్టి బాధ పడాల్సిన పనిలేదు. హాయిగా పెళ్లి చేసుకోవచ్చు.



ఒకవేళ ఇప్పుడు మీకు జననాంగాల్లో పొక్కులు, మంటలు పోట్లు ఉన్నా.. తాజా పరీక్షల్లో పాజిటివ్‌గా వచ్చినా తగు చికిత్స తీసుకోవాలి. ఎందుకంటే పొక్కులు పగిలిపోయి, చిన్న చిన్న పుండ్లు పడతాయి. 24 గంటల్లోనే చికిత్స తీసుకుంటే తిరగబెట్టే అవకాశం తక్కువ. లేకపోతే వైరస్ నాడుల్లోకి చేరి, రోగనిరోధకశక్తి క్షీణించినప్పుడు తీవ్రమవుతుంది. రెండు, మూడు వారాలకోసారి మళ్లీ మళ్లీ పొక్కులు లేస్తాయి. ఏడాదికి ఐదారు సార్లు పొక్కులు ఉద్ధృతంగా ఉన్నట్టయితే వైరస్‌ను అణచిపెట్టే అసైక్లోవిర్ వంటి మందులు వాడుకోవాలి. వీటిని తగు మోతాదులో ఒకట్రెండు సంవత్సరాలు క్రమం తప్పకుండా వాడితే సమస్య తిరగబెట్టకుండా చూసుకోవచ్చు. ఏడాదికి ఒకసారో, రెండు సార్లో ఉద్ధృతమవుతున్నట్టయితే వారం వరకూ మందులేసుకోవాలి. పొక్కులు లేచినప్పుడు శృంగారంలో పాల్గొంటే భాగస్వామికి అంటుకోవచ్చు. కాబట్టి పొక్కులు, పుండ్లు మానేంతవరకూ శృంగారానికి దూరంగా ఉండాలి. మిగతా సమయాల్లో ఇబ్బంది ఉండదు. చికిత్స పూర్తిగా తీసుకోనట్టయితే కండోమ్ వాడుకోవాలి.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy